RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com

# భారత శక్తి ®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

SRE Cell : 9849730255
SRE TRAVELS
Kachiuguda Nanda International Lodge
Hyderabad. Ph : 66369922,66783752
Head Offfice : Chitra durga
08194-222288,222088,220288
Davangiri : 089197-25306 Royadurga - 9440333549

కలర్, బ్లాక్ అండ్ వైట్ ఆఫ్‌సెట్ ప్రింటింగ్ కోసం సంప్రదించండి
స్టడి మెటీరియల్, న్యూస్‌పేపర్స్, మేగ్జయిన్స్
అతి తక్కువ ధరలకే ప్రింటింగ్ చేయబడును
వరలక్ష్మి పబ్లికేషన్స్
సంప్రదించాల్సిన చిరునామా:
Do.No.1-70/A, Lingojiguda
Opp: HP Gas Agency, Karmanghat, Hyd-35
email: info@varalaxmi.com
Phone: 24054446
Cell: 9959655656

సంపుటి: 20 సంచిక: 42 హైదరాబాద్, శనివారం, 26 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00



# భారీ వర్షాలు.. జనం బేజారు..

హైదరాబాద్, జులై 25: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో.. హైదరాబాద్‌తోపాటు నగర శివారు ప్రాంతాల్లో గత రెండ్రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ వర్షాల కారణంగా ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు మరో రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక వర్షం.. కొంత సేపు ముసురులా.. మరికొంత సేపు భారీగా కురవడంతో పలు కాలనీలు నీట మునిగాయి. అలాగే రహదారులపైకి సైతం భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో నగరపాలక సంస్థ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆ నీరు సక్రమంగా వెళ్లే డ్రైనేజ్ మార్గం లేక పోవడంతో.. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక హైటెక్ సిటీ, ఎంజే మార్కెట్, మాదాపూర్, ఉప్పల్, కుషాయిగూడ, ముషీరాబాద్, అమీర్‌పేట్, చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్‌షుఖ్‌నగర్, కొత్తపేట్, ఎల్బీ నగర్, హయత్ నగర్, సరూర్ నగర్, కోఠి, అబిడ్స్, బేగంబజార్, పాతబస్తీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

ఇక భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వివిధ ప్రాంతాల్లో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు ఫోన్ చేసినా.. స్పందన కరువైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. జంట నగరాల శివారు ప్రాంతంలోని జలాశయాల నీటి మట్టం భారీగా పెరిగింది. మరోవైపు హుస్సేన్ సాగర్ నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. దీంతో దిగువనున్న ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇంకోవైపు.. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, పోలీసులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# తెలంగాణ కేబినెట్ భేటీ వాయిదా..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25వ తేదీన జరగాల్సిన కేబినెట్ భేటీ ఐదుగురు మంత్రులు ఢిల్లీలో ఉండటంతో తాత్కాలికంగా నిలిపివేశారు. తాజా నిర్ణయం ప్రకారం, మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.



ఈ ఐదుగురిలో ముగ్గురు మంత్రులు.. పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి.. ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ %వాదీజ% సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లినట్లు సమాచారం. ఈ సమావేశానికి సంబంధించి వారు కాంగ్రెస్ హైకమాండ్ సూచన మేరకు ఢిల్లీకి వెళ్లారు. ఇతర ఇద్దరు కీలక మంత్రులు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు.

పార్టీలో కీలక చర్చలు, సమావేశాల నిమిత్తం వారు అక్కడే మకాం వేసినట్లు తెలుస్తోంది. కాబట్టి, మంత్రివర్గ సమావేశం పూర్తిస్థాయి హాజరుతో నిర్వహించాలనే ఉద్దేశంతో, సీఎం రేవంత్ రెడ్డి 28వ తేదీకి మళ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. ముఖ్యంగా రైతుల సమస్యలు, వానాకాలం సాగు, విద్యుత్ సరఫరా, కొత్త పాలసీలు, భూ సర్వేలు, ఋణమాఫీ తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు.

# హెచ్‌సీఏ స్కామ్‌లో మరొకరు అరెస్ట్

%హైదరాబాద్, జులై 25: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవరాజ్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం మహారాష్ట్రలోని పుణెలో దేవరాజును అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చి.. మల్కాజ్‌గిరి కోర్టులో హాజరుపరిచారు. అయితే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై కేసు నమోదైన.. దాదాపు 17 రోజుల అనంతరం సీఐడీ పోలీసులకు దేవరాజు చిక్కారు. ఈ 17 రోజుల్లో దాదాపు 7 రాష్ట్రాల్లో దేవరాజు పర్యటించినట్లు ఈ సందర్భంగా పోలీసులు గుర్తించారు.





అయితే దేవరాజును గాలించేందుకు 6 ప్రత్యేక బృందాలను సీఐడీ అధికారులు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో కుంభకోణం వెలుగులోకి రాగానే.. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ సమాచారంతో సీఐడీ నుంచి దేవరాజు తప్పించుకున్న విషయం విదితమే. దీంతో ఆయనను పట్టుకునేందుకు సీఐడీ బృందాలు.. ఈ 17 రోజుల్లో 7 రాష్ట్రాలు తిరిగాయి. చివరకు పుణెలో దేవరాజును అదుపులోకి తీసుకున్నారు. సీఐడీ అధికారులు దాదాపు 36 గంటల పాటు నిర్విరామంగా పని చేసి.. పుణెలో దేవరాజును అరెస్ట్ చేశారు.

సీఐడీ నుంచి దేవరాజు తప్పించుకున్న తర్వాత.. హైదరాబాద్, భద్రాచలం, కాకినాడ, వైజాగ్, తిరుపతి, నెల్లూరు, చెన్నై, కాంచీపురం, బెంగళూరు, గోవా, పుణె, ఊటీ, యానాం తదితర ప్రదేశాల్లో దేవరాజు పర్యటించినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. ఇతర రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో సీఐడీ అధికారులు దేవరాజును పట్టుకున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కుంభకోణంలో దేవరాజు ఏ2గా ఉన్న సంగతి తెలిసిందే.

# ఓబీసీల చరిత్రను ఆర్ఎస్ఎస్ చెరిపేసింది: రాహుల్ గాంధీ ఆరోపణలు

దిల్లీ: భారత ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రతీకలని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ న్నారు. అలాంటి వారికి అన్ని రంగాల్లో వివక్ష ఎదురవుతోందని ఆరోపించారు. దిల్లీలో జరిగిన బాగిదారి న్యాయ మహా సమ్మేళనం కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాజపా, ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఓబీసీల చరిత్రను ఉద్దేశపూర్వకంగా చెరిపేశారని దుయ్యబట్టారు.



"2004 నుంచి నేను రాజకీయాల్లో ఉన్నాను. ఈ రెండు దశాబ్దాల కాలం వెనుదిరిగి చూసుకుంటే.. ఓబీసీల ప్రయోజనాలను కాపాడటం కోసం నేను చేయగలిగినంత చేయలేక పోయానని అనిపిస్తోంది. ఆ పొరపాటును ఇప్పుడు సరిదిద్దుకోవాలని అనుకుంటున్నా. సమస్యలు సరిగా అర్థం చేసుకుంటేనే పరిష్కారం సాధించగలం. అందుకోసం చరిత్ర తెలుసుకోవాలి. దేశంలో దళితుల చరిత్రను అంబేద్కర్ అర్థం చేసుకున్నారు. ఓబీసీల చరిత్ర ఎక్కడుంది. భాజపా , ఆర్ఎస్ఎస్ (ఉద్దేశపూర్వకంగా ఆ చరిత్రను చెరిపేశాయి'' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

"ఓబీసీలు ఉత్పాదకశక్తికి ప్రతీకలు. కానీ, వారి శ్రమకు తగిన ఫలితాలను అందుకోలేకపోతున్నారు. అన్ని రంగాల్లో వివక్ష ఎదుర్కొంటు న్నారు. కార్పొరేట్ ఇండియాలో ఓబీసీలు ఎక్కడున్నారు? మీడియా రంగంలో వారికి స్థానం ఎక్కడుంది? కుల గణన కూడా ఎప్పుడో చేయాల్సింది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మేం తప్పకుండా కులగణన పూర్తిచేస్తాం" అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు.ప్రాంతీయ భాష ముఖ్యమే కానీ.. ఈ సందర్భంగా భాషా వివాదంపైనా రాహుల్ స్పందించారు. ''అభివృద్ధిలో విద్యే ప్రాధాన్యం. ఇంగ్లిష్ నేర్చుకుంటే అవకాశాలు రెట్టింపు అవుతాయి. భాజపా నేతలు మాత్రం ఇంగ్లిష్‌ను వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ భాషలూ ముఖ్యమే. దానితో పాటు ఆంగ్ల ప్రాధాన్యాన్నీ అర్థం చేసుకోవాలి'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

# రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వ పదవులకు దూరం: సీజేఐ



ముంబై: పదవీ విరమణ చేసిన తర్వాత ఎలాంటి ప్రభుత్వ పదవులను అంగీకరించేది లేదని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ ( చెప్పారు. మహారాష్ట్రలోని అమ్రావతి జిల్లాలో తన స్వగ్రామమైన దారాపూర్‌లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ పదవులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. రిటైర్మెంట్ తర్వాత చేతినిండా సమయం దొరుకుతుందని, ఎక్కువ సమయం దారాపూర్, అమ్రావతి, నాగపూర్‌లలో గడుపుతానని చెప్పారు.

భారతదేశ 52వ సీజేఐగా ఉన్న గవాయ్ ఈ ఏడాది నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. మహారాష్ట్రలోని అమ్రావతి జిల్లాలో 1960 నవంబర్ 24న ఆయన జన్మించారు. బౌద్ధ మతం నుంచి సీజేఐ అయిన తొలి వ్యక్తి కూడా ఆయనే కావడం విశేషం. మాజీ సీజేఐ సంజీవ్ ఖన్నా రిటైర్మెంట్ తర్వాత గవాయ్ సీజేఐ బాధ్యతలు చేపట్టారు. 2005లో ముంబై హైకోర్టు పెర్మనెంట్ జడ్జి అయిన గవాయ్.. 2019 మేలో సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని రద్దు చేస్తూ 2023 డిసెంబర్‌లో కీలక తీర్పునిచ్చిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో గవాయ్ కూడా ఒకరు.

# హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌కు ఎస్తోనియా సహకారం తీసుకుంటాం: శ్రీధర్‌బాబు

%హైదరాబాద్: డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణ గణనీయ అభివృద్ధి సాధించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో తయారైన డ్రోన్లు 'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించాయని చెప్పారు. ఎస్తోనియా దేశ రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధుల బృందంతో సచివాలయంలో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన ఎస్తోనియా సహకారం తీసుకుంటామన్నారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికత, సైబర్ సెక్యూరిటీలో కూడా కలిసి పనిచేయాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని మంత్రి కోరారు.



ఫుడ్ ప్రాసెసింగ్, బ్రాండెడ్ మద్యం ఉత్పత్తి రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందని.. తమతో కలిసి పనిచేసే విషయాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలని శ్రీధర్‌బాబును ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ కోరారు. తమ అధికారుల బృందం వచ్చి.. విద్య, ఈ-గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్‌లో పరస్పరం సహకారంపై చర్చిస్తుందని మంత్రి తెలిపారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్ సంజయ్ కుమార్, వీ సేవ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

# ఏడాదిలో 23 వేలకోట్లు

ప్రస్తుత కాలంలో డిజిటల్ ప్రపంచం రోజురోజుకు విస్తరిస్తోంది. ప్రజలు అనేక పనుల కోసం నెట్ ఉపయోగిస్తున్నారు, అదే సమయంలో సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో పలు యాప్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని కేంద్ర సూచించింది.రోజురోజుకూ ఓ వైపు డిజిటల్ వినియోగం పుంజుకుంటున్న నేపథ్యంలో మరోవైపు సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయి. సైబర్ కేటుగాళ్లు సామాన్య ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త మార్గాలను ఉపయోగిస్తున్నారు. కొంత మందికి వాటి గురించి అవగాహన లేకపోవడం వల్ల ఈ నేరాలకు బలవుతున్నారు. కొందరు తెలియకుండానే వారి ఫోన్‌లను నేరస్తులకు అనుమతి ఇస్తున్నారు సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎప్పుడూ ఎవరో ఒకరు మోసగాళ్ల బారిన పడుతున్న వార్తలు వింటూనే ఉన్నాం. ఇటీవల కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడించిన గణాంకాల ప్రకారం.. గతేడాది సైబర్ మోసగాళ్లు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి ఏకంగా రూ.22,845 కోట్లను అక్రమంగా దోచుకున్నారు. ఇది ఏపీ రాజధాని అమరావతి కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతున్న దాని కంటే ఎక్కువ. 2023లో సైబర్ నేరాల వల్ల రూ.7465 కోట్ల నష్టం జరగ్గా, 2024లో ఇది ఏకంగా 206 శాతం పెరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ పెరుగుదల సైబర్ నేరగాళ్ల ఆగడాలు ఎంతగా పెరిగిపోయాయో తెలియజేస్తోంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లోక్‌సభలో మాట్లాడుతూ.. నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్లో మొత్తం 36.40 లక్షల ఆర్థిక మోసాల కేసులు నమోదయ్యాయని తెలిపారు.2023లో ఆర్థిక మోసాలకు సంబంధించి 24.4 లక్షల కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్యను బట్టి చూస్తే ప్రతేడాది ప్రజలు మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని స్పష్టమవుతోంది. నమోదైన మొత్తం సైబర్ నేరాల కేసుల సంఖ్యను పరిశీలిస్తే, 2024లో 22.7 లక్షల కేసులు నమోదయ్యాయి. కాగా, 2023లో ఈ సంఖ్య 15.9 లక్షలు మాత్రమే. ఇది ఏకంగా 42 శాతం పెరుగుదలను సూచిస్తోంది. ఇది నిజంగా షాకింగ్ విషయమే. ఈ గణాంకాలు సైబర్ సేఫ్టీ పట్ల మనం ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తున్నాయి.సైబర్ నేరాలను అరికట్టడానికి భారత ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది 2019లో ప్రారంభించింది. ఆర్థిక మోసాలను వెంటనే నివేదించడానికి, మోసగాళ్లు డబ్బును దారి మళ్లించకుండా నిరోధించడానికి ప్రభుత్వం 2021లో సీఎఫ్?సీఎఫ్?ఆర్ఎంను ప్రారంభించారు. సీఎఫ్?సీఎఫ్?ఆర్ఎం ఇప్పటివరకు 17.8 లక్షలకు పైగా ఫిర్యాదులలో రూ.5489 కోట్లకు పైగా డబ్బును కాపాడగలిగింది. అంటే, మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బును తిరిగి పొందడానికి అవకాశం ఉంది.సైబర్ నేరగాళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. పోలీస్ అధికారుల సమాచారం ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 9.42 లక్షలకు పైగా సిమ్ కార్డులను, 2,63,348 ఐఎంఈఐ నంబర్‌లను బ్లాక్ చేసింది. పోలీసులు ఇప్పటివరకు 10,599 మంది నిందితులను అరెస్టు చేశారు. దుబాయ్, చైనా, కంబోడియా, తైవాన్ వంటి దేశాల నుండి సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే విదేశాలలో కూర్చొని ఉన్న సైబర్ మోసగాళ్ళు భారతీయ బ్యాంకు ఖాతాల ద్వారా మోసం చేస్తున్నారు. కోట్ల రూపాయల లావాదేవీలు చేయడానికి కరెంట్ ఖాతాలను ఉపయోగిస్తున్నారు. ఈ సైబర్ మోసగాళ్ల డబ్బు లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాలను విక్రయించే ముఠా గుట్టు రట్టయింది. బ్యాంకు ఖాతాలను అమ్ముతున్న నిందితులు బెంగళూరు, బెంగళూరు గ్రామీణ ప్రాంతాలకు చెందిన సునీల్, ప్రకాష్, లక్ష్మీశ పుట్టస్వామయ్యలను పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ నిందితులకు విదేశాల్లో ఉన్న సైబర్ మోసగాళ్లతో సంబంధాలు ఉన్నాయి. నిందితులు బెంగళూరు, తుమకూరు, రామనగర, బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లోని రోజువారీ కూలీ కార్మికులు, మురికివాడల నివాసితులకు రూ.5,000 ఇచ్చి, వారి ఆధార్ కార్డులను ఉపయోగించి సిమ్ కార్డులు, చిన్న పారిశ్రామిక వ్యవస్థాపకులుగా చెప్పుకునే పత్రాలను సృష్టించేవారు.తర్వాత వారు దానిని ఉపయోగించి జాతీయం చేసిన బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలను తెరిచారు. ఆపై వారు బ్యాంకు ఖాతాలను, లింక్ చేసిన సిమ్ కార్డులను మోసగాళ్లకు ఇచ్చేవారు. ప్రతి ఖాతాను సైబర్ మోసగాళ్లకు రూ.50,000 కు అమ్మేవారు. ఈ ముఠా ఇప్పటివరకు 357 బ్యాంకు ఖాతాలను విక్రయించింది. సైబర్ మోసగాళ్లు ఈ బ్యాంకు ఖాతాల నుండి రూ.150 కోట్ల లావాదేవీలు చేశారు. నకిలీ బ్యాంకు ఖాతాలను తెరవడంలో కొంతమంది బ్యాంకు సిబ్బంది, మేనేజర్లు కూడా పాల్గొన్నారని దర్యాప్తులో వెల్లడైంది. సైబర్ మోసగాళ్ళు తాము మోసం చేసిన డబ్బులో 30 శాతం భారతదేశంలో ఖర్చు చేశారు. మిగిలిన 70 శాతం డబ్బును హవాలా ద్వారా బదిలీ చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసును ప్రస్తుతం సీసీబీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.సైబర్ మోసగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో మోసాలకు పాల్పడుతున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. అనుమానాస్పద లింకులు, ఈమెయిల్‌లకు దూరంగా ఉండాలి. కొత్త యాప్‌ను ఇన్‌స్టాల్ చేసేటప్పుడు అది కొన్ని అనుమతులు అడుగుతుంది. చాలా మంది వాటిని చదవకుండా అన్నింటికీ అనుమతించు అని ఒప్పుకుంటారు. ఇది చాలా ప్రమాదకరమని కూడా హెచ్చరించారు. స్క్రీన్ షేరింగ్ యాప్‌లు మీ ఫోన్‌లోని అన్ని కార్యకలాపాలను నేరస్తులకు చూపిస్తాయని ప్రస్తావించారు. ఉదాహరణకు, మీరు బ్యాంకు లావాదేవీలు చేస్తున్నప్పుడు వచ్చే ఓటీపీలను వారు చూసే అవకాశం ఉంది.

# తాడేపల్లి ప్యాలెస్‌కు జగన్ దూరం

అమరావతి, జూలై 25,

వైయస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ కు రాలేదా? బెంగళూరు కే పరిమితం అయ్యారా? ఈ ప్రచారంలో నిజం ఎంత? ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి జగన్మోహన్ రెడ్డి ఎక్కువగా బెంగళూరుకి పరిమితం అవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే వారంలో మూడు రోజులపాటు తాడేపల్లి లో ఉంటూ.. మరో నాలుగు రోజులు మాత్రం బెంగళూరులో ఎక్కువగా గడుపుతున్నారు. అయితే మద్యం కుంభకోణం నేపథ్యంలో ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి జాడలేదు. ఈవారం తాడేపల్లి ప్యాలెస్ కు ముఖం చాటేసినట్లు ప్రచారం నడుస్తోంది. అందుకు తగ్గట్టుగా తాడేపల్లిలో ఎటువంటి సందడి కూడా లేదు. మద్యం కుంభకోణం కేసులు జగన్ అరెస్ట్ అవుతారన్న ప్రచారం నేపథ్యంలో ఆయన బెంగళూరుకే పరిమితం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.2019లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లపాటు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి వ్యవహరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఆయన తాడేపల్లిలో భారీ ప్యాలెస్ నిర్మించుకున్నారు. అయితే సీఎంగా ఉన్నప్పుడు అదే ప్యాలెస్ ను కార్యాలయంగా మార్చుకున్నారు. పైగా ఆ ప్యాలెస్ నుంచి బయటకు వచ్చింది తక్కువ. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో సరిగ్గా ఎన్నికలకు ఏడాదిన్నర ముందు జిల్లాల పర్యటనకు సిద్ధపడ్డారు.



సంక్షేమ పథకాలను ప్రారంభించే సమయంలో తాడేపల్లి పాలెస్ నుంచి బయటకు వచ్చేవారు. అయితే అలా వచ్చే క్రమంలో ఆకాశమార్గంలో ఎక్కువగా ప్రయాణించే వారన్న విమర్శ ఉంది. దానిని పక్కన పెడితే అధికారం కోల్పోయాక జగన్మోహన్ రెడ్డి తీరులో స్పష్టమైన మార్పు కనిపించింది. అప్పటివరకు తాడేపల్లిలో ఎక్కువగా గడిపే జగన్మోహన్ రెడ్డి బెంగళూరు వెళ్లడం ప్రారంభించారు. బెంగళూరులో సువిశాలమైన యలహంక ప్యాలెస్ ఆయనకు ఉంది. అక్కడే నిత్యం సమీక్షలు, సమావేశాలు జరుపుకుంటారు జగన్మోహన్ రెడ్డి.ఎన్నికల ఫలితాల తరువాత.. ప్రతి మంగళవారం సాయంత్రం తాడేపల్లికివచ్చేవారు. మూడు రోజులపాటు ఆ ప్యాలెస్ లో ఉండి తిరిగి బెంగళూరు వెళ్ళిపోయేవారు. గత కొద్ది నెలలుగా ఇదే జరుగుతోంది. కానీ ఈ వారం తాడేపల్లి పాలస్ వైపు జగన్ చూడలేదు. అసలు బెంగళూరు నుంచి బయటకు అడుగుపెట్టలేదు. వాస్తవానికి బెంగళూరులో ఉన్న యెలహంక ప్యాలెస్ ఆస్తి ఒప్పందంలో భాగంగా షర్మిల కు కేటాయించినట్లు అప్పట్లో ప్రచారం నడిచింది. అయితే ప్రస్తుతం షర్మిల హైదరాబాదులోని లోటాస్ పాండ్ లో ఉంటున్నారు. దీంతో హైదరాబాద్ వైపు జగన్మోహన్ రెడ్డి అసలు చూడడం లేదు. అందుకే ఎక్కువగా ఇప్పుడు బెంగళూరులో గడుపుతున్నారు. తాడేపల్లి వచ్చి రివ్యూలు జరుపుతున్నారు. పార్టీ కీలక నేతలంతా అక్కడే జగన్మోహన్ రెడ్డిని కలుస్తున్నారు. అయితే వారంలో విధిగా మూడు రోజులపాటు తాడేపల్లి ప్యాలెస్ లో ఉంటూ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసేవారు. కానీ ఈ వారం ఇక్కడికి రాకపోవడం మాత్రం చర్చకు దారితీస్తోంది.మద్యం కుంభకోణం కేసు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. దాదాపు ఈ కేసు తుది దశకు వచ్చింది. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ తో పతాక స్థాయికి చేరింది. తరువాత అరెస్టు జగన్మోహన్ రెడ్డి దేనని ప్రచారం నడుస్తోంది. అందుకే ఢిల్లీ స్థాయి లాబీయింగ్ చేసేందుకు ఆయన బెంగుళూరులో ఉండిపోయారన్న ప్రచారం అయితే మాత్రం జోరుగా నడుస్తోంది. ఢిల్లీ నుంచి మాత్రం సరైన సహకారం లేకుంటే మాత్రం ఆయన తాడేపల్లికి వచ్చి మద్యం కుంభకోణం పై ప్రెస్ మీట్ పెట్టే అవకాశం ఉంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# పార్టీ నిర్మాణంపై పవన్ దృష్టి


విజయవాడ, జూలై 25 (

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే నెల నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టనున్నారు. పదవులపైన కూడా క్లారిటీ ఇచ్చే అవకాశముంది. పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవుల విషయంలోనూ జనసేనాని కొంత కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఇన్నాళ్లూ సినిమా షూటింగ్ లలో బిజీగా ఉన్న పవన్ కల్యాణ్ ఇక పార్టీకి 2014 నాటి హైప్ తెచ్చే ప్రయత్నంలో ఉన్నారట. ఇందుకోసం అనేక నియోజకవర్గాలలో సర్వేలు కూడా చేయిస్తున్నారు. తమకు పట్టున్న జిల్లాల్లో కొంత పార్టీని మరింత బలోపేతం చేసిన తర్వాత మిగిలిన నియోజకవర్గాలకు పార్టీని విస్తరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ తన ఇమేజ్ ఏ మాత్రం తగ్గకుండా చేస్తున్న ప్రయత్నాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్న ప్రయత్నంలో ఉన్నారు. అవసరమైతే ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడానికి కూడా సిద్ధమయినట్లు కనిపిస్తుంది. ఇటీవల మీడియాలకు ఇంటర్వ్యూలు ఇస్తూ కూటమిలో అన్ని పార్టీలు సమన్వయంతో కలసి పనిచేస్తున్నాయని చెప్పిన పవన్ కల్యాణ్ రాజధాని అమరావతి భూములు అదనంగా సేకరించే విషయంలో మాత్రం తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేశారు. రాజధానికి అదనపు భూమిని ఇవ్వడంలో బలవంతం ఏమీ లేదని, ఇష్టపూర్వకంగా ఇస్తేనే ప్రభుత్వం తీసుకుంటుందని, బలవంతంగా మాత్రం తీసుకోదని ప్రభుత్వం తరుపున చెప్పారంటే ఆయన అదనపు భూ సేకరణను వ్యతిరేకించినట్లే కనపడుతుంది. రాజధాని రైతుల్లో నెలకొన్న అసంతృప్తిని ఆయన గమనించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తుంది. జనసేన ఎమ్మెల్యేలతో పాటు కూటమి పార్టీల్లోని ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను కూడా ఆయన పసిగట్టినట్లు సమాచారం. స్థానికంగా సమస్యలను పరిష్కరించలేకపోతుండటంతో నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేల పనితీరు పట్ల అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. జనసేనకు చెందిన ఇరవై మంది ఎమ్మెల్యేల్లో దాదాపు పదిహేను మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉన్నట్లు సర్వే ద్వారా తేలడంతో వారిని పిలిచి క్లాస్ పీకేందుకు సిద్ధమయ్యారని చెబుతున్నారు. త్వరలోనే ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి రానున్న నాలుగేళ్ల పాటు కష్టపడి పనిచేసి మంచి మార్కులు తెచ్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దక్కవన్న హెచ్చరికలు కూడా పవన్ జారీ చేసే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద ఆగస్టు నెలలో ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చే అవకాశముంది.

# రోజా నోరు తెస్తున్న తంటా

తిరుపతి, జూలై 25

వైసీపీకి మాజీ మంత్రి రోజా లాంటి వారు అస్సెట్ అవుతారనుకుంటే భారంగా మారుతున్నారు. బరువుగా పార్టీకి తయారవుతున్నారు. అరెస్ట్ లతో కాస్తో కూస్తో వైసీపీకి సానుభూతి లభిస్తుందని భావిస్తే, రోజా లాంటి వారితో ఉన్నదంతా తుడిచిపెట్టుకుపోతుంది. రోజా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగానే కాదు.. సాధారణ జనానికి కూడా మంట తెప్పిస్తున్నాయి. రోజా లాంటి నేతల నోళ్లను కొన్నాళ్లపాటు అదుపులో పెట్టకపోతే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ తీరని నష్టం జరుగుతుందన్న విశ్లేషణల్లో వాస్తవముంది. రోజా నోటికి ప్లాస్టర్ వేయాలని సొంత పార్టీ నేతలే కోరుతున్నారంటే ఆమె ఏ రేంజ్ లో మాట్లాడిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జగన్ ఇటువంటి నేతల విషయంలో సీరియస్ డెసిషన్ తీసుకోవాలంటున్నారు ఆర్కే రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టాల్సిందే. అయితే ఆ వ్యాఖ్యలతో వచ్చిన సానుభూతిని రోజా తన వ్యాఖ్యలతో తనకు తానే చెరిపేసుకున్నారు. పార్టీని కూడా డ్యామేజ్ చేశారు. నగరిలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమంలో పాల్గొన్న రోజా రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా గాలిలో గెలిచిన గాలిగాళ్లే ఎక్కువైపోయారంటూ విమర్శలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ వీకెండ్ నాయకులు అని ఫైర్ అయ్యారు. ఒక్కరు కూడా ప్రజల దగ్గరికి వెళ్లి వాళ్ల కష్టం ఏంటో అడగరని రోజా అన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే టీడీపీ, జనసేన నేతలు అమెరికా పారిపోవాలని చెప్పారు. చంద్రబాబు డబ్బులు ఎక్కువగా ఇస్తున్నారని అందుకే పవన్ కళ్యాణ్‌కు పిచ్చి బాగా



ముదిరిపోయిందంటూ ఆరోపించారు... రాష్ట్రంలో గాలిలో గెలిచిన గాలిగాళ్లు ఎక్కువైపోయ్యారు. ఇప్పుడే హైదరాబాద్‌కు పారిపోయే వాళు ,,.. రేపు జగనన్న ప్రభుత్వం వస్తే వీళ్లు హైదరాబాద్ కాదు.. అమెరికాకు పారిపోతారంటూ రోజా చేసిన వ్యాఖ్యలు పార్టీని ఖచ్చితంగా ఇబ్బది పెట్టేవే. ఆ రోజు మిమ్మల్ని కాపాడటానికి ఎవ్వరు ఉండరని, వీళ్లని నమ్మితే ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లని మీరు టార్చర్ పెట్టినా.. కేసులు పెట్టించినా.. కొట్టినా.. దానికి 100 రెట్లు మీకు వడ్డీతో కూడా తిరిగి ఇచ్చేస్తామంటూ రోజా చేసిన హెచ్చరికలతో కాస్తో కూస్తో వైసీపీ నేతల వరస అరెస్ట్ లతో వచ్చిన సానుభూతి పోయిందని అంటున్నారు. రోజాకు ఆవేశం తప్ప ఆలోచన లేదని, సినీ రంగం నుంచి రావడంతో డైలాగులు ఆకట్టుకునేలా అనిపించినా అవి మాత్రం వచ్చే ఓట్లను రాకుండా చేస్తాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# శ్రావణం హిందువులకు అత్యంత పవిత్రమైన మాసం

కరీంనగర్ శ్రావణమాసం అనగానే పండుగ వాతావరణం వ్యాపిస్తుందని,ఈ మాసం అత్యంత పవిత్రమైనదిగా హిందువులు భావిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో శ్రావణమాస ఆరంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి శ్రావణ మహోత్సవ్ కార్యక్రమానికి వి.నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రారంభానికి ముందు ఆయన ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి మాత విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రావణమాసం శివునికి అత్యంత ప్రీతికరమైన మాసమని,ఈ మాసంలో అనేక రకాలైన పూజలు నిర్వహిస్తారని ముఖ్యంగా మహిళలు సౌభాగ్యం కోసం అనేక వ్రతాలు ఆచరిస్తారని తెలిపారు. తెలుగు సంవత్సరంలోని ఐదో మాసంగా పరిగణించబడుతున్నటువంటి శ్రావణమాసంలో విశిష్టంగా నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి మరియు శ్రీకృష్ణాష్టమి వేడుకలను చాలా శోభయమానంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తారని వారు చెప్పారు. అదేవిధంగా మహిళలు ప్రతి శుక్రవారం రోజున గౌరీ మాత వ్రతాన్ని ఆచరించడం వలన కుటుంబానికి అష్టైశ్వర్య కలుగుతాయని ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని అభిప్రాయపడ్డారు. శ్రావణమాసం ప్రతి ఇంటికి పండుగ వాతావరణం తెస్తుందని, ఈ మాసాన్ని ఉపవాసాలతో పలు పూజ కార్యక్రమాలతో కొనసాగిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేయడమే కాకుండా ఆలోచింపచేసాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

జయశంకర్ భూపాలపల్లి,

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు భూపాలపల్లి నియోజకవర్గం లో పర్యటన సందర్భంగా శుక్రవారం ఏర్పాట్లను మాజీ ఎంమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పరిశీలించారు.జిల్లాలోని మొగుళ్ళపల్లి మండలం ఇస్సిపేట గ్రామ వాస్తవ్యులు మాజీ సర్పంచ్కొడారి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి, అనంతరం మొగుళ్ళపల్లి లక్ష్మి సాయి గార్డెన్స్ నందు మండల ముఖ్య నాయకులతో కేటీఆర్ పర్యటన ఏర్పాట్లు మరియు కార్యకర్తల సమీకరణ పై సమీక్షా నిర్వహించారు. ఆయన వెంట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చెత్త ఇవ్వండి... డబ్బులు తీసుకోండి

విజయవాడ, జూలై 25,

ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ శాఖ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్వచ్ఛ రథం పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పనికిరాని వస్తువులను సేకరిస్తారు. వాటికి బదులుగా డబ్బులు లెక్కించి, అవసరమైన సరుకులు ఇస్తారు. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం ఈ నెల 10న ప్రారంభమైన సంగతి తెలిసిందే.. తాజాగా ఎన్టీఆర్ జిల్లాలో ఆగస్టు 1 నుంచి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. ఈ మేరకు ఒక వాహనాన్ని అద్దెకు తీసుకున్నారు.. దానిని స్వచ్ఛ రథంలా మార్చారు. ఆగస్టు 1 నుంచి అధికారులు రోజూ రెండు వార్డులు తిరిగేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేశారు. ఈ మేరకు వారంలో రెండు సార్లు గ్రామాల్లో ఇళ్ల దగ్గరకు వెళ్లి చెత్తను సేకరిస్తారు.. వాటికి బదులు డబ్బులు లెక్కగట్టి వాహనం వెనుక భాగంలో ఉండే నిత్యావసర సరుకులు ఇస్తారు. వాహనం ముందు భాగంలో పొడి చెత్తను ఉంచుతారు. ఈకార్యక్రమం విజయవంతమైతే ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తామంటున్నారు.గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. పలు గ్రామాల్లో స్వచ్ఛ రథం ద్వారా చెత్త, వ్యర్థాలను సేకరించి వాటికి డబ్బులు విలువ కట్టి సరుకులు ఉచితంగానే అందజేస్తున్నారు. గుంటూరు సమీపంలోని 11 గ్రామాలకు స్వచ్ఛ రథం ప్రతి 15 రోజులకోసారి వెళ్లేలా ప్లాన్ చేశారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో వేయాలని సూచిస్తున్నారు. ప్రజలు ఆ వ్యర్థాలను తీసుకొచ్చి స్వచ్ఛ రథం దగ్గర అప్పగిస్తే.. తూకం వేసి కిలోకి రూ. 16 నుంచి రూ. 20 వరకు విలువ కడుతున్నారు. ఆ తర్వాత ఆ విలువను బట్టి నిత్యావసరాలు, వస్తువులు అందజేస్తున్నారు. స్వచ్ఛ రథం సిబ్బందికి ప్యాకెట్లు, ప్యాకింగ్ కవర్లు, పాత పేపర్లు, గాజు సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, పనికిరాని



వస్తువులు, అట్టలు, ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు, కంప్యూటర్లకు సంబంధించిన వస్తువులు, నూనె డబ్బాలు ఇలా పనికిరాని వస్తువుల్ని తీసుకొచ్చి ఇవ్వొచ్చు. ఈ స్వచ్ఛ రథం పర్యవేక్షణ కోసం సచివాలయంలోని ఓ ఉద్యోగిని కేటాయించారు అధికారులు.

================

# విశాఖ రైల్వే జోన్ పనులు షురూ...

విశాఖపట్టణం, జూలై 2

ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైల్వే జోన్ ఏర్పాటులో మరో ముందడుగు పడింది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. జోన్ పరిధి, డివిజన్లు, సిబ్బంది, ఇతర వివరాలతో కూడిన నివేదికను రైల్వే బోర్డుకు పంపగా.. పరిశీలించి కొన్ని మార్పులతో ఆమోదం తెలిపింది. ఈ మేరకు దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జోన్ సరిహద్దులు, డివిజన్లు, సిబ్బంది వివరాలతో కూడిన డీపీఆర్‌ను ఆమోదించింది. రైల్వే బోర్డు కొన్ని ప్రతిపాదనలను తిరస్కరించగా.. కొత్తగా పోస్టులు సృష్టించకూడదని, ఉన్న సిబ్బందిని సర్దుబాటు చేయాలని ఆదేశించింది.దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆస్తులు, సిబ్బందిని కొత్త జోన్‌కు బదిలీ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రైల్వే బోర్డు.. నీ తూర్పు కోస్తా రైల్వే, దక్షిణ మధ్య రైల్వే జోన్ల పరిధిలోని సిబ్బంది, ట్రాక్ మెషీన్లు బదిలీ చేయడానికి అంగీకరించలేదు. జోన్‌కు సంబంధించి విశాఖపట్నంలో చేపట్టబోయే సివిల్ పనుల కోసం మరో రూ.200 కోట్లు కావాలని డీపీఆర్‌లో కోరారు. వెంటనే ప్రతిపాదనలు పంపితే.. వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రైల్వే బోర్డు ముడసర్లోవలో హెల్త్ యూనిట్ ఏర్పాటును తిరస్కరించింది.. కొత్తగా జీఎం పోస్టు మినహా ఇతర పోస్టులు సృష్టించకూడదని తేల్చి చెప్పింది. రైల్వే బోర్డు గుణుపూర్-పర్లాఖెముండి సెక్షన్, నౌపడ-గుణుపూర్ లైన్‌ను.. గుణుపూర్-తేరుబలి కొత్త లైన్ పూర్తయ్యే వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచాలనే ప్రతిపాదనకు నో చెప్పింది.రైల్వే బోర్డు విశాఖపట్నం డివిజన్‌కు అవసరమైన సిబ్బంది కోసం (అధికారులు, సిబ్బంది ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే కేటాయిస్తామని, ఫీల్డ్ సిబ్బందిని మాత్రమే విభజిస్తారు) డీపీఆర్‌లో చేసిన ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖపట్నంలో రైల్వే అధికారులు నివాసం ఉండేందుకు అవసరమైన అద్దెకు తీసుకునే ఇళ్లకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలి అని రైల్వే బోర్డు సూచనలు చేసింది. మొత్తం మీద రైల్వే బోర్డు విశాఖపట్నం రైల్వే జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలోనే మిగిలిన పనులు మొదలవుతాయంటున్నారు.

# నగరం పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి...

గోదావరిఖని జూలై 25,

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ మరియు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం నగరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మరియు రామగుండం కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్ జే.అరుణ శ్రీ తో కలిసి విస్తృతంగా పర్యటించారు.నగర కార్పొరేషన్ పురపాలక కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ వసూళ్ల పై కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. అనంతరం శివాజీ నగర్ మార్కెట్ ఏరియా, కళ్యాణ్ నగర్ విద్యుత్ లైన్ పనులు, ఊర్వసి టాకీస్, సిరి ఫంక్షన్ హాల్ సమీపంలోని అడ్డగుంటపల్లి లో నిర్మాణం అవుతున్న డ్రైయిన్ డి సిల్టింగ్, మార్కండేయ కాలనీ, శాలపల్లి రోడ్డు ప్రాంతాలలో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు రామగుండం కార్పొరేషన్ ప్రత్యేక అధికారి కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నగరంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ మలేరియా వంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. మురుగు కాల్వల డీసిల్టింగ్ రెగ్యులర్ గా చేయాలని అన్నారు . ప్రతి డివిజన్ పరిధిలో వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేయాలని, అవసరమైన ఫాగ్గింగ్ యంత్రాలను అదనంగా కొనుగోలు చేయాలని,దోమల నివారణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. శివాజీ నగర్ మార్కెట్ ఏరియా పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, బయట ఎక్కడ వ్యాపారాలు అమ్మకుండా మార్కెట్ లో మాత్రమే అమ్మేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఊర్వసి టాకీస్ సమీపంలోని డ్రైయిన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. అడ్డగుంట పల్లి సిరి ఫంక్షన్ హాల్ వద్ద డ్రైయిన్ డి సిల్టింగ్ పనులు పరిశీలించి వాన కాలంలో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కళ్యాణ్ నగర్ లో విద్యుత్ పనుల తరలింపు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. మార్కండేయ కాలనీ రోడ్డు వద్ద ఎక్కడ గుంతలు లేకుండా చూడాలని అన్నారు. శాలపల్లి రోడ్డు వద్ద 2 కోట్లతో నిర్మాణం అవుతున్న సిసి రోడ్లు పనులు నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని మహాత్మ జ్యోతిబాపూలే వసతి గృహాన్ని పరిశీలించి వసతి గృహం లో ఉన్న వసతుల ఏర్పాట్లను పరిశీలించి విద్యార్థులకు ఆధునిక బోధన మరియు నాణ్యమైన భోజనం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎస్ఈ శివానంద్, ఈ. ఈ. రామన్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాకాణి... ఓవర్... ఇప్పుడు అనిల్

నెల్లూరు, జూలై 25, (న్యూస్ పల్స్)

నెల్లూరులో మరో వైసీపీ కీలక నేత చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కూటమి హిట్ లిస్ట్‌లో ఉన్న లీడర్లలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కూడా ఒకరని టీడీపీ నేతలు ఆఫ్ ది రికార్డులో చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఓడినప్పటి నుంచి నెల్లూరుకు దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు అనిల్‌కుమార్ యాదవ్. అయితే లేటెస్ట్‌గా మైనింగ్ కేసులో అనిల్‌కుమార్‌కు ఉచ్చు బిగిసేలా



కనిపిస్తోంది. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలతో వందల కోట్లు పోగేశారని ఆరోపిస్తూ నెల్లూరుకు చెందిన వైసీపీ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్నారురుస్తుం మైన్స్ తవ్వకాల్లో నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఇప్పటికే అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. ఇక వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు శ్రీకాంత్ రెడ్డిని పోలీసులు హైదరాబాద్లో అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఆధారంగా అనిల్ కుమార్ యాదవ్‌పై చర్యలు తీసుకుంటే నెల్లూరులోని ముఖ్యమైన ఇద్దరు నేతలు ఇరుక్కున్నట్లేనని అంటున్నారు.అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలతో సంపాదించిన సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు శ్రీకాంత్ రెడ్డి విచారణలో చెప్పారంటున్నారు. లీజు గడువు ముగిసినా రుస్తుం మైన్ నుంచి క్వార్ట్స్ తీశామని..మాజీ మంత్రి కాకాణి, అనిల్ కుమార్ యాదవ్ అండతో గూడూరు, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి ప్రాంతాల్లో మామూళ్లు వసూలు చేశామని శ్రీకాంత్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చారటటన్ను క్వార్ట్జ్‌కు రూ.7వేల నుంచి రూ.10 వేలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని చెబుతున్నారు. మైనింగ్ ద్వారా వసూలు చేసిన డబ్బుతో భారీగా భూములు కొని,వందల ఎకరాల భూమిలో రియల్ వెంచర్లు వేశారనే అలిగేషన్ ఉంది. అక్రమ మైనింగ్ కేసులో ఇప్పటికే 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో కాకాణి 2 నెలలుగా రిమాండ్లో ఉన్నారు. త్వరలోనే అనిల్‌కుమార్ యాదవ్‌కు అరెస్టు చేస్తారని ప్రచారం జరుగుతోంది.మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ముందు నుంచి టీడీపీకి టార్గెట్‌గా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. 2014లో టీడీపీ పవర్‌లో ఉన్నప్పుడు అపోజిషన్‌లో ఆయన చేసిన హడావుడి ఒక ఎత్తు అయితే. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్, పవన్‌ను ఉద్దేశించి అనిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు కూటమి ఇంకా మరిచిపోలేదంటున్నారు.టైమ్ చూసి..అన్ని ఆధారాలు దొరికినప్పుడు ఏదో ఒక కేసులో అనిల్‌కుమార్‌ను రౌండప్ చేస్తారని కూటమి పవర్‌లోకి వచ్చినప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. అయితే శ్రీకాంత్‌రెడ్డి అరెస్ట్‌తో అనిల్ కుమార్ వసూళ్ల దందా..అక్రమ మైనింగ్ వ్యాపారం మొత్తం వెలుగులోకి వచ్చిందని అంటున్నారు. పక్కా ఆధారాలు దొరికాయని..శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలంతో అనిల్‌కుమార్ ఇరికిపోవడం పక్కా అన్న ప్రచారం బయలుదేరింది. ఈనేపథ్యంలోనే ఈ వీకెండ్‌లో అనిల్‌కుమార్ అరెస్ట్ ఉండొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏం జరగబోతుందో చూడాలి మరి.

# మారనున్న స్పీకర్, డిప్యూటీ స్పీకర్....

విశాఖపట్టణం, జూలై 25, (

ఏపీలో రాజకీయ సంచలనం రేగనుందా? చంద్రబాబు క్యాబినెట్ ను విస్తరించనున్నారా? 8 మంది మంత్రులను మార్చనున్నారా? స్పీకర్ తో పాటు డిప్యూటీ స్పీకర్ మార్పు ఉంటుందా? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఇటీవల కాలంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుంది అనేది బలమైన చర్చగా కొనసాగుతోంది. క్యాబినెట్లో చాలామంది మంత్రుల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. పలుమార్లు చంద్రబాబు హెచ్చరికలు కూడా జారీ చేశారు. మారండి లేకపోతే మార్చేస్తానంటూ హెచ్చరించారు. అయినా సరే వారి పనితీరులో మార్పు రాకపోవడంతో ఇప్పుడు మార్పుకు సిద్ధపడుతున్నారని మీడియా కథనాలు వస్తున్నాయి. ముఖ్యంగా జూనియర్లతో క్యాబినెట్ ఏర్పాటు ప్రయోగం విఫలమయింది అన్న భావన సీఎం చంద్రబాబు లో ఉన్నట్లు తెలుస్తోంది.శ్రీకాకుళంనుంచి అనంతపురం వరకు సీనియర్లను పక్కనపెట్టి జూనియర్లకు అవకాశం ఇచ్చారు చంద్రబాబు. కేవలం లోకేష్ నాయకత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా జూనియర్లకు ఛాన్స్ ఇచ్చారన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు దాదాపు 15 మంది సీనియర్లు మంత్రి పదవులకు ఎదురు చూశారు. కానీ వారిని కాదని ఆయా జిల్లాల్లో ఉన్న జూనియర్లకు అవకాశం వచ్చింది. కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, యనమల రామకృష్ణుడు, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, పరిటాల సునీత, జెసి ఫ్యామిలీ నుంచి.. ఇలా చాలామంది నేతలు పదవులు ఆశించారు. కానీ దక్కలేదు.అయితే జూనియర్ ఫార్ములా దెబ్బతినడంతో ఇప్పుడు సీనియర్లను తెరపైకి తేనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా ఉత్తరాంధ్రలో ఇద్దరు మంత్రుల ఉద్వాసన తప్పదని తెలుస్తోంది. గోదావరి జిల్లాల నుంచి మరో ఇద్దరిని తప్పిస్తారని సమాచారం. రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి ఓ నలుగురిని తప్పిస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. అంటే ఎనిమిది మంది మంత్రుల ఉద్వాసన తప్పదని తేలింది. ఇప్పటికే ఒక మంత్రి పదవి క్యాబినెట్లో ఖాళీగా ఉంది. అంటే మొత్తం తొమ్మిది మంత్రి పదవులకు గాను.. ఒకటి జనసేనతో పాటు మరొకటి బిజెపికి కేటాయించే అవకాశం ఉంది. అంటే ఏడు మంత్రి పదవులను టిడిపి సీనియర్లకు దక్కే ఛాన్స్ కనిపిస్తోంది.అయితే మరోవైపు స్పీకర్ తోపాటు డిప్యూటీ స్పీకర్ సైతం క్యాబినెట్ లోకి వెళ్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆది నుంచి మంత్రి పదవి పై ఆశలు పెట్టుకున్నారు. కానీ అనూహ్యంగా ఆయనకు స్పీకర్ పదవి కట్టబెట్టి నోరు మూయించారన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఎందుకంటే అయ్యన్నపాత్రుడు రాజకీయంగా చాలా దూకుడుగా ఉండేవారు. ఆయనకు మంత్రి పదవి ఇస్తే విపక్షంపై ఓ రేంజ్ లో ప్రతాపం చూపుతారని ఒక కామెంట్ ఉంది. మరోవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజుకు సైతం క్యాబినెట్లోకి తీసుకుంటారని.. ఆయన స్థానంలో గోరంట్ల బుచ్చయ్య చౌదరికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇస్తారని మరో టాక్ ఉంది. అయితే స్పీకర్ గా బీసీ వర్గానికి చెందిన నేతను తీసుకుంటారని.. అయ్యన్నపాత్రుడుకు మంత్రి పదవి ఖాయమని జోరుగా ప్రచారం సాగుతోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

రాజకీయంగా ఎక్కువగా వైఫల్యం

2024 ఎన్నికల్లో ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమికి అధికారం కట్టబెట్టారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ఎమ్మెల్యేలు సైతం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉంటుంది. మంత్రుల సైతం మరింత మెరుగ్గా పనిచేస్తేనే ఆ ఫలితాలు అందుకోగలమని చంద్రబాబు చెబుతూ వచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో పట్టు తప్పుతోందన్న అంచనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రివర్గంలో చేర్పులు, మార్పులు చేపట్టాలని చంద్రబాబు భావిస్తున్నట్లు ప్రచారం ప్రారంభం అయ్యింది.అయితే ఏపీ సీఎం చంద్రబాబు కు ఒక అలవాటు ఉంది. ఏదైనా చేయాలంటే ముందుగా దానిపై విస్తృత చర్చ జరగాలని భావిస్తారు. అది పార్టీ వర్గాలతో పాటు ప్రజల్లో విస్తృత చర్చ ద్వారా ఆ నిర్ణయంలో మార్పులు, చేర్పులు ఉంటాయి. అయితే ప్రస్తుతం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందా? అన్నదానికి.. ప్రభుత్వ వర్గాల నుంచి లేదని సమాధానం వస్తోంది. అయితే నిప్పు లేనిదే పొగ రాదు అని అడిగేవారికి టిడిపి శ్రేణులనుంచి వింత సమాధానం వస్తోంది. తమ అధినేత వ్యూహం ప్రకారం ఏదైనా జరుగుతుందని.. తొందరపాటు ఉండదని.. అలాగని కీలక నిర్ణయాలు కూడా ఉంటాయని గుర్తు చేస్తున్నారు.చంద్రబాబు ప్రయోగాలకు ఇష్టపడతారు. ఇది చాలా సందర్భాల్లో చూసాం కూడా. 2024 ఎన్నికల్లో కొత్తదనాన్ని చూపించారు. కొత్త టీం తో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకున్నారు. కొత్తగా ఎమ్మెల్యేలు గెలిచిన పదిమందికి మంత్రులుగా అవకాశం ఇచ్చారు. అయితే మంత్రులు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శ ఉంది. ముఖ్యంగా ప్రతిపక్షాలను రాజకీయంగా తిప్పి కొట్టలేక పోతున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. శాఖల ప్రగతి కంటే రాజకీయంగా ఎక్కువగా వైఫల్యం చెందుతున్నారు అన్నది చంద్రబాబు బాధగా తెలుస్తోంది. ఇప్పటికీ చాలామంది మంత్రులు తమ సొంత జిల్లాలపై పట్టు సాధించలేకపోయారు. అందుకే చంద్రబాబు అసంతృప్తి చెందుతున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రచారం పుణ్యమా అని ఆశావహులు ముందుకు వస్తున్నారు. ఎవరికివారుగా తమ ప్రయత్నాల్లో ఉంటున్నారు. కానీ ప్రభుత్వ వర్గాల్లో మాత్రం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పై ఎటువంటి కదలిక లేదు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# వైస్ ప్రెసిడెంట్ రేసులో....

న్యూఢిల్లీ, జూలై 25,

భారత రాజకీయాల్లో ఇప్పుడు తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరు అనే చర్చ జోరుగా సాగుతోంది. ఇటీవలే మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ దన్ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఖాళీ అయిన ఈ అత్యున్నత పదవికి సంబంధించి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తమ వ్యూహాన్ని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. పార్టీలోని కీలక వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. తదుపరి ఉపరాష్ట్రపతి బీజేపీ నుంచే అవుతారని తెలుస్తోంది. అంతేకాదు ఆ నాయకుడు పార్టీ సిద్ధాంతాలకు, భావజాలానికి అత్యంత కట్టుబడిన వ్యక్తి అయి ఉంటారని సమాచారం.ఈ ప్రకటనతో.. ఉపరాష్ట్రపతి పదవికి సంబంధించి వివిధ రాజకీయ వర్గాల్లో నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. ముఖ్యంగా జేడీయూ నేత, కేంద్రమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్‌ను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడితో జేపీ నడ్డాతో కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ భేటీ కావడంతో ఈ ఊహాగానాలు బయటకు వచ్చాయి. అయితే ఇది సాధారణ సమావేశమే అని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. వీరి మధ్య జరిగిన సమావేశంలో ఎక్కడ కూడా ఠాకూర్ అభ్యర్థిత్వం గురించి చర్చలు జరగలేవని పేర్కొన్నాయి.తమ సొంత పార్టీలో దీర్ఘ కాలంగా సేవలందిస్తూ.. పార్టీ భావజాలంతో పూర్తి అనుబంధం ఉన్న సీనియర్ నాయకుడికే ఈ అవకాశం లభిస్తుందని స్పష్టం చేశాయి. అలాగే ఇంతకాలం రేసులో ఉన్నట్లు భావించిన బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీష్ కుమార్, జేడీయూ నేత హరివంశ్ నాయణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ వంటి కీలక నాయకులను ఉపరాష్ట్రపతి పదవికి బీజేపీ పరిగణనలోకి తీసుకుంటుందనే ఊహాగానాలు వినిపించాయి. కానీ బీజేపీ తాజా ప్రకటనతో వీటన్నిటికీ బ్రేకులు పడ్డాయి.ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. ఎలక్టోరల్ కాలేజీ (ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే పార్లమెంటు సభ్యుల బృందం) ఏర్పాటు, రిటర్నింగ్ అధికారిని ఖరారు చేసే ప్రక్రియను కమిషన్ చేపట్టింది. ఈ లాంఛనాలను పూర్తి చేసిన తర్వాత ఉపరాష్ట్రపతి ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటిస్తామని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. మరి తదుపరి ఉపరాష్ట్రపతిగా ఎవరు బాధ్యతలు చేపడతారో చూడాలి

# సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఈనెల27,28న క్రీడా పోటీలు

బేతంచర్ల:

బేతంచర్ల పట్టణంలోని సరస్వతి శిశు మందిరం ఉన్నత పాఠశాలలోఈనెల 27,28,వ తేదీలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ కమిటీ గౌరీ హుస్సేన్ రెడ్డి,మారుతి శర్మ,గుండా గోపాల్ తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి విద్యార్థినులకు చదువుతోపాటు సాంప్రదాయంతోపాటు విద్యార్థి విద్యార్థినులు దృఢంగా ఉండడం కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ క్రీడా పోటీల్లో విద్యార్థి విద్యార్థినులు దాదాపు 400 నుండి 500 వరకు విద్యార్థులు ఈ క్రీడలలో పాల్గొంటున్నారని తెలిపారు.ఈ క్రీడాలు సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల,శేషారెడ్డి ఉన్నత పాఠశాలల నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మద్దిలేటిస్వామి,సురేష్,లక్ష్మీ నారాయణ,కందగడ్డల మాణిక్యం శెట్టి,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# సాయిబాబా దేవాలయాలే లక్ష్యంగా చోరీలు

చందానగర్

చందానగర్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిల్లో దేవాలయాల్లో వరస చోరీలు జరుగుతున్నాయి. దుండగులు హుండిలను పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా మందిరంలో దొంగతనానికి పాల్పడ్డారు. అదేవిధంగా మియాపూర్ సాయిబాబా గుడి లోను హుండీలను పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లానే. దేవాలయాల అర్చకులు పోలీసులకు సమాచారం అందించారు. మియాపూర్,చందానగర్ పోలీసులు క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. చందానగర్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దేవాలయాలోని హుండిలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు

# మెడికల్ లీవ్ లో పైలెట్లు

ముంబై, జూలై 25,

అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ దుర్ఘటన తర్వాత నాలుగు రోజుల్లో 100 మందికిపైగా ఏయిరిండియా పైలట్లు మెడికల్ లీవ్ తీసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేసింది. కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహుల్ గురువారం లోక్‌సభలో ప్రసంగిస్తూ.. 274 మంది ప్రాణాలు కోల్పోయిన ఈ విషాద ఘటనపై పైలట్ల మానసిక ఆరోగ్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది అని అన్నారు. విమాన ప్రమాదం జరిగిన రోజే 51 మంది పైలట్లు, 61 మంది ఫ్లైట్ ఆఫీసర్లు లీవ్ పెట్టడం ప్రభుత్వం దృష్టిని ఆకర్షించింది.ఇటువంటి ఘటనల తర్వాత సిబ్బందిలో మానసిక ఒత్తిడిని గుర్తించి, దాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది'' అని మంత్రి వ్యాఖ్యానించారు. 2023 ఫిబ్రవరిలోనే కేంద్రం అన్ని ఎయిర్‌లైన్స్‌కు పలు సూచనలు చేసింది. వైద్య పరీక్షల సమయంలో పైలట్ల మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడం, పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, పియర్ సపోర్ట్ గ్రూపులు ఏర్పాటు చేసి, పైలట్లు, ఏటీసీలకు మానసిక ఒత్తిడిని గుర్తించేందుకు, ఎదుర్కొనేందుకు సహాయం చేయాలని సూచించింది.కాగా, సిబ్బంది విశ్రాంతి, శిక్షణ, ఆపరేషన్ లోపాలపై డీజీసీఏ నుంచి నాలుగు షోకాజ్ నోటీసులు అందినట్టు ఎయిరిండియా ధ్రువీకరించింది. గతేడాది తమ సంస్థ అందజేసిన స్వచ్ఛంద నివేదిక ఆధారంగా ఈ నోటీసులు జారీ అయినట్టు తెలిపింది. ఎయిరిండియా ప్రతినిధి స్పందిస్తూ: 'మా స్వచ్ఛంద నివేదికల ఆధారంగా వచ్చిన నోటీసులే... వాటికి తగిన విధంగా స్పందిస్తాం? సిబ్బంది, ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీలేదు' అన్నారు. కాగా, గత ఆరు నెలల్లోనే ఎయిరిండియాకు 13 భద్రతా ఉల్లంఘనల నోటీసులు రావడం గమనార్హం.రెండు రోజుల కిందట హాంకాంగ్ నుంచిడి ఢిల్లీకి వచ్చిన ౦321 విమానంలో ల్యాండ్ అయిన కాసేపటికే మంటలు చెలరేగాయి. దీనికి ముందు రోజు కోచి-ముంబయి ఫ్లైట్ రన్‌వే అదుపుతప్పడంతో ఇంజిన్ కవర్ దెబ్బతింది. అలాగే, ఢిల్లీ-కోల్‌కతా విమానం చివరి నిమిషంలో టేకాఫ్ నిలిచిపోయింది. ఇలా వరుస ఘటనలు ఎయిరిండియా విమానాల్లో భద్రతపై ఆందోళనకు గురిచేస్తున్నాయి. అటు, అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్స్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక అందజేసింది. పైలట్లు ఇంధనం స్విచ్ఛ్ ఆఫ్ చేసినట్టు కాక్‌పిట్ వాయిస్ రికార్డులో ఉందని విదేశీ మీడియా కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను పైలట్ల సంఘం, విమానయాన నిపుణులు తీవ్రంగా ఖండిస్తున్నారు. బోయింగ్ విమానాలు నడుపుతున్న అన్ని దేశీయ విమానయాన సంస్థలకు ఇంధన స్విచ్‌లను పరీక్షించాలని డీజీసీఏ ఆదేశించింది.

==================

## తల్లాడ సొసైటీలో యూరియా కష్టాలు

ఖమ్మం

ఖమ్మం జిల్లా తల్లాడ సోసైటీలో యూరియా కష్టాలు ఇంకా తీరలేదు. తాజాగా రైతులు యూరియా లారీని అడ్డుకొని ధర్నా చేపట్టారు. తమ సొసైటీకి కేటాయించిన యూరియా బస్తాలను మరో సొసైటీకి మళ్ళించడం పై రైతులు మండిపడ్డారు. తల్లాడ సొసైటీ లోని రైతులకు సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేసారు. రోజురోజుకు యూరియా కొరత పెరుగుతుండటంతో రైతులు ఆందోళన పడుతున్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

ఏలూరు

జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది.ప్రమాదంలో కార్యాలయంలోని ఏసీ, కంప్యూటర్, ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అగ్ని మాపక సిబ్బంది కార్యాలయానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## విద్యార్థుల్లో పఠన నైపుణ్యాన్ని పెంపొందించాలి: ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్

విద్యార్థులలో మొదటి తరగతి నుంచి పఠనం, భాషణ, లేఖన, శ్రవణ నైపుణ్యాలను పెంపొందించాలని సి.బెళగల్ మండల విద్యాశాఖ అధికారి జ్యోతి అన్నారు. గురువారం సి.బెళగల్ మండలంలోని స్థానిక ప్రాథమిక పాఠశాల (స్పెషల్) ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సృజనాత్మకత, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు మొదటి తరగతి నుంచి పఠన నైపుణ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించండి. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి,

సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన భోజనం, విద్యాబ్యాసం జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి సమావేశ మందిరంలో విద్యా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ అధికారులు, డీసీఓలు, ప్రత్యేక అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలలు మరియు వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో వసతి గృహాలు, పాఠశాలల్లో సౌకర్యాలు కల్పనపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రత్యేక అధికారు లు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాల్లోను, పాఠశాలల్లోను ఆహార నాణ్యతలు పాటించేందుకు ఆహార కమిటీలను ఏర్పాటు చేయాలని



సూచించారు. ఏదేని ఇబ్బందులతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపేలా కౌన్సిలింగ్ చేయాలని స్పష్టం చేశారు. మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, వసతి గృహాల తనిఖీ అధికారులు, మండల విద్యా శాఖ అధికారులు నిరంతరం వసతి గృహాలు, పాఠశాలలు తనిఖీ చేస్తూ భోజన నాణ్యత, విద్యాబోధన పర్యవేక్షణ చేయాలన్నారు. గీజర్లు, ఫాన్స్, లైట్లు ఇచ్చామని నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్రమం తప్పక విద్యార్థుల కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల ఏదేని ఇబ్బందులకు గురైతే సంబంధించిన అధికారులు బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వసతి గృహాలు, పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు ఆశోక్ కుమార్, విజయలక్ష్మి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత డీసీఓలు, అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్ల, ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం పవన్... మంగళగిరి లోకేష్ స్ట్రాంగ్ గా నియోజకవర్గాలు

కాకినాడ, జూలై 25

రాజకీయ పార్టీల నేతలు తమ నియోజకవర్గాలను పదిలం చేసుకోవాలని ప్రయత్నిస్తారు. అయితే అందులో కొందరు మాత్రమే సక్సెస్ అవుతారు. పులివెందులలోవైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం, కుప్పంలో చంద్రబాబు, హిందూపురంలో నందమూరి కుటుంబం.. ఇలా నేతల ప్రత్యేక నియోజకవర్గాలు అంటూ ఉంటాయి. అయితే ఇప్పుడు సొంత నియోజకవర్గాల్లో పాతుకు పోవాలని చూస్తున్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్. కుప్పం, పులివెందుల మాదిరిగానే తమ నియోజకవర్గాలను కంచు కోటలుగా మార్చుకోవాలని చూస్తున్నారు. పెద్ద కోటను ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఆ నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు ఆ ఇద్దరు నేతలు. ఒకవైపు రాష్ట్ర మంత్రులుగా ఉంటూనే తమ నియోజకవర్గాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసి ప్రజల మనసు గెలవాలని చూస్తున్నారు.పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేశారు. గాజువాక తో పాటు భీమవరంలో పోటీ చేసి రెండు చోట్ల ఓడిపోయారు. ఒక విధంగా చెప్పాలంటే దారుణ పరాజయం చవిచూశారు. ఇది రాజకీయ ప్రత్యర్థులకు వరంగా మారింది. ప్రచార అస్త్రంగా మార్చుకున్నారు. అయితే అక్కడే గుణపాఠాలు నేర్చుకున్నారు పవన్ కళ్యాణ్. గెలుపు కోసం పరితపించారు. అందుకే ఎన్నికలకు ముందు వ్యూహాత్మకంగా పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. గాజువాక, తిరుపతి వంటి నియోజకవర్గాలు చర్చకు వచ్చాయి కానీ.. పిఠాపురం అయితే సేఫ్ జోన్ లో నిలవాలని భావించారు. అక్కడే గెలిచారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని తనకు కంచుకోటగా మార్చుకోవాలని చూస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలను అభివృద్ధి చేసి చూపిస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. అదే సమయంలో పిఠాపురం లో సొంత ఇంటిని నిర్మించుకున్నారు. మరోవైపు తమ కుటుంబ సభ్యులు, సన్నిహితులు సైతం అక్కడ ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. మొత్తానికి అయితే పిఠాపురం నియోజకవర్గాన్ని కంచుకోటల జాబితాలో చేర్చాలని గట్టి ప్రయత్నం లో ఉన్నారు పవన్ కళ్యాణ్.ఇంకోవైపు లోకేష్(సైతం మంగళగిరి నియోజకవర్గం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. దాదాపు 50 వేల ఇల్లు కట్టించేందుకు ప్రణాళిక రూపొందించారు. పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ నియోజకవర్గంలో చేనేత కార్మికులు అధికం. అందుకే చేనేత హబ్ గా మార్చాలని ప్రణాళికల రూపొందించారు. అందుకు సంబంధించి ప్రోత్సాహకంగా చేనేత శాలను ఏర్పాటు చేశారు. ఐటీ, నాన్ ఐటి పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానికంగానే 50 వేల మంది పనిచేసే విధంగా వాటిని తీర్చిదిద్దనున్నారు. ఇంకోవైపు ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న వేలాదిమందికి.. ఇళ్ల పట్టాలు అందించేందుకు కూడా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి 2019 ఎన్నికల్లో మంత్రిగా ఉంటూ మంగళగిరిలో బరిలో దిగారు లోకేష్. అయితే ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. ఆపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ అభ్యర్థి గెలుస్తూ వస్తున్నారు. అటువంటి నియోజకవర్గాన్ని ఎంచుకొని సాహసం చేశారు. కానీ లోకేష్ ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. దీంతో 2024 ఎన్నికల్లో మరో నియోజకవర్గానికి మారాలని సీనియర్లు సూచించారు. కానీ మంగళగిరి నియోజకవర్గాన్ని గెలిచి టిడిపికి గిఫ్టుగా ఇస్తానని చెప్పుకొచ్చారు లోకేష్. అన్నట్టుగానే 90 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చుకోవాలని చూస్తున్నారు.వచ్చే ఎన్నికల్లో కూటమిగా ముందుకు వెళ్లడం ఖాయం. అందుకే మూడు పార్టీలు తమకు పట్టున్న 100 నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాయి. ఆ నియోజకవర్గాల్లో ఎట్టి పరిస్థితుల్లో పట్టు తప్పకూడదని భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అభివృద్ధిపై దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. అందులో భాగంగా కుప్పం, మంగళగిరి, హిందూపురం, పిఠాపురం వంటి నియోజకవర్గాల్లో ప్రత్యర్థులు పోటీ చేయడానికి కూడా భయపడే విధంగా అభివృద్ధి చేసి చూపించాలని భావిస్తోంది. చూడాలి మరి ఎన్నికల ఫలితాల్లో ప్రభావం ఎలా ఉంటుందో..

# వివాహేతర సంబంధాల్లో కంచి టాప్

చెన్నై, జూలై 25,

దేశంలో వివాహేతర సంబంధాల గురించి.. డేటింగ్ ప్లాట్‌ఫామ్ 'యాష్లే మాడిసన్' ఒక సర్వే నిర్వహించింది. 2025 జూన్ నాటికి సేకరించిన వివరాలతో ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికలో చెప్పిన విషయాలు ఇప్పుడు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

ఏంటీ యాష్లే మాడిసన్?యాష్లే మాడిసన్ అనేది ఒక ప్రపంచవ్యాప్త డేటింగ్ ప్లాట్‌ఫామ్ యాప్. ఈ యాప్‌లో సైన్ అప్‌ల ఆధారంగా.. అది ఈ ఏడాది జూన్ వరకు ఒక నివేదికను తయారు చేసి.. తాజాగా విడుదల చేసింది. ఈ యాప్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. దేశంలోని కొన్ని మెట్రో నగరాలు ఈ యాప్ వినియోగంలో వెనుకబడిపోతున్నప్పటికీ.. చిన్న నగరాలు, పట్టణాల్లో బాగా ఉపయోగిస్తున్నారని తెలుస్తోంది.తమిళనాడులోని కాంచీపురం (కంచి).. వివాహేతర సంబంధాల విషయంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. ఢిల్లీ, ముంబై లాంటి ప్రధాన నగరాలనూ పక్కనపెట్టి.. కాంచీపురం మొదటి స్థానంలో నిలవడం ఆశ్చర్యపరుస్తోంది. 2024లో వివాహేతర సంబంధాల్లో కాంచీపురం దేశవ్యాప్తంగా 17వ స్థానంలో ఉండగా.. ఇప్పుడు తొలి స్థానానికి చేరుకుంది. అయితే, కాంచీపురంలో ఆకస్మికంగా వివాహేతర సంబంధాలు పెరగడానికి గల కారణాలు ఏంటనేది దానిపై మాత్రం యాష్లే మాడిసన్ వివరణ ఇవ్వలేదు.ఇప్పటివరకు దేశంలోని ప్రధాన నగరాల్లో మాత్రమే ఈ వివాహేతర సంబంధాలు అధికంగా ఉండగా.. ఇప్పుడు టైర్-2, టైర్-3 లాంటి పట్టణాల్లో కూడా ఈ విశృంఖల ధోరణి పెరిగిపోవడం పట్ల సంప్రదాయవాదులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టాప్-20లో ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాలే అధికం

ఇక ఈ యాష్లే మాడిసన్ రిపోర్ట్ ప్రకారం వివాహేతర సంబంధాల విషయంలో భారత్‌లోని టాప్-20 జిల్లాల లిస్ట్‌లో కాంచీపురం తర్వాత సెంట్రల్ ఢిల్లీ రెండో స్థానంలో నిలిచింది. ఇక ఈ టాప్-20లో 9 జిల్లాలు.. ఢిల్లీ, దాని ఎన్సీఆర్ ప్రాంతం (నేషనల్ క్యాపిటల్ రీజియన్) ఉండటం గమనార్హం. ఈ 9లో ఆరు జిల్లాలు ఢిల్లీలోనివే కావడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. సెంట్రల్ ఢిల్లీ, సౌత్ వెస్ట్ ఢిల్లీ, ఈస్ట్ ఢిల్లీ, సౌత్ ఢిల్లీ, వెస్ట్ ఢిల్లీ, నార్త్ వెస్ట్ ఢిల్లీలతోపాటు.. ఎన్సీఆర్ ప్రాంతంలోని గురుగావ్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్ (నోయిడా) ఉన్నాయి.

టాప్-20లో ముంబై లేకపోవడానికి కారణం

టాప్-20లో ముంబై లేకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 2024లో ముంబై రెండో స్థానంలో ఉండగా.. ఈసారి టాప్-20 నుంచి వెళ్లిపోయింది. చిన్న నగరాల్లో ఈ యాప్ వినియోగించేవారి సంఖ్య పెరగడం.. కేవలం యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడమే కాకుండా.. దాన్ని ఎంతవరకు వినియోగిస్తున్నారు అనేదాన్ని ఉపయోగించుకుని ర్యాంకులు ఇవ్వడం కారణంగా ముంబై ఈ జాబితాలో లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జైపూర్, రాయగఢ్, కామరూప్, చండీగఢ్ వంటి టైర్-2, టైర్-3 నగరాలు ఈ లిస్ట్‌లో ఉన్నాయి.వివాహేతర సంబంధాలపై ప్రస్తుతం విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఇలాంటివి పెరగడానికి చాలా కారణాలు ఉన్నాయి. వివిధ కేసుల్లో.. దేశంలోని సుప్రీంకోర్టు, చాలా హైకోర్టులు ఇచ్చిన తీర్పులు కూడా వివాహేతర సంబంధాలకు కారణం అవుతున్నట్లు అర్థం అవుతోంది. గత కొన్నేళ్లల్లో ఈ వివాహేతర సంబంధాలకు సంబంధించిన చట్టాలు కూడా చాలా మారాయి. అంతేకాకుండా స్త్రీ, పురుష సమానత్వం.. సమాజంలో స్వేచ్ఛగా జీవించాలని భార్యాభర్తలు భావించడం, చట్టంలో వచ్చిన మార్పులు సహా అనేక కారణాల వల్ల దేశంలో వివాహేతర సంబంధాలు పెరుగుతున్నాయని విశ్లేషకులు చెబుతున్న మాట.2018లో సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం దేశచరిత్రలోనే సంచలనంగా మారింది. ఓ కేసు విచారణ సందర్భంగా భారత శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ - ఐపీసీ)లోని సెక్షన్ 497ను కొట్టివేసింది. ఈ సెక్షన్ ప్రకారం.. గతంలో వివాహేతర సంబంధం చట్ట ప్రకారం నేరంగా పరిగణించేవారు. అయితే, ఈ చట్టం కాలం చెల్లిందని, ఇది అన్యాయమని పేర్కొన్న సుప్రీంకోర్టు.. దాన్ని రద్దు చేసింది. ముఖ్యంగా ఇది మహిళలను ఆస్తిగా పరిగణించింది. నాటి నుంచి, వివాహేతర సంబంధం ఇకపై నేరం కాదు, కానీ అది ఇప్పటికీ విడాకులకు ఒక కారణంగా ఉండవచ్చు.ఒక పురుషుడు.. మరొకరి భార్యతో, ఆమె భర్త అనుమతి లేకుండా.. లైంగిక సంబంధం పెట్టుకుంటే దాన్ని నేరంగా పరిగణించేవారు. ఈ నేరానికి గరిష్టంగా 5 ఏళ్ల జైలుశిక్ష లేదా జరిమానా.. లేదా రెండింటినీ విధించేవారు. ఈ నేరంలో మహిళ ప్రమేయం ఉన్నా.. ఆమెను నిర్దోషిగా విడుదల చేసేవారు. దీంతో ఈ సెక్షన్ పూర్తిగా పురుషుడిపైనే నేరాన్ని మోపింది. ఒక భర్త మరొకరి భార్యతో సంబంధం పెట్టుకుంటే నేరం.. కానీ పెళ్లైన వ్యక్తితో యువతి సంబంధం పెట్టుకుంటే నేరం కాదు. అలాగే.. ఒక భార్య తన భర్త అనుమతితో ఇంకొకరితో సంబంధం పెట్టుకుంటే నేరం కాదు.2018లో జోసెఫ్ షైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో జోసెఫ్ షైన్ అనే ప్రవాస కేరళీయుడు ఈ సెక్షన్ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును విచారించి సెక్షన్‌ను తొలగిస్తూ.. ఏకగ్రీవ తీర్పును వెలువరించింది.వివాహేతర సంబంధం పెట్టుకోవడం నేరం కాకపోయినప్పటికీ.. హిందూ వివాహ చట్టం 1955.. ప్రత్యేక వివాహ చట్టం 1954.. భారత విడాకుల చట్టం 1869 (క్రైస్తవులకు) వంటి చట్టాల ప్రకారం.. విడాకులు తీసుకునేందుకు ఇది ఒక కారణంగా మాత్రం పరిగణించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ముస్లిం చట్టం ప్రకారం కూడా ఇది తలాఖ్ (విడాకులు) పొందేందుకు ఒక కారణంగా తీసుకుంటారు.వివాహేతర సంబంధాలు పెరగడానికి కారణాలు

భార్యాభర్తల మధ్య అవగాహన, సత్సంబంధాలు లేకపోవడం.

దంపతుల్లో ఒకరిపై మరొకరికి ప్రేమ, నమ్మకం, అవగాహన లేకపోవడం వల్ల ఇతరుల వైపు ఆకర్షితులవుతారు.

ఇష్టం లేకుండా, కుటుంబ సభ్యుల ఒత్తిడితో బలవంతంగా పెళ్లిళ్లు చేసుకోవడం.

భార్యాభర్తల మధ్య తగినంత సంభాషణ లేకపోవడం.

ఒకరి కోసం ఒకరు సమయం ఇవ్వకపోవడం వల్ల ఎమోషల్ బంధంలేక దూరం పెరగడం.

తమ భాగస్వామితో లైంగికంగా సంతృప్తి చెందకపోవడం వల్ల కూడా వివాహేతర సంబంధాలు పెరుగుతాయి.

సోషల్ మీడియాలో పెరుగుతున్న కొత్త కొత్త పరిచయాలు కూడా ఇతరులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవడానికి కారణం.

పనిచేసే ప్రదేశాల్లో ఏర్పడిన పరిచయాలు కూడా వివాహేతర సంబంధాలను పెంచుతున్నాయి.

వివాహేతర సంబంధాలు అడ్డుకోవడం ఎలా?

భార్యాభర్తలు తమ వైవాహిక బంధాన్ని బలోపేతం చేసుకోవడం.

ఎలాంటి పరిస్థితుల్లోనే భార్యాభర్తల సంబంధంలోని మూడో వ్యక్తిని తలదూర్చకుండా చూసుకోవాలి.

## ఆగస్టు 15 నాటికి క్రిటికల్ కేర్ విభాగం పనులు పూర్తి చేయాలి..... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం నగరంలో పర్యటించిన జిల్లా కలెక్టర్.

రామగుండం, గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో చేపట్టిన క్రిటికల్ కేర్ విభాగం పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం రామగుండం నగరంలో విస్తృతంగా పర్యటించారు. రామగుండం నగరంలోని గోదావరిఖని జనరల్ ఆసుపత్రి, తహసిల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, గోదావరిఖని జనరల్ ఆసుపత్రి లో నూతన క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు పరిశీలించి ఆగస్టు 15 వరకు పనులు పూర్తి చేసి ఆసుపత్రికి అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు.ఆసుపత్రిలో గైనిక్ పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ఎస్.ఎన్.సి.యూ వార్డు లను, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ ఓపి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో అవసరమైన సిబ్బందిని నియమించామని రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. రామగుండం తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి పెండింగ్ దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజూ నిర్ణీత సంఖ్యలో దరఖాస్తులను డిస్పోస్ చేసే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రామగుండం మున్సిపల్ కార్యాలయంలో కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్ సింగ్, డా.రాజు, తహసిల్దార్ ఈశ్వర్ , తదితరులు పాల్గొన్నారు.

## నిధుల విడుదల పట్ల గ్రామస్తుల సంబరాలు

పెద్దపల్లి

మండలంలోని సబ్బితం గ్రామంలోగల గౌరీ గుండాల జలపాతం అభివృద్ధికి రూ. 6 కోట్ల నిధులు విడుదల పట్ల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ చందా శంకర్ మాట్లాడుతూ పూర్వకాలం నుండి ఈ జలపాతం వున్నా గత పదిహేళ్ల నుండి పూర్తిస్థాయిలో ప్రాచుర్యం పొంది అనతికాలంలోనే పలు జిల్లాలనుండి ప్రతి నిత్యం పర్యాటకులు రావటం జరిగిందన్నారు. దీంతో సరైన వసతులు లేక పర్యాటకులు ఇబ్బందులు పడిన ఘటనలు వున్నాయని తెలిపారు. కాగా ప్రస్తుత ఎమ్మెల్యే విజయరామణ రావు గతంలో ఇచ్చిన హామీ మేరకు జలపాతం అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోనే ఒక మంచి పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న సందర్భంగా సబ్బితం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ చంద శంకర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంబరాలు చేస్తూ భానసంచాలు పేల్చి,సీట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణ రావు, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణా రావు, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ఎమ్మెల్యే చేసిన కృషిని పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కీర్తి హరీష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గుమ్మడి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నాయకుడు కందుల అశోక్, నాయకులు నూనె రమేష్, సుద్దాల సతీష్, గంకిడి నారాయణ,మాదాసి రాజయ్య, చుంచు రాములు, కళ్లేపల్లి కిష్టయ్య, గాజుల అశోక్, మేడిపల్లి సంపత్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## 27న జిపివో, సర్వేయర్ల పరీక్ష, జయశంకర్ భూపాలపల్లి

జులై 25 ఈ నెల 27న నిర్వహించనున్న గ్రామ పరిపాలన అధికారి, లైసెన్సుడ్ సర్వేయర్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెల 27వ తేదిన జరుగనున్న గ్రామ.పరిపాలన అధికారి, లైసెన్సుడ్ పరీక్షలు నిర్వహణపై రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతి రాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి పరీక్షను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని, 38 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాస్తున్నారని తెలిపారు.అలాగే లైసెన్సుడ్ సర్వేయర్ పరీక్ష జిల్లా కేంద్రంలోని జివిటిసి కేంద్రంలో వ్రాత, ప్రాక్టీకల్ పరీక్షలు అదే రోజు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పరీక్షకు హాజరయ్యే అభ్య ర్థులు చివరి నిమిషం వరకు వేచియుండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.పరీక్ష నిర్వహణలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ప్రశ్న, జవాబు పత్రాలను పోలీస్ భద్రత నడుమ తరలించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్, సింగరేణి అధికారులకు సూచించారు.

## ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు మూసివేత

విజయవాడ

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. విజయవాడలో భారీ వర్షాల నేపథ్యంలో ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్‌ను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. రోడ్డు మీద ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున భద్రతా పరంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. భక్తుల వాహనాలను కనకదుర్గ నగర్ వైపు మళ్లిస్తున్నారు. ఈ మేరకు భక్తులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మూసి ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా నీరు విడుదల

నల్గోండ జూలై 25,

కేతేపల్లి మండలం, మూసి ప్రాజెక్ట్ నుంచి రెండు గేట్ల ద్వారా నీటిని అధికారులు విడుదల చేసారు. గెట్ నెంబర్ 3, 8 క్రషర్ గేట్లను ఒక ఫీట్ మేరకు ఎత్తి.. 1293 క్యూసెక్కుల నీటి విడుదల చేసారు. గేట్లు తెరుస్తున్న తరుణంలో విద్యుత్ అంతరాయం కలిగింది. దాంతో అధిక్ఆరులు జనరేటర్ సహాయంతో గేట్లను లిఫ్ట్ చేసారు. మొదట.. 2, 8 వ గేటును లిఫ్ట్ చేయాలని పూజలు జరిపారు. సాంకేతిక లోపంతో 3, 8వ గేటును లిఫ్ట్ చేసి నీటిని విడుదల చేసారు

## భీమునిపాదం దగ్గర పర్యాటకుల సందడి

మహబూబాబాద్

ప్రకృతి ఒడిలో పరవాళ్ళు తొక్కుతున్న భీముని జలపాతం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతా నాగారం గ్రామపంచాయతీ కొమ్మలవంచ గ్రామ అటవీ ప్రాంతాలలో భీముని పాదం పై నుండి జలపాతాలు నీరు కక్కుతూ హోయ లోలుకుతున్నాయి. సీతానగరం గ్రామ పంచాయతీ నుండి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కమనీయ అందాలను చూడడానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో నుండి కాకుండా ఖమ్మం, జిల్లాలలోని సుదీర్ఘ ప్రాంతాల నుండి అనేకమంది సందర్శకులు కుటుంబ సమేతంగా వచ్చి ఇక్కడ అందాలను చూసి ఆస్వాదిస్తున్నారు. గూడూరు అటవీ శాఖ పరిధిలో ఉన్న ఈ భీముని జలపాతాల అందాలను ఎన్నిసార్లు చూసిన తనవి తీరదు. ఇక్కడికి వచ్చే పర్యటకులు జాలువారే జలపాతాల కింద స్నానాలు చేస్తూ, ఎంత పెద్ద వారైనా చిన్న పిల్లల కేరింతలు కొడుతూ ఆ నీటిలో జలకలాడుతుంటారు. సుమారు 20 అడుగుల ఎత్తు నుండి పోస్తున్న ఈ జలపాతాన్ని చూస్తే ప్రతి ఒక్కరి మనసు మైమరచిపోవాల్సిందే.

భీముని పాదం జలపాతం ప్రత్యేకత

పూర్వం ఈ పరిసర ప్రాంతాలను పరిపాలించే ఒక యాదవ రాజుకు ఇద్దరు భార్యలు ఉండేవారు. ఇద్దరు భార్యలలో మొదటి భార్య బిడ్డను చిన్న భార్య చంపాలని నిర్ణయించుకొని ఇక్కడే ఉన్న అడవిలో ఒక కట్టెల మేడాన్ని నిర్మించి, ఆ కట్టెల మేడలో తల్లి బిడ్డను ఉంచి, ఆ చిన్న భార్య ఆ కట్టెల మేడకు నిప్పు అంటించడంతో ఆ మంటల్లో పడి అరుస్తున్న తల్లి బిడ్డల అరుపులు విన్న, ఇదే అటవీలో వనవాసం చేస్తున్న పాండవులలో ఒకడైన భీముడు ఆ ప్రాంతానికి చేరుకొని ఆ సమయంలో అక్కడ ప్రవహిస్తున్న నీటిలో ఒక అడుగు వేసి ఆ నీటితో ఆ మంటల్లో ఉన్న తల్లి బిడ్డను రక్షించడంతో ఆనాడు వేసిన భీముని పాదమే ఈరోజు భీముని జలపాతంగా మారిపోయింది.

## వాగులో డీసీఎం బోల్తా

షాద్ నగర్

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందూర్గు మండలం తంగేళ్లపల్లి వాగులో పత్తి లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా పడింది. పత్తిలోడుతో కాటన్ మిల్లు కు వెళుతున్న డీసీఎం వ్యాను తంగేళ్లపల్లి గ్రామ శివారులోని వాగు వద్ద వేసిన మట్టిరోడ్డు ఇరుకుగా ఉండటంతో అదుపుతప్పి వాగులో డీసీఎం బోల్తా పడింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగు నిండుగా ప్రవహిస్తుంది. గత కొన్ని ఏళ్లుగా వాగుపై వంతెన నిర్మాణాన్ని చేపట్టమని గ్రామస్తులు అధికారులను రాజకీయ నాయకులను ఎంతగా వేడుకొన్న ఇప్పటివరకు వాగుపై వంతెన నిర్మాణాన్ని చేపట్టకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మా ప్రభుత్వం లో కక్ష్యలు ఉండవు?.

### తప్పు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయి

### మంత్రి నిమ్మల రామానాయుడు

తిరుపతితిరుపతి నియోజకవర్గం లో మంత్రి నిమ్మల రామానాయుడు., మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తో కలసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం లో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది 16 వేలకు పైగా టీచర్ పోస్టుల ను భర్తీ చేస్తోంది. 5 రూపాయలకే అన్నా క్యాంటీన్ ద్వారా భోజనం అందిస్తూ ,రోజుకు 2.5 లక్షలమందికి కడుపు నింపుతున్నాం. అభివృద్ధి , సంక్షేమం అందిస్తూ ప్రజల చేత మంచి ప్రభుత్వం అని పేరు తెచ్చుకున్నామని అన్నారు. తలరాతలు మార్చే నాయకుడు చంద్రబాబు ఐతే, తలకాయలు తొలగించే వ్యక్తి జగన్. పారిశ్రామిక వేత్త లు రాష్ట్రానికి రావాలంటే , మళ్లీ జగన్ రాడు అనే భరోసా ఇవ్వమంటున్నారు.

# ఊహించినంత బజ్ ఇవ్వని హరిహరవీరమల్లు

హైదరాబాద్, జూలై 25,



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో వచ్చిన హరిహర వీరమల్లు సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా కి పెద్దగా బజ్ అయితే లేకుండా పోయింది. దాంతో పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగి ప్రమోషన్స్ చేయడంతో ఈ సినిమా మీద హైప్ ఒక్కసారిగా పెరిగింది. దాంతో టికెట్స్ మొత్తం బుక్ అయ్యాయి. మరి ఏది ఏమైనా కూడా ఈ సినిమా సక్సెస్ ని సాధించిందా? లేదా అనేది మనం ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం?ముందుగా ఈ సినిమా కథ విషయానికి వస్తే మొగలులా సామ్రాజ్యధినేత అయిన ఔరంగ జేబు నిజమైన హిందువులు వాళ్ల మతాన్ని కాపాడుకుంటూ హిందువుగా బతకడానికి 'జిజియా' పన్ను కట్టాల్సిందే అనే ఒక రూల్ పెడతాడు. మరి హిందుత్వాన్ని హిందువులను కాపాడుకోవడానికి వీరమల్లు ఏం చేశాడు. ఆయన రాబిన్ హుడ్ లా మారి జనాలను బతికిస్తూ మొగల్స్ పైన ధర్మ యుద్ధం ఎలా చేశాడు అనేది ఈ సినిమా స్టోరీ?ఒక రకంగా ఈ సినిమా లో కొంతవరకు ఫిక్షన్ స్టోరీ ని ఆడ్ చేసినప్పటికి మొగులుల గురించి ఇంతకుముందు మనం విన్నది అంతా అబద్ధం అనేది చూపించారు. ఎంతసేపు మొగలులు మంచి వాళ్ళు అంటూ చరిత్రలో రాసి పెట్టారు. కానీ వాళ్ళ అరాచకాలు, ఆకృత్యాలు ఎలా చేశారు, ఎవరు చెప్పే ప్రయత్నం చేయలేదు. కానీ నిజమైన చరిత్రను ఇప్పుడు చెప్పే ప్రయత్నం అయితే చేస్తున్నారు. అందులో భాగంగానే 'హరిహర వీరమల్లు' సినిమా కూడా అలాంటి సినిమానే కావడం విశేషం? మరి హీరో ఔరంగజేబు మీద ఎలా యుద్ధం చేశాడు అనేది తెలియాలంటే మాత్రం మీరు ఈ సినిమా చూడాల్సిందే?ఇక విశ్లేషణ విషయానికి వస్తే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఈ సినిమాలో చాలా మంచి పర్ఫామెన్స్ అయితే ఇచ్చాడు. చాలా రోజుల తర్వాత పవన్ కళ్యాణ్ ని స్క్రీన్ మీద చూస్తున్న అభిమానులు పునకలతో ఆగిపోయారనే చెప్పాలి. అయితే సినిమా కథలో ఉన్న క్వాలిటీని స్క్రీన్ మీద ప్రజెంట్ చేయడంలో మాత్రం ఫెయిల్ అయిపోయారు. ఫస్టాఫ్ కొంతవరకు ఓకే అనిపించినప్పటికి సెకండాఫ్ లో వచ్చే ఏ ఎలిమెంట్ కూడా ప్రేక్షకుడిని పెద్దగా మెప్పించలేకపోయాయి. ముఖ్యంగా హీరో హీరోయిన్ ఎలిమెంట్స్ కానీ, అడ్వెంచర్స్ కు సంబంధించిన ఎలిమెంట్స్ కానీ, ఎమోషనల్ సీన్స్ కానీ ప్రేక్షకుడిని ఏమాత్రం ఇంపాక్ట్ కి గురి చేయవు. జస్ట్ మూవీ నడుస్తుందా అంటే నడుస్తుంది. ఆ రేంజ్ లోనే ఉంటుంది తప్ప హై వోల్టేజ్ ఇంపాక్ట్ అయితే ఇవ్వలేకపోయింది. కీరవాణి మ్యూజిక్ కొంతవరకు పర్లేదు అనిపించినప్పుడు ఈ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో ఆయన కూడా ఎలాంటి ఇంపాక్ట్ ను చూపించలేకపోయాడు. ఓవరాల్ గా సినిమా చూస్తున్నంత సేపు ఏదో తెలియని ఒక లో ఫీల్ అయితే కలుగుతోంది. పవన్ కళ్యాణ్ స్క్రీన్ మీద ఉన్నాడని ఒక బలమైన సంకల్పంతో సినిమాను చూడడమే తప్ప ఇందులో పెద్దగా మెప్పించే ఎలిమెంట్స్ అయితే లేవు?ఇక కథని రాసుకున్న విధానం కానీ, సీన్స్ ను అల్లుకున్న పద్ధతి కానీ అన్ని బాగున్నప్పటికి స్క్రీన్ మీద ప్రజెంట్ చేయడంలో డైరెక్టర్ కొంతవరకు తడబడ్డాడు. పెద్దగా ఎక్స్పీరియన్స్ లేకపోవడం స్టార్స్ ని హ్యాండిల్ చేసే కెపాసిటీ లేకపోవడం వల్లే, ఈ సినిమా అంత ఎఫెక్టివ్ గా రాలేదు? పవన్ కళ్యాణ్ యాక్షన్ పర్లేదు అనిపించినప్పటికి ఎంతసేపు ఒకే టైప్ ఆఫ్ ఫైట్స్ ని చూసిన ఫీలింగ్ అయితే కలుగుతోంది. ఒక్కసారి చూస్తే బాగా అనిపిస్తుంది. కానీ పదే పదే చూడడం వల్ల ప్రేక్షకుడికి బోర్ కొడుతుందిఇక ఆర్టిస్టులు పర్ఫామెన్స్ విషయానికి వస్తే పవన్ కళ్యాణ్ వీరమల్లు పాత్రలో చాలా ఒదిగిపోయి నటించాడు. ఆయన చేసిన ఈ పాత్ర ఆయనకు ఒక మంచి ఎక్స్పీరియన్స్ అనే చెప్పాలి. ఇప్పటివరకు పవన్ కళ్యాణ్ ఇలాంటి పాత్రని పోషించలేదు. కాబట్టి ఆయన పాత్ర మేరకు ఆయన పర్ఫెక్ట్ గా తన క్యారెక్టర్ ని డెలివర్ చేశాడు? ఇక ఔరంగజేబుగా నటించిన బాబి డియోల్ చాలా మంచి పర్ఫామెన్స్ అయితే అందించాడు. ఇంతకుముందు అనిమల్ డాకు మహారాజు సినిమాలో తన విలనిజాన్ని చూపించిన ఆయన ఈ సినిమాలో కూడా తన క్రూరత్వాన్ని చూపించాడు? ఇక మిగిలిన ఆర్టిస్టులందరు కూడా వాళ్ళ పర్ఫామెన్స్ ని పర్ఫెక్ట్ గా ప్రొజెక్ట్ చేసే ప్రయత్నం చేశారు. నిధి అగర్వాల్ తన పాత్ర పరిధి మేరకు ఓకే అనిపించింది?ఇక ఈ మూవీ టెక్నికల్ అంశాల విషయానికి వస్తే కీరవాణి హై వోల్టేజ్ మ్యూజిక్ ని అందించడంలో కొంతవరకు ఫెయిల్ అయిపోయాడు. ఈ సినిమాటోగ్రఫీ విషయానికి వస్తే మనోజ్ పరమహంస సైతం భారీ విజువల్స్ అందించలేకపోయాడు. ప్రొడక్షన్ వాల్యూస్ కూడా అంత పెద్ద ఎఫెక్టివ్ గా అయితే అనిపించలేదు. ఇంకాస్త డబ్బులు పెట్టి చాలా రిచ్ గా తీసి ఉంటే సినిమా క్వాలిటీ అనేది బాగా వచ్చేది. ఎడిటింగ్ కూడా అంతే ఎఫెక్టివ్ గా లేదు.

# 430 కోట్లతో సిటీలో ఐకానిక్ బ్రిడ్జి

హైదరాబాద్, జూలై 25,

తెలంగాణంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ప్రపంచ స్థాయి మౌలిక సౌకర్యాలు కల్పించి.. దాన్ని విశ్వనగరంగా నిలిపేందుకు ప్రణాళికలు రచిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందుకోసం వేల కోట్ల రూపాయల ఖర్చుతో అనేక ప్రాజెక్టులు ప్రారంభించింది. ఈ క్రమంలో తాజాగా రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసకుంది. భాగ్యనగరంలో మరో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుమారు 430 కోట్ల రూపాయల ఖర్చుతో దీన్ని నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

భాగ్యనగరంలోని చారిత్రక మీరాలం చెరువుపై.. రూ.430 కోట్లతో.. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపింది. మూసీ నది అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో ఈ ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర పురపాలకశాఖ గురువారం అనుమతి మంజూరు చేసింది. ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎంఆర్‌డీసీఎల్ ఎండీ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలానే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, టెండరు ప్రక్రియను ఆలస్యం చేయకుండా.. వెంటనే ప్రారంభించాలని తెలిపారు. ఐకానిక్ బ్రిడ్జి నమూనాను.. ముందుగా ఐఐటీ హైదరాబాద్, జేఎన్‌టీయూ, వరంగల్ నిట్ వంటి ప్రముఖ సంస్థలు పరిశీలించి.. నిపుణుల ఆమోదం పొందాక.. నిర్మాణ పనులు ప్రారంభించాలని పురపాలకశాఖ తెలిపింది..ప్రభుత్వం మీరాలం చెరువుపై నిర్మించ తలపెట్టబోయే ఐకానిక్ బ్రిడ్జి పొడవు 2.5 కి.మీ ఉండనుంగా.. వెడల్పు 16.5 మీటర్లు ఉండనుంది. ఈ బ్రిడ్జిని.. చెరువుకు పశ్చిమాన ఉన్న చింతల్‌మెట్, తూర్పున శాస్త్రిపురం నుంచి సాగిపోయే బెంగళూరు నేషనల్ హైవేను కలిపేలా నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల చింతల్‌మెట్, శాస్త్రిపురం, అత్తాపూర్, కిషన్‌బాగ్, బహదూర్‌పుర ప్రాంతాల్లోని వాహనదారులకు.. అలానే చింతల్‌మెట్ నుంచి బెంగళూరు ఎన్‌హెచ్ ద్వారా ఎయిర్ పోర్ట్‌కి వెళ్లే వారికి ప్రయోజనం కలగనుంది. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.నిజాం కాలంలో ఈ చెరువును నిర్మించారు. భాగ్యనగర వాసుల దాహం తీర్చేందుకు మూడో నిజాం ఈ చెరువును నిర్మించారు. చెరువు నిర్మాణం పనులు జులై, 1804లో ప్రారంభం అయ్యి రెండేళ్ల వ్యవధిలో అనగా 1806లో పూర్తయ్యాయి. నిజాం సంస్థానంలో దివాన్‌గా పని చేసిన మీర్ ఆలం బహదూర్ పేరును ఈ చెరువుకు పెట్టారు. ఈ చెరువు కట్ట నిర్మాణం అర్ధ చంద్రాకారంలో ఉండి జనాలను విపరీతంగా ఆకట్టుకుంటుంది. చెరువు మధ్యలో మూడు దీవులుంటాయి. చెరువు నిర్మించినప్పుడు దీని విస్తీర్ణం 600 ఎకరాలు కాగా.. ప్రస్తుతం అది 450ఎకరాలకు పరిమితమైంది. ఈ చెరువు దిగువన జంతు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఈ రెండింటిని ఐకానిక్ బ్రిడ్జితో అనుసంధానం చేసి.. పర్యాటకులను ఆకట్టుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## భైంసా లో నేల కూలిన చెట్టు

### రాకపోకలకు ఇబ్బందులు.

నిర్మల్ జూలై 25,

భైంసా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి నర్సింహా నగర్ వెళ్లే మార్గంలో ఓ పెద్ద చెట్టు నేల కూలింది. అర్ధరాత్రి సమయంలో గాలులకు చెట్టు పడిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. చెట్టు పడిన సమయంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దింతో నర్సింహా నగర్, సాయి కాటన్, ఒవైసీ నగర్ వెళ్లే మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. చెట్టు పక్కనే విద్యుత్ స్థంభం కూడా కింద పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచింది. మున్సిపల్ అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపడుతున్నారు.

## ధర్మపురి లో ఘనంగా ప్రారంభమైన శ్రావణమాస ఉత్సవాలు

దక్షిణ కాశీగా పేరుగాంచి హరిహర క్షేత్రంగా పిలవబడుతూ నవ నారసింహస్వామి క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం రోజు శ్రావణ మాసో త్సవాలు అత్యంత ఘనంగా ప్రారంభమైనాయి. శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి?శ్రీ ఉగ్ర లక్ష్మీ నరసింహ స్వామి?శ్రీ రామలింగేశ్వర స్వామి?శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో పుణ్యాహవాచనము?కలశ గణపతి పూజలు?సంకల్ప పూజలు అనంతరం ముగ్గురు స్వాముల ఆలయాలలోని మూలమూర్తులకు పంచామృతాలతో వేద పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. అలంకరణ అష్టోత్తర శతనామార్చనలు ధూప?దీప?ప్రత్యేక నివేదనలు? సప్త హారతులు?

మంత్రపుష్పం? తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అన్న పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఉగ్ర లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో నిత్యము సాయంత్రం భజన సంకీర్తన సేవా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ రోజు ప్రారంభమైన ప్రత్యేక పూజలు నెలరోజుల పాటు నిర్వహించబడును. శ్రావణమాసం శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో శ్రావణమాసో త్సవాల ప్రారంభ పూజల్లో పాల్గొన్నారు. వి

## పెచ్చులూడిని అంగన్వాడీ రూఫ్

మెదక్

కౌడిపల్లి మండలం కూకట్లపల్లి అంగన్ వాడి కేంద్రంలో చిన్నారులకు ప్రమాదం తప్పింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బిల్డింగ్ పై కప్పు ఊడిపడింది. దాంతో చిన్నారులు పరుగులు తీసారు. చిన్నారులు లేని చోట పెచ్చులు పడటంతో ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో అంగన్ వాడి కేంద్రంలో 12 మంది చిన్నారులు వున్నారు.

## యువరైతు ఆత్మహత్యాయత్నం

వరంగల్‌రాయపర్తి మండలం బిల్ నాయక్ తండా గ్రామ యువ రైతు రమేష్ నాయక్ మైలారం సబ్ స్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నాం చేసాడు. ట్రాన్స్ఫార్మర్ కాలిపోవటంతో రిపేర్ కోసం డిడి కట్టి నెలరోజులు గడుస్తున్నా విద్యుత్ అధికారులు కాళ్లు అరిగేలా తిప్పించుకుంటున్నారని ఆరోపించాడు. పంటలు వేసే అనుకూల సమయం అయిపోవడంతో రైతు విసిగి చెంది ట్రాన్స్ఫార్మర్ రిపేర్ చేయటం లేదని అధికారుల ముందే ఆత్మహత్యయత్నం చేసాడు. రైతుల పంట కాలం అని కనీస బాధ్యత మరిచిన అధికారుల పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రేవంత్ క్లియర్ కట్ పిక్చర్...

హైదరాబాద్, జూలై 25,



మిగతా పార్టీల సంగతి ఎలా ఉన్నా.. కాంగ్రెస్ పార్టీలో పొలిటికల్ ఈక్వేషన్స్ చాలా సులభంగా మారిపోతుంటాయి. అప్పటిదాకా పార్టీ జెండా మోసిన వాళ్లు.. పార్టీ గద్దె కట్టినవాళ్లు.. కేసులు ఎదుర్కొన్న వాళ్ళు పక్కకు వెళ్లి పోతారు. మధ్యలో వచ్చినవాళ్లు.. లాబీయింగ్ చేసినవాళ్లు.. పార్టీ పెద్దల అవసరాలు తీర్చిన వాళ్ళు ఒక్కసారిగా మందు వరుసలోకి వస్తారు. ఇదేదో మేము చేస్తున్న ఆరోపణ కాదు. ఇటీవల కాలంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని.. ఆ పార్టీలో పని చేస్తున్న సీనియర్ నాయకులు అంటున్న మాట. సరే ఇప్పుడు రాజకీయాలు అనేవి పూర్తిగా డబ్బుమయం అయిపోయాయి. పార్టీ పెద్దల అవసరాలు తీర్చిన వాళ్లకే పీఠాలు దక్కుతున్నాయి. కాంగ్రెస్ మాత్రమే కాదు, అన్ని పార్టీలలో పరిస్థితి దాదాపు ఇలానే ఉంది. ఇక ప్రాంతీయ పార్టీలో అయితే ఆ లెక్కలు వేరే విధంగా ఉంటాయితెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. రేవంత్ ముఖ్యమంత్రి అ కొనసాగుతున్నారు. అధిష్టానం పెట్టిన అనేక శల్య పరీక్షలు దాటుకుని ఆయన ఇక్కడదాకా వచ్చారు. ఇప్పుడిప్పుడే పరిపాలన మీద తన పట్టును నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో కొన్ని వైఫల్యాలు ఉండవచ్చు.. కొన్ని సానుకూలతలు ఉ ఒడవచ్చు. కాకపోతే మీడియా కావాల్సింది వైఫల్యాలు మాత్రమే. ఎందుకంటే మీడియా అనేది పాజిటివిటీకి దూరంగా ఉంటుంది. మీడియా లక్షణం కూడా అదే.. ఇక ప్రస్తుతం రేవంత్ ఢిల్లీలో ఉన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఢిల్లీ వెళ్లడం ఇది 49వ సారి. ఆయన ఒక ముఖ్యమంత్రి కాబట్టి.. కేంద్రంతో సంప్రదింపులు ఉంటాయి కాబట్టి వెళ్తున్నారు. అందులో తప్పు పట్టడానికి లేదు. తప్పు అని చెప్పడానికి లేదు. ఆయనేం గులాబీ దళపతి కాదు కదా.. పైగా తను డెమొక్రటిక్ అని చెబుతున్నాడు కాబట్టి తెలంగాణ ముఖ్యమంత్రికి అది తప్పదు.ఢిల్లీ వెళ్ళిన ప్రతిసారి రేవంత్ కాంగ్రెస్ పెద్దలను కలుస్తున్నప్పటికీ.. ఎందుకో రాహుల్ ఈ మధ్య రేవంత్ మీద అలక పూనినట్టు కనిపిస్తున్నాడు. ఎలాగూ గులాబీ పార్టీ మీడియా.. ఆ పార్టీ నాయకులు ఈ వ్యవహారాన్ని నెగిటివ్ గానే చూస్తారు. అవకాశం దొరికింది కాబట్టి ఇంకా పెట్రోల్ పోస్తారు. ఆ మంటల్లో రాజకీయాలను చేస్తుంటారు. పైగా అధికారం పోయిన తర్వాత గులాబీ పార్టీ అత్యంత ప్రజాస్వామిక లక్షణాలను పుణికి పుచ్చుకుంటున్నది. అందువల్లే తెలంగాణ ముఖ్యమంత్రి తీరు నియంతలాగా ఉందని చెబుతోంది.. పాపం అధికారంలో ఉన్నప్పుడు భారత రాష్ట్ర సమితి ఎలా పరిపాలించిందో తెలంగాణ ప్రజలకు తెలియదా. అందు గురించే కదా పార్లమెంట్ ఎన్నికల్లో 0 ఫలితాలు ఇచ్చింది. అయినా కూడా భారత రాష్ట్ర సమితి గొప్పలు చెప్పుకుంటుంది. త మీద తెలంగాణ మొత్తాన్ని బాగు చేసినట్టు డాంబికాలు పలుకుతోంది. ఇక హస్తినలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రికి చాలా కాలం తర్వాత రాహుల్ మోక్షం కల్పించారు. ఒక సీట్లో తను కూర్చుని.. మరో సీట్లో మల్లికార్జున కార్గే.. ఇంకో సీట్లో రేవంత్.. ఎదురుగా ఉన్న సీట్లో భట్టి కూర్చున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాలపై చర్చించారు.. కులగణన.. ఇతర అంశాలపై మాట్లాడారు.. ఇంకా అంతర్గత విషయాలు ఏం చర్చించారో తెలియదు. ఏ అంశాలు చర్చకు వచ్చాయో తెలియదు. మొత్తానికి ఈ ఫోటో ద్వారా రేవంత్ తన మీద వస్తున్న విమర్శలకు సమాధానం చెప్పారు. తన మీద ఉన్న ఒత్తిడిని ఒక్కసారిగా తగ్గించుకున్నారు. తద్వారా రాహుల్ తనకు దూరం కాదని.. తానేమి రాహుల్ ను కాదని పోవడం లేదని రేవంత్ నిరూపించారు. రాహుల్ కూడా రేవంత్ తో సరదాగా మాట్లాడారని ఢిల్లీ వర్గాలు అంటున్నాయి.

# వరంగల్ లో పంద్రాగస్టు

వరంగల్, జూలై 25,

తెలంగాణ ప్రభుత్వం వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. వరంగల్‌లో ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభించనున్నారు. ఈ మేరకు క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆమోదం తెలిపారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడా పాఠశాల ఏర్పాటుకు అధికారులను ఆదేశించారు. వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది. .తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. వరంగల్‌ని తెలంగాణకు రెండో రాజధానిగా మార్చాలని భావిస్తోన్న రేవంత్ సర్కార్.. ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తుంది. దీనిలో భాగంగా వరంగల్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసేందుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చింది. ఇప్పటికే జిల్లాలో మామునూరు ఎయిర్‌పోర్ట్, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వంటి పథకాల కోసం రూ.6 వేల కోట్ల నిధులు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక తాజాగా ఈ ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఓరుగల్లుకు ప్రత్యేక బహుమానం ఇచ్చేందుకు సర్కార్ రెడీ అవుతోంది. పంద్రాగస్టు సందర్భంగా ఓరుగల్లుకి ప్రభుత్వం ప్రత్యేక గిఫ్ట్ ఇవ్వనుంది. అది ఏంటంటే.. ఈ ఏడాది ఆగస్టు 15న వరంగల్లో స్పోర్ట్స్ స్కూల్ ను ప్రారంభించనున్నారు. ఈమేరకు తెలంగాణ స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్‌రంజన్.. వరంగల్‌లో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభానికి ఆమోదం తెలిపారు. ఓరుగల్లులో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభానికి తాత్కాలిక బిల్డింగ్‌ను కేటాయించడమే కాక.. అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ.. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజులు జయేశ్‌రంజన్‌కు విన్నవించారు. వారి ప్రతిపాదనకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎమ్మెల్యేలు బుధవారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలోని ఆఫీస్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కడియం, నాయిని రాజేందర్‌లు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుపై జయేశ్‌రంజన్‌తో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందుకోసం రేవంత్ సర్కార్.. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల వద్ద ఎన్‌హెచ్-163ని ఆనుకుని 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇచ్చేందుకు హామీ ఇచ్చిందని చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యేల విన్నపంపై స్పందించిన స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ ఆగస్టు 15న స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రేవంత్ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈక్రమంలోనే జిల్లాలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం ఆమోదం తెలిపారు. దీంతో పాటు స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కూడా పచ్చజెండా ఊపారు. క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల దగ్గర 50 ఎకరాలు అనువుగా ఉంటుందని ఎమ్మెల్యేలు.. సీఎం రేవంత్‌కు వివరించారు. అలానే జిల్లా నుంచి.. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులున్నారని ఎమ్మెల్యేలు సీఎంకు తెలిపారు. ప్రస్తుతం హనుమకొండలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఒక్కటే ఉందని.. అయితే ఇక్కడ అనేక మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరడంతో.. రేవంత్ అందుకు ఆమోదం తెలిపారు.

## లారీ బీభత్సం.. తప్పిన ప్రాణనష్టం

సత్తుపల్లి జూలై 25

పెనుబల్లి మండలం వి.ఎం.బంజర్ రింగ్ సెంటర్ లో లారీ బీభత్సం సృష్టించింది. బొగ్గులోడుతో సత్తుపల్లి నుండి హైదరాబాద్ కు వెళ్తున్న లారీ వి.యం.బంజర్ రింగ్ సెంటర్లో ఒకేసారి తిరువూరు రోడ్డు వైపు తిప్పడంతో ప్రమాదం జరిగింది. లారీ ఐదు ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్లింది. ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం

### ఓపెన్ కాస్ట్ 2, 3 ఉపరితల గనుల్లో నిలిచిపోయని బొగ్గు ఉత్పత్తి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ 2,3 లలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది మూడు రోజుల్లో గాను మూడు లక్షత క్యూబిక్ మీటర్ల మట్టి, 24 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడగా సింగరేణి సంస్థకు మూడు కోట్ల మేర ఆస్తి నష్టం కలిగినట్లు సింగరేణి అధికారులు తెలిపారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వాగులు ఉప్పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాలలో రోడ్లపై ఇండ్లలోకి వరద నీరు చేరింది.

# గ్రామ పంచాయితీల్లో పోటీకి కండిషన్స్...

నల్గొండ, జూలై 25

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఆసక్తి ఉన్నా.. ఇద్దరికంటే ఎక్కువగా పిల్లలు ఉండటంతో నైరాశ్యానికి గురవుతున్నారు. వారికి 1995 లో చేసిన పంచాయతీరాజ్ చట్టం గొడ్డలిపెట్టుగా మారింది. దానిని సవరించాలని గతంలో గత ప్రభుత్వాలకు విజ్ఞప్తులు వచ్చినప్పటికీ చొరవ తీసుకోలేదు. దీంతో పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడల్లా గెలిచినవారిపై ఓడినవారు కోర్టులకు వెళ్లడం పరిపాటిగా మారింది. అయితే ప్రజాప్రభుత్వంపై ఆశావాహులు ఆశలు పెట్టుకున్నారు. మార్పులు చేసి తమకు అవకాశం కల్పిస్తే బాగుంటుందని భావిస్తున్నారు. కోర్టుకు వెళ్తున్న ఘటనలు జనాభా నియంత్రణలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1995 మే 30న పంచాయతీరాజ్ చట్టంలోని 21వ పేజీలో 3వ అంశంగా చేర్చారు. దీంతో ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలు కలిగినవారికి స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని రద్దు చేశారు. అనర్హులుగా పేర్కొన్నారు. దీంతో చాలా మంది స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ వెనుకంజ వేస్తున్నారు. ఎవరైనా పోటీ చేసి విజేతలుగా నిలిచినా ఓటమిపాలైన వారు కోర్టుకు వెళ్తున్న ఘటనలు ఉన్నాయి. అవికూడా ప్రతిసారి ఎన్నికల సమయంలో నిత్యకృత్యమయ్యాయి. కోర్టులు కొన్ని సార్లు తీర్పును త్వరగా వెలువరిస్తే మళ్లీ వారు పై కోర్టులకు వెళ్తున్న సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణను అసెంబ్లీ సమావేశాల్లో చేయడమేనని పలువురు పేర్కొంటున్నారు. అదే చట్టం చేసి 30 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు సవరణ చేయలేదు. ప్రత్యేక తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ కు 1995 పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయాలని విజ్ఞప్తులు వచ్చాయి. ఈ చట్టంతో పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లోనూ ఇద్దరుకంటే ఎక్కువ పిల్లలు ఉంటే అనర్హులు అని పేర్కొన్నారు. అయితే 2019లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ చట్ట సవరణ చేసి ఇద్దరు పిల్లలు అనే నిబంధనలు సడలించింది. దీంతో పోటీచేసేవారికి ఊరట లభించింది. కానీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేవారికి నిబంధనలు సడలించలేదు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు 1995 చట్టం చేసిన చంద్రబాబునాయుడుఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత సవరణ చేశారు. పోటీచేసేందుకు అవకాశం కల్పించారు. అదే డిమాండ్ తెలంగాణలో ఉన్నప్పటికీ గత ప్రభుత్వం చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి సైతం ఈ అంశాన్ని పలు సందర్భాల్లో తీసుకొచ్చినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సైతం ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ ఉన్నా స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పలువురు అభిప్రాయపడుతున్నారు. వారికో న్యాయం వీరికో న్యాయమా ఎంపీలు, ఎమ్మెల్స, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసేవారికి, నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేసే నేతలకు 1995చట్టంతో సంబంధం ఉండదు. వారికి ఎంతమంది పిల్లలు ఉన్నా అవకాశం కల్పిస్తారు. చట్టాలు సైతం చేస్తారు. కానీ గ్రామస్థాయిలో పోటీచేసే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అవకాశం కల్పించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారికి ఒకన్యాయం, కిందిస్థాయి వారికి మరోన్యాయమా అనేది సర్వత్రా చర్చజరుగుతుంది. ఈ సమావేశంలో 1995 పంచాయతీరాజ్ చట్టంకు సవరణలు చేసేలా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే అంశాన్ని చర్చిస్తారా? లేకుంటే గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలనే అవలంభిస్తారా? చంద్రబాబు చేసిన 1995 చట్టంనే కొనసాగిస్తారా? అనేది చూడాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సవరణ చేస్తే బాగుంటుందని పలువురు విజ్ఞప్తులు చేస్తున్నారు. కేబినెట్ పైనే స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు సుముఖంగా ఉన్న ఆశావాహులు ఆశలు పెట్టుకున్నారు

# తెల్లవారక ముందే మద్యం అమ్మకాలు

మహబూబ్ నగర్, జూలై 25,

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో తెల్లవారక ముందే జోరుగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి కూత వేటు దూరంలో మద్యం అమ్మకాలు సాగిస్తున్న ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించడం లేదు. ఈ ఉదాసీనతకు ఎక్సైజ్ శాఖ అధికారులకు మాముళ్లు అందుతున్నాయనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బహిరంగానే ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా మద్యం అమ్మకాలు సాగిస్తూ, సమయ వేళలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, మేలచెర్వు చౌరస్తా, జమ్మిచేడు , రాఘవేంద్ర కాలనీలో మొత్తం జిల్లా కేంద్రంలో 8 వైన్ షాపులున్నాయి. నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం విక్రయాలు చేపట్టాలి. కాని కొత్తబస్టాండ్, ఓల్డ్ వెజిటేబుల్ మార్కెట్, మేలచెర్వు వైన్ షాపుల పక్కన ఉన్న ఫర్మిట్‌రూమ్ ల్లో నిర్వాహకుల కన్ను సన్నలో మందుబాబులకు తెల్లవారుజాము నుంచే మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా అన్ని మండల కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా మద్యం విక్రయాలకు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా పర్మిట్ రూమ్ ల చాటున నిర్వాహకులు బహిరంగానే మద్యం విక్రయాలు పాల్పడుతున్నా ఎక్సైజ్ అధికారులు ఎవరూ అటు వైపు తనిఖీలు చేసిన పాపాన పోలేదన్నా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాలలో సైతం. పచ్చని పల్లెలలో సైతం కొందరు విచ్చలవిడిగా బెల్టు షాపులను నిర్వహిస్తూ యథేచ్ఛగా మద్యం అమ్మకాలను చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 90, క్వార్టర్, హాఫ్,ఫుల్ కు పరిమాణాన్ని బట్టి అదనంగా వసూలు చేస్తూ కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్న ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. గ్రామాల ప్రధాన రోడ్ల పక్కనే తాగుతూ ఉండడంతో పొలం పనులకు, ఇతర గ్రామాలకు రాకపోకలు చేసే మహిళలు, మద్యం సేవించని వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మద్యం సేవిస్తున్నారని దీంతో మా కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం కావడంతో పాటు వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపుల ముందు అపరిశుభ్రత. జిల్లా కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని సమీపంలోని షాపు ఓనర్లు వాపోతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా షాపుల ముందు బహిరంగానే మద్యం సేవించడంతో ఖాళీ సీసాలు , గ్లాసులు, కాల్చేసిన సిగరెట్ లు దర్శనమిస్తున్నాయి. షాపుల ముందు మూత్ర విసర్జన చేసి పరిసరాలు దుర్గంధం వెదజల్లేలా చేస్తున్నారని, మద్యం షాపు నిర్వాహకులు మొరపెట్టుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. షాపుల ముందు రొచ్చు ఉండటంతో వినియోగదారులు నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదని, రొచ్చులో వ్యాపారం ఎలా సాగించాలని వ్యాపారులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.



# అధికారులకు కోర్టు టెన్షన్

హైదరాబాద్, జూలై 25

రిజర్వేషన్ల సీలింగ్‌ను ఎత్తివేసేందుకు ప్రభుత్వం గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నది. ఆర్డినెన్స్‌ను పూర్తి స్థాయిలో పరిశీలించిన గవర్నర్, లీగల్ ఒపీనియన్‌కు పంపించినట్లు సమాచారం. దీంతో ఆ ఆర్డినెన్స్‌కు గ్రీన్ సిగ్నల్ కోసం ఉన్నతాధికారులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆ సీలింగ్ తొలగిస్తేనే, రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతున్న నేపథ్యంలో, ఉన్నతాధికారులు తర్జన భర్జన పడుతున్నారు. హైకోర్టు విధించిన గడువు దగ్గర పడుతుండడంతో ఆఫీసర్లు టెన్షన్ పడుతున్నారు. ఒక వైపు సీఎం, సీఎస్‌లు ఫాలో అప్ చేస్తున్నా, ఆలస్యమైతే కోర్టు నుంచి తమకు సమస్యలు ఉంటాయనే భయం అధికారుల్లో ఉన్నది. కంటెంప్ట్ ఆఫ్? కోర్టు కిందకు వస్తుందని సంబంధిత అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఆ ఆర్డినెన్స్‌లో ఎలాంటి చిక్కులు లేకుండా విత్ లీగల్ ఒపీనియన్లతో తయారు చేసి, గవర్నర్‌కు పంపించామని, అయినప్పటికీ ఆలస్యంపై సెక్రటేరియట్‌లోని ఉన్నతాధికారుల్లో టెన్షన్ మొదలైంది. కోర్టు విధించిన సమయం జూలై 25 వరకే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో గవర్నర్ వద్ద ఆర్డినెన్స్ క్లియర్ చేపించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అంతా ఫోకస్ పెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఏకంగా ఢిల్లీ నుంచి ఫాలో అప్ చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 30 రోజుల్లో పూర్తి చేయాలని జూన్ 24న హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. 90 రోజుల్లో (సెప్టెంబర్ నెలాఖరులోగా) స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో ప్రభుత్వం హడావుడిగా ఆ ప్రాసెస్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నది. కనీసం జూలై చివరి వరకైనా ఆర్డినెన్స్ ఆమోదం పొందేలా ప్రయత్నాలు చేస్తున్నారు. క్యాప్ తొలగిస్తేనే రిజర్వేషన్లు సాధ్యం? పంచాయతీ రాజ్ యాక్ట్ 2018?29 ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సీలింగ్ ఉన్నది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఈ సీలింగ్ విధించామని గత ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ, పరిస్థితులను అనుగుణంగా రిజర్వేషన్లు మార్చుకోవచ్చన్న క్లాజ్ కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీని ఆధారంగానే సుప్రీం కోర్టు చెప్పిన తర్వాత కూడా రెండు మూడు రాష్?ట్రాలు ఈ సీలింగ్‌ను తొలగించినట్లు చేసినట్లు ఓ అధికారి తెలిపారు. ఇప్పుడు తెలంగాణలోనూ పంచాయతీ రాజ్ చట్టంలోని రిజర్వేషన్ల సీలింగ్‌ను తొలగిస్తేనే, 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకే గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపారు. అది క్లియర్ కాగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రత్యేక జీవో ఇవ్వనున్నది. ఆ జీవో కేవలం లోకల్ బాడీ రిజర్వేషన్లపై మాత్రమే ప్రస్తావిస్తుంది. విద్యా, ఉద్యోగాల్లో మాత్రం తప్పనిసరిగా రాష్?ట్రపతి వద్ద ఉన్న బిల్లు క్లియర్ కావాల్సిందేనని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. తర్వాత ఏంటి? తెలంగాణ అసెంబ్లీ తీర్మానం 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నది. అయితే, ఇది క్లియర్ అయ్యే ఛాన్స్ చాలా తక్కువేనని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. రాజకీయ మైలేజ్ కోణంలో అప్రూవల్ ఇవ్వకపోవచ్చనే చర్చ జరుగుతున్నది. అయితే, దీనిపై పార్లమెంట్, రాజ్యసభలో ఫైట్ చేసేందుకు కాంగ్రెస్ ఎంపీలు సిద్ధమయ్యారు. అంతేగాక వివిధ రాష్ట్రాల నుంచి పార్లమెంట్, రాజ్యసభలో ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీల మద్దతునూ కూడగడుతున్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. కేంద్ర ప్రకటించిన జనగణనకు తెలంగాణ డేటా మోడల్‌గా పనిచేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వివరిస్తుంది. కానీ, కేంద్రం ఎలా స్పందిస్తుందనే దానికి ఉత్కంఠగా మారింది. అయితే, కేంద్ర 42 శాతం బిల్లుపై లైట్ తీసుకుంటే, ఢిల్లీలో పోరాటం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి క్లియర్‌గా చెప్పారు. గతంలో నల్లచట్టాలను తెచ్చినప్పుడు కూడా బీజేపీ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించిందని, ప్రతిపక్షాలు తెచ్చిన ప్రెజర్‌తో వాటిని రద్దు చేసుకున్నట్లు వివరించారు. ఇప్పుడు కూడా తమకు ప్రత్యేక స్ట్రాటజీ ఉన్నదని, తప్పనిసరిగా 42 శాతం రిజర్వేషన్‌ను ఒప్పిస్తామని సీఎం ధీమాతో ఉన్నారు

# పాపం.. మధుయాష్కీ...

నిజామాబాద్, జూలై 25,

కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత మధుయాష్కి గౌడ్ కు ఇక ఈ మూడేళ్ల కాలంలో ఎటువంటి పదవులు దక్కే అవకాశాలు లేవు. ఆయన మొన్నటి ఎన్నికల్లో ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన నేపథ్యంలో ఆయనకు అన్ని దారులు మూసుకుపోయాయి. కాంగ్రెస్ హైకమాండ్ కూడా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన వారికి ఎలాంటి పదవులు ఇవ్వరాదని నిర్ణయించడంతో పదవులకు మధు యాష్కి గౌడ్ పదవులకు దూరంగా ఉండాల్సి వస్తుంది. ఆయన పెద్దగా యాక్టివ్ గా పార్టీలో లేకపోవడానికి కూడా కారణమదే. రాహుల్ గాంధీ టీంలో చురుకైన మెంబర్ గా ఒకనాడు వెలుగు వెలిగిన మధుయాష్కి గౌడ్ కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పదవులు లేకుండా ఉండిపోవాల్సి వచ్చింది. నిజానికి ఇది మధుయాష్కీ గౌడ్ చేసుకున్న స్వయం కృతాపరాధమే. ఆయన నిజామాబాద్ జిల్లాను వదిలి రావడమే చేసిన అతి పెద్ద తప్పు. అక్కడి నుంచి ఎల్.బి.నగర్ కు రావడంతో అక్కడి ప్రజలు ఆదరించలేదు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులుగా పోటీ చేయకపోవడం వరకూ కరెక్టే అయినా ఆ జిల్లాలో ఏదో ఒక అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఉంటే కొంత అనుకూల ఫలితం వచ్చేదని అంటున్నారు. కానీ కాంగ్రెస్ హైకమాండ్ కోరిన వెంటనే నిజామాబాద్ ను వదిలి ఎల్.బి.నగర్ కు రావడం, హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ కు పెద్దగా ఓటు బ్యాంకు లేకపోవడంతో ఓటమి తప్పలేదు. దీంతో మరో ఐదేళ్ల పాటు పదవి కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధుయాష్కి గౌడ్ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొంటూనే కాంగ్రెస్ అధిష్ఠానాన్ని తెలంగాణ ఏర్పాటు కోసం ఒప్పించేందుకు తనవంతు ప్రయత్నం చేశారు. 2009 నుంచి 2014 వరకు ఆయన ఇంచుమించు రాష్ట్ర మీడియాలో వార్తల్లో నిలిచిన వ్యక్తి. అయితే, 2014 ఎన్నికలతో ఆయన రాజకీయ ప్రయాణం మారింది. తెలంగాణ కోసం పోరాడిన ఇమేజ్ ఉన్న మధు యాష్కి ఆ ఎన్నికల్లోనూ గెలిచి కచ్చితంగా హ్యాట్రిక్ కొడతారని అంతా భావించినా, సీన్ రివర్స్ అయ్యింది. టీఆర్ఎస్ తరపున స్వయంగా పార్టీ అధినేత కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవితనే పోటీ చేయడంతో మధు యాష్కికి ఓటమి తప్పలేదు. సుమారు లక్షా యాభై వేల ఓట్ల తేడాతో కవిత చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు. దీంతో ఆయన అప్పటి నుంచి జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో సైలెంట్ గా మారిపోయారు. నియోజకవర్గానికి కూడా ఎప్పుడో అన్నట్లుగా తప్పితే పర్యటించింది లేదు. సాధారణ కుటుంబం నుంచి వచ్చినా ఢిల్లీ యూనివర్సిటీలో లా చదవడం, అమెరికాలో లా ఫర్మ్ నిర్వహించిన ఆయన టాలెంట్ ను కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించింది. కానీ మధుయాష్కి గౌడ్ ఓడిన తర్వాత జిల్లాను పట్టించుకోకుండా విదేశాలకు, ఢిల్లీకే పరిమితం కావడంతో ఆయన రాజకీయ జీవితంలో ఎదుగు బొదుగూ లేకుండా పోయింది. తనతో పాటు పార్లమెంటు సభ్యులుగా ఉన్న వారు నేడు రాష్ట్ర మంత్రులుగా ఉంటే మధు యాష్కి గౌడ్ మాత్రం సాధారణ కాంగ్రెస్ నేతగానే మిగిలిపోవాల్సి వచ్చింది. అది ఆయన చేసుకున్నదే. అందుకే రాజకీయాల్లోనూ చేసుకున్నవారికి చేసుకున్నంత అనే సామెత వర్తిస్తుంది.

## నాలాలలో పారిశ్రామిక వ్యర్థాలు

కుత్బుల్లాపూర్...

జీడిమెట్ల ఇండస్ట్రీయల్ లో పిసిబి అధికారుల పర్యవేక్షణ లోపం స్థానిక జనవాసాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది..చిన్న వర్షం పడితే చాలు నాలలో కెమికల్ వ్యర్థ రసాయనాలను వదిలి చేతులు దులుపుకుంటున్నారు ఇక్కడి కెమికల్ మాఫియా. ఇండస్ట్రీలో ప్రోడక్ట్ తయారీ అనంతరం మిగిలే వ్యర్థాలను జేఈటియల్,రాంకీ వేస్ట్ మేనేజ్ మెంట్ కి పంపితే లక్షల్లో ఖర్చు అవుతుందని నాలల్లో గుట్టుచప్పుడు కాకుండా కెమికల్ మాఫియా తో డంప్ చేయించి చేతులు దులుపుకుంటున్నారు ఇక్కడి కెమికల్,ఫార్మా కంపెనీల యాజమాన్యాలు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ లో ఎప్పటికప్పుడు నిఘా పెట్టి,కంపెనీల్లో తనీఖీలు చేపట్టాల్సిన పిసిబి అధికారులు కెమికల్ కంపెనీ యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రతినెల జేఈటియల్ కు పంపాల్సిన వ్యర్థరసాయనాల ట్యాంకర్ లీస్ట్ లను తప్పుదారి పట్టిస్తూన్నారని స్థానికుల ఆరోపణ

రాత్రి వేళల్లో కెమికల్ నాలల వద్ద పిసిబి సిబ్బంది నిఘా కొరవడటంతోనే ఈ ఘటనలు తీవ్రంగా జరుగుతున్నాయని ఇప్పటికైనా గస్తీ పెంచి ప్రజల ప్రాణాలకు అధికారులే భరోసా కల్పించాలని నిరసన వ్యక్తం అవుతోంది ..

## ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో ఐదుగురి ప్రాణాలు కాపాడిన అధికారులు

ఖమ్మం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో అధికారులు ఐదుగురి ప్రాణాలు కాపాడారు. చింతకాని మండలం చిన్న మండవ మున్నేరు వరద లో ఐదుగురు చిక్కుకున్నారు. కుల గణన సర్వే ప్రెజేంటేషన్ పని పై ఢిల్లీలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో ఖమ్మం జిల్లా ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో వెంటనే స్పందించిన రెవిన్యూ, పోలీస్ అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించారు. గేదెలు మేపుకునేదుకు వెళ్లి అకస్మాత్తుగా పెరిగిన వరదలో చిక్కున్న వారిని ఎన్డీఆర్ఎఫ్ సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది.

ఐదుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేసారు.

## పీఎం జన్‌మన్ పనులు వేగవంతం చేయాలి.

-కేంద్ర గిరిజన వ్యవహారాల కార్యదర్శి విభూ నాయర్.



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, జూలై 25: నిర్మల్ జిల్లా కలెక్టరేట్ లో ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆధార్ నమోదు, జన్‌ధన్ ఖాతాలు, పక్కా ఇళ్లు, పీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి పథకాలను విజయవంతంగా అమలు చేయాలని, కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఆది కర్మయోగి కార్యక్రమాన్ని క్రమబద్ధంగా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యదర్శి జిల్లాల్లో చేపడుతున్న మౌలిక వసతుల నిర్మాణం, స్థల సేకరణపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, పీఎం జన్‌మన్ కింద చేపట్టాల్సిన అన్ని పనులు గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనుమతి లభించిన గ్రామాల్లో అర్హుల గుర్తింపు కోసం పంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహించాలని, సేకరించిన సమాచారం యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని 24 హాబిటేషన్లలో 771 పక్కా గృహాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు, వసతి గృహాలు, ప్రైమరీ పాఠశాలలు, రోడ్డు కనెక్టివిటీ, మల్టీపర్పస్ సెంటర్లు నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, డిపిఒ శ్రీనివాస్, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఎల్డీఎం రామ్‌గోపాల్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టుల్లో సిబ్బంది కొరతను తీరుస్తా

### సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై25:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ న్యాయస్థానాలలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నట్లుగా గుర్తించానని నూతన సిబ్బందిని కేటాయించి ఆ సమస్యను త్వరలోనే తీరుస్తానని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఆమె హుజూర్ నగర్ కు వచ్చిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘన స్వాగతం పలికి తదుపరి నిర్వహించిన పరిచయ కార్యక్రమ సభ లో ఆమె మాట్లాడుతూ న్యాయస్థానాలలో మౌలిక వసతుల కల్పన కు కృషి చేస్తానని ఆమె తెలిపారు. సింగిల్ కోర్టుగా ఉన్నహుజూర్ నగర్ ను 6 కోర్టుల హుజూర్ నగర్ గా మార్చిన ఘనత బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాంరెడ్డి కే దక్కిందన్నారు. న్యాయమూర్తులు,న్యాయవాదులు తమ తమ వృత్తులలో పనిచేసి మానసికంగా అలసిపోతుంటారని అలాగే మానసిక ఒత్తిడికి గురువుతారని అందువల్ల మానసిక శారీరక ఉల్లాసానికి న్యాయ స్థానాల ప్రాంగణంలో ఇండోర్ ఆటలు ఆడటానికి క్రీడా స్థలి ని ఏర్పాటు చేసుకోవాలని ఆమె న్యాయవాదులకు సూచించారు. న్యాయమూర్తిగా తను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో పనిచేశానని తనకు తన వృత్తి తృప్తిని కలిగించిందన్నారు. అంతకు ముందు ఆమెను న్యాయవాదులు గజమాల,శాలువా బొకే లతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె కోర్టును కూలంకుశంగా పరిశీలించారు రామస్వామి గుట్ట వద్ద న్యాయస్థానాలకు నూతనంగా కేటాయించిన స్థలాన్ని ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీనా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, చనగాని యాదగిరి, జక్కుల నాగేశ్వరరావు, నారపురాజు శ్రీనివాసరావు, నట్టే సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్ రెడ్డి, కుక్కడపు బాలకృష్ణ, రవికుమార్, అడిషనల్ పి పి బొబ్బకోటిరెడ్డి, ఏజీపీలు రేణుకాదేవి, సురేష్ కుమార్, పోలీస్, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మనిర్భర భారత్ విజయాలకు నాంది 'ఆపరేషన్ విజయ్'

### బిజూలై 26 కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా..






"1999 లో మన కార్గిల్ కొండలపై పాక్ సేనలు చాప క్రింద నీరులా ప్రవేశించి ఒక్కసారిగా దాడిని ప్రారంభించారు. కార్గిల్ కొండలు పాక వైపు ఏటవాలుగాను (ఎక్కడానికి వీలుగా) మన వైపు 90 డిగ్రీ కోణంలో ఎత్తుగా (ఎక్కడానికి వీలు లేకుండా) ఉంటాయి. దానితో పాక్ సైనికులు కార్గిల్ కొండలను సులభంగా ఆక్రమించి, బంకర్లు ఏర్పాటు చేసుకొని, బాగా పాతుకుపోయారు. పాక్ సైనికులకు ఇటు వైపు ఉన్న మన సైనికులు సులభంగా కనబడుతారు. దానితో మన సైనికులకు యుద్ధం చేయడం ఎంతో కష్టతరమైన పరిస్థితి. దీని ఉద్దేశ్యం ఏమిటంటే భారత్ కు ఎదురుపడి యుద్ధం చేసే అవకాశం లేదు. కాబట్టి యుద్ధ రంగాన్ని భారత్ బటాలిక్ సెక్టార్ కు విస్తరించాల్సి వచ్చింది. అప్పుడు యుద్ధరంగం విస్తరించి, భారత్ సైన్యం పలుచబడి యుద్ధం పాకిస్తాన్ కు అనుకూలంగా మారుతుందని పాక్ కుటిల ఆలోచన. కానీ నాటి ప్రధాని శ్రీ అటల్ బిహారి వాజ్ పేయి గారి సారధ్యంలో మన వ్యూహ బృందం చర్చించి యుద్ధం కార్గిల్ వరకే పరిమితం చేయాలని ఎదురుగా వెళ్లి తలపడాలని నిశ్చయించారు. దాని ఫలితంగా 1999 జూలై 26న (ఈరోజున) చివరి పోస్టును మన సైనికులు చెజిక్కించుకొని భారత విజయ పతాకాన్ని ఎగరేశారు. 'ఆపరేషన్ విజయ్' పేరు సార్ధకమయింది. ఆత్మ నిర్భర భారత్ విజయాలకు నాంది పలికింది."


నేటికీ కార్గిల్ యుద్ధం జరిగి సరిగ్గా 26 ఏళ్లు గడిచాయి. భారత దేశంలో జరిగిన సంఘటనలలో భరత జాతి ఐక్యతను, ఘనతను, దౌత్య నీతిని చాటిన సంఘటనలలో కార్గిల్ యుద్ధం ఒకటి అని చెప్పవచ్చు. భారత్ కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విదేశాలతో జరిగిన యుద్ధాలలో ఇది ఐదవది. అంతకు ముందు జరిగిన యుద్ధాలన్నింటిలోనూ భారత్ విజయాన్నే సాధించింది. కానీ ప్రతీసారీ దౌత్యంలో ఓడిపోతూ, రణరంగంలో మన వీర సైనికులు సాధించిన విజయాలకు ఏమాత్రం విలువ లేకుండా చేసేవారు నాటి మన నాయకులు. కార్గిల్ యుద్ధంలో మాత్రం రణ రంగంలో విజయంతో పాటు దౌత్య రంగంలో కూడా విజయాన్ని సాధించడం మొదటిసారి అని చెప్పక తప్పదు. ఇది మన ఆధునిక భారత విజయాలకు నాంది పలికిందని చెప్పవచ్చు. ఈ విషయం మనకు స్పష్టంగా అర్థం అవ్వాలంటే ఒక్కసారి చరిత్రలోకి వెళ్లక తప్పదు. ఆ విషయాలేమిటో తెలుసుకుందాం.

:: నాటి ప్రధాని నెహ్రూ తప్పిదం కారణంగా ::

1947 ఆగస్టు 15 న స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ఆ సంతోషాన్ని భారతీయులు పూర్తిగా అనుభవించక ముందే కొత్తగా ఏర్పడిన పాకిస్తాన్ 1948 లో మనపై దండెత్తి కాశ్మీర్ లోని కొంత భూభాగాన్ని ఆక్రమించింది. స్వాతంత్ర్యం లభించిన కొత్త ఉత్సాహంతో ఉన్న మన సైన్యం దూకుడు ప్రదర్శించి పాకిస్తాన్ దాడిని త్రిప్పికొడుతున్న సమయంలో నాటి ప్రధాని నెహ్రూ యుద్ధ విరమణ ప్రకటించడమే కాకుండా ఈ గొడవను ఐక్యరాజ్యసమితి లో పెట్టాడు. భారత సార్వభౌమాధికారంలోకి దూరటానికి ఐక్యరాజ్యసమితి అనే మూడవ వ్యక్తికి అవకాశం కల్పించారు. దానితో నాడు ఆక్రమణకు గురైన కాశ్మీర్ భూభాగం నేటికీ పాక్ ఆధీనంలోనే ఉండిపోయింది. 1962 లో చైనా అరుణాచల్ ప్రదేశ్ భూభాగాలపై దండెత్తి రాగా ఎదుర్కొనటానికి కాళ్లకు బూట్లు కూడా లేని పరిస్థితి మన సైన్యానిది. కానీ వీరోచితంగా పోరాడింది మన సైన్యం. చైనాను తరిమి కొట్టింది. కానీ మన నాయకత్వం వెతక వైఖరి వలన అప్పటినుండి ఇప్పటివరకు ఆ భూభాగంలో భారత్ చైనా సరిహద్దు గొడవ సద్దుమణగ లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఆ భూభాగంలో చైనాకు మనకు ఘర్షణలు తలెత్తుతూనే ఉన్నాయి.

:: శ్రీమతి ఇందిరాగాంధీ మెతక వైఖరి కారణంగా ::

1965 లో పాక్ మరల మనపై కాలు దువ్వింది. ఆ సమయంలో మన ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి "జై కిసాన్! జై జవాన్!" నినాదంతో పట్టుదలగా వ్యవహరించి పాకిస్తాన్ ను తిప్పి కొట్టారు శాస్త్రీజీ రణ రంగంలో విజయం సాధించినా, దౌత్య రంగంలో విజయం సాధించలేకపోయింది నాటి మన ప్రభుత్వం. చివరకు చర్చలకు రష్యా వెళ్లి దేశంగాని దేశం (తాష్కంట్) లో మన ప్రధాని శాస్త్రీజీ ప్రాణాలను సైతం కోల్పోవలసి వచ్చింది. 1971లో ముష్కర పాక్ మనపై మూడవసారి చేసిన దాడిని నాటి ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ వ్యూహాత్మకంగా తిప్పి కొట్టడమే కాక పాకిస్తాన్ దేశాన్ని చీల్చి రెండు ముక్కలుగా చేసింది. బంగ్లాదేశ్ అనే కొత్త దేశానికి ఊపిరి పోసింది. 93వేల మంది పాక్ సైనికులు మనకు పట్టుబడ్డారు. వీరిని అడ్డం పెట్టుకొని మనం గొంతెమ్మ కోర్కెలు కోరి అనేక ప్రయోజనాలను పొంది ఉండవచ్చు. కానీ దౌత్య రంగంలో అప్రతిష్ట పాలయ్యే స్థితి భారత్ కు పునరావృత మయ్యింది. ఇందిరా గాంధీ దౌత్య చర్చలలో మెతక వైఖరితో వెనుకడుగు వేయవలసి వచ్చింది. దాని ఫలితంగా 93 వేల మంది సైనికులను బేషరతుగా విడిచి పెట్టవలసి వచ్చింది. 1987లో భారత్ చైనా మధ్య అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర భూభాగం




విషయంలో యుద్ధం లాంటి వాతావరణం ఏర్పడింది. ఈ ప్రతిష్టంభనను అధిగమించడానికి మన విదేశాంగ మంత్రి, ప్రధాన మంత్రి (రాజీవ్ గాంధీ) బీజింగ్ సందర్శించాల్సి వచ్చింది.

:: అటల్ జి అద్భుత దౌత్య నీతి ఫలితంగా ::


1999 లో మన కార్గిల్ కొండలపై పాక్ సేనలు చాప క్రింద నీరులా ప్రవేశించి ఒక్కసారిగా దాడిని ప్రారంభించారు. కార్గిల్ కొండలు పాక్ వైపు ఏటవాలుగా (ఎక్కడానికి వీలుగా) మన వైపు 90 డిగ్రీ కోణంలో (ఎక్కడానికి వీలు లేకుండా) ఎత్తుగా ఉంటాయి. దానితో పాక్ సైనికులు కార్గిల్ కొండలను సులభంగా ఆక్రమించి బంకర్లు ఏర్పాటు చేసుకొని సుఖంగా పాతుకు పోయారు. పాక్ సైనికులకు ఇటువైపు ఉన్న మన సైనికులు సులభంగా కనబడతారు. దానితో మన సైనికులకు యుద్ధం చేయడం కష్టతరమైన పరిస్థితి. దీని ఉద్దేశం ఏమిటంటే భారత్ కు ఎదురుగా వచ్చి యుద్ధం చేసే స్థితి లేదు. కాబట్టి యుద్ధరంగాన్ని భారత్ బటాలిక్ సెక్టార్కు విస్తరించాల్సివచ్చింది. అప్పుడు యుద్ధరంగం విస్తరించి భారత సైన్యం పలుచబడి యుద్ధం పాకిస్తాన్ కు అనుకూలంగా మారుతుందనేది పాక్ కుటిల ఆలోచన. కానీ ఆనాటి ప్రధాని అటల్ బీహారి వాజ్ పేయి సారధ్యంలో మన వ్యూహ బృందం చర్చించి యుద్ధం కార్గిల్ వరకే పరిమితం చేయాలని ఎదురుగా వెళ్లి మాత్రమే తలపడాలని నిశ్చయించారు. దీనికోసం పదాతి దళాన్ని వినియోగించారు. ఈ యుద్ధంలో బోఫోర్స్ ఫిరంగులు మనకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ స్థిరమైన వ్యూహంలో మనం ముందుకు వెళ్లి ఒక్కొక్కటిగా విజయం సాధిస్తుంటే పాక్ నివ్వెర పోయింది.

ఇలా మన సైనికులు రణ రంగంలో విజయం సాధిస్తుంటే, మరొకవైపు మన ప్రభుత్వం అమెరికా, చైనా మొదలైన అగ్ర రాజ్యాలకు మన దౌత్యవేత్తలను పంపించి, పాకిస్తాన్ కు ఎటువంటి మద్దతు లేకుండా ఏకాకిని చేయగలిగింది.

దానితో పాక్ బిత్తరపోయి తన వ్యూహాన్ని తానే అసహ్యించుకొని వెనక్కు తగ్గింది. కార్గిల్ కొండలపై ఉన్న పాక్ సైనికులు ఎదురుగా వస్తున్న భారత సైనికుల ధాటికి తట్టుకోలేక పాక్ నుండి మద్దతు లభించక ఊపిరాడక నిర్జీవులైపోయారు. చివరికి 1999 జులై 26న (ఈ రోజున) చివరి పోస్టును మన సైనికులు చేజిక్కించుకొని భారత విజయ పతాకాన్ని ఎగురవేశారు. 'ఆపరేషన్ విజయ్' పేరు సార్థకమైంది. ఆత్మనిర్భర భారత్ కు ఈ విజయం నాంది పలికింది. భారతమాతకు జయమగు గాక!

"సాహిత్య కళా విభూషణ"
స్వర్ణ నంది పురస్కార గ్రహీత
చౌదూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
9705100788

## ఆగస్టు 4 నుండి 5వ తేదీ వరకు మొబైల్ ఫోన్లు ఈ%-%వేలం



తిరుపతి జిల్లా ప్రతినిధి, జూలై 25(భారత శక్తి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన మొబైల్ ఫోన్లను ఆగస్టు 4 నుండి 5వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు. ఇందులో ఐ ఫోన్లు, వివో, నోకియా, ఎల్‌వైఎఫ్, ఫిలిప్స్, సెల్కన్, మైక్రోమ్యాక్స్, రియల్ మీ, హువాయ్, టెక్నో, మోటోరోలా, కార్బన్, శామ్సంగ్, మోటోరోలా, ఒప్పో కంపెనీల మొబైల్ ఫోన్లు వున్నాయి. కొత్తవి/ఉపయోగించిన/పాక్షికంగా దెబ్బతిన్న మొబైల్ ఫోన్లు 73 లాట్లు ఈ-వేలంలో ఉంచారు.

ఇతర వివరాలకు తిరుపతి లోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, టీటీడీ వెబ్‌సైట్ %www.tirumala.org% లేదా రాష్ట్ర ప్రభుత్వ పోర్టల్ %www.konugolu.ap.gov.in% ను సంప్రదించగలరు.

## డిసిసిబి మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న టీజీ క్యాబ్ చైర్మన్ మార్నెనీ రవీందర్ రావు.



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై25:వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నెనీ రవీందర్ రావు. ఈ సందర్భంగా వారు ఆర్థిక లావాదేవీలపై,టర్నోవర్స్, జిల్లాలోని డిసిసిబి బ్యాంకుల పని తీరు, పురోగతి పై,గత పాలకవర్గ సమావేశపు తేదీ నుండి జరిగిన ఆర్థిక లావాదేవీలను,రుణాల మంజూరు అనుసరిస్తూ, 2024 - 25 ఆర్థిక సంవత్సరం సంబంధించిన ఆడిట్ పురోగతినీ పరిశిలించి తగు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర రెడ్డి,డైరెక్టర్లు హరిప్రసాద్, జగన్ మోహన్ రావు,రాజేశ్వర్ రెడ్డి,ఉపేందర్ రెడ్డి,మాడుగుల రమేష్,దొంగల రమేష్, నాయిని రంజిత్, ఉపేందర్ రెడ్డి,గోపాల్ రావు,యాదగిరి రెడ్డి, నర్సింగ రావు,శ్రీనివాస్,రవిరాజు,మురళి,ప్రొఫెషనల్స్ డైరెక్టర్ నరేందర్,ప్రదీప్ చందర్,,నాబార్డ్ డీడీఎం చంద్ర శేఖర్,సీఈఓ వజీర్ సుల్తాన్,జిఎం,ఉషా పద్మావతి, టీజీ క్యాబ్ జిఎం లత,డిజిఎం అశోక్, ఎజీఏం మధు,గొట్టం స్రవంతి, రాజు,గంప స్రవంతి, కృష్ణమోహన్,బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## రామారెడ్డి గంగమ్మ వాగుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్








కామారెడ్డి(భారత శక్తి ప్రతినిధి) 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలో, రామారెడ్డి గంగమ్మ వాగుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రామారెడ్డి గ్రామం సమీపంలోని ఈ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ట్రాఫిక్‌కు బ్రిడ్జ్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ రెడ్డి, ఈఈ మోహన్, డీఈఈ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

భారత శక్తి
శనివారం, 26 జూలై 2025

## రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్






(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 25: శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్ రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్నటువంటి సేవల గురించి ఆరా తీశారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి రామారెడ్డి ఆసుపత్రిలో ఉన్నటువంటి సేవల గురించి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలలో అందుచున్నటువంటి సేవల గురించి తెలుసుకుని సంతృప్తి చెందడం జరిగింది. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలలో బాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభు కిరణ్ జిల్లా కలెక్టర్ తో పాల్గొన్నారు.

రెండు రోజుల క్రితం దేమె కలాన్ లో ప్రబలిన అతిసార వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రామస్థాయిలో వైద్యులు వైద్య సిబ్బంది ముందుగా తగిన చర్యలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విధుల పట్ల అలసత్వం గానీ అశ్రద్ధ వహించినటువంటి సిబ్బంది పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారిని ఆదేశించారు. రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సురేష్ సరిగ్గా అందుబాటులో ఉండడం లేదని కొందరు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన నందున షోకాజ్ నోటీస్ జారీ చేయమని కలెక్టర్ ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఇతర రెవెన్యూ శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పీర్ల చెరువు తనిఖీ చేసిన ఎస్ఐ హనుమంతు



సంగారెడ్డి (జిన్నారం) భారత శక్తి ప్రతినిధి, జూలై 25:మండల వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిన్నారం నూతన ఎస్సై హనుమంతు అన్నారు. మండలంలోని వావిలాల గ్రామ సమీపంలోని పీర్ల చెరువును శుక్రవారం ఎస్సై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం చెరువులు, వాగులు, చెక్ డ్యాలు మత్తడి దూకుతున్నాయని, వరద ప్రవాహంలో రోడ్డు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. వృద్ధులు చిన్నపిల్లలను కనిపెట్టుకొని ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ గా పదోన్నతి పొందిన డాక్టర్ దరహాస ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ శోభ సత్యనారాయణ ఘన సన్మాన%శీ



%భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో జూలై 25:నిర్మల్ జిల్లా శుక్రవారం నిర్మల్ లోనీ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ గా పదోన్నతి పొందిన డాక్టర్ దరహాస ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ శోభ సత్యనారాయణ శుక్రవారం పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ప్రేమ రాజు. ధర్మాజీ శ్రీను. గురు ప్రసాద్. తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు కష్టపడి పండించిన పంటకు ప్రతిఫలం అందాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

### -ఈనెల లోనే ఈ- నామ్ వ్యవస్థ ను ఈ మార్కెట్ యార్డ్ నందు తీసుకువస్తాం.

### -100శాతం గ్రేడింగ్ జరగాలి.

### -పారదర్శకత తో వ్యాపారం జరగాలి.

### -రైతులను సంఘటితం చేసి... సంఘాలు చేయండి.




పులివెందుల, జూలై 25(భారత శక్తి):రైతులు తాము పండించిన ఉత్పత్తులను మరింత మెరుగైన ధరలకు విక్రయించేందుకు ఈ - నామ్ (జాతీయ వ్యవసాయ మార్కెట్) వ్యవస్థలో అవకాశం ఉంటుందని ఈ దిశగా పులి వెందుల మార్కెట్ యార్డ్ లో ఈ నెలలోనే ఈ-నామ్ వ్యవస్థను తీసుకువస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు..శుక్రవారం జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా పులివెందుల మార్కెట్ యార్డ్ ను ఆకస్మిక తనిఖీ చేసి చీనీ రైతులతో ఈ పంటకు అందుతున్న ధరలు, మార్కెట్ లో ఎదుర్కొంటున్న సమస్యలు, సంబంధిత అంశాలపై రైతులతో చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించే చీని పంట సంవత్సరంలో రెండు దపాలు మాత్రమే చేతికి అందుతుందని అలాంటి పంటకు సరైన ధర అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు..రైతులు పండించే పంటకు గ్రేడింగ్ చేసేందుకు రైతులతో సమావేశాలు నిర్వహించి వారిని సంఘటితం చేసి ఎఫ్ఈఓ లను ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు..పులివెందుల మార్కెట్ యార్డ్ నందు ఇప్పటివరకు గ్రేడింగ్ చేయకపోవడం... ఇతర జిల్లాలలో మరియు ఇతర రాష్ట్రాలలో చీని పంట ధరలను ప్రదర్శించక పోవడం, కంప్యూటరైజ్ చేయక పోవడం, సంబంధిత అంశాలకు సంబంధించి మార్కెట్ అధికారులపై జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.హమాలీలకు ఎంత ఖర్చవుతుంది? రైతులకు నగదు ను ఆన్లైన్ ద్వారా, క్యాష్ రూపంలో అందిస్తున్నారా? పారదర్శకత రాకపోతే బయట నుండి ట్రేడర్లు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కమిషన్ ఏజెంట్లు నియమ నిబంధనలకు లోబడి పని చేయాలే కానీ సొంత వ్యాపారం అనుకొని చేస్తే సహించేది లేదు. మార్కెటింగ్ శాఖకు సంబంధించి సెక్రటరీ ఏం పని చేస్తున్నాడు? పనిచేయకపోతే జీతం కట్ చేస్తాం. ఎవరి పని వారు బాధ్యతగా నిర్వర్తించాలి అంటూ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మార్కెటింగ్ అధికారులతో మాట్లాడుతూ ఘాటుగా స్పందించారు.పులివెందుల మార్కెట్ యార్డ్ అతి పెద్ద మార్కెట్ యార్డ్ అని ఈ నెల నుండి ఈ మార్కెట్ నందు ఈ - నామ్ వ్యవస్థను తీసుకొని వచ్చి ఆన్లైన్ ద్వారా వ్యాపారం జరిగేలా మరియు ఇతర జిల్లాలు ఇతర రాష్ట్రాలలో చీనీ పంట ధరలను డిజిటల్ సైన్ బోర్డుల ద్వారా ప్రదర్శించేలా వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వంద శాతం గ్రేడింగ్ చేయడం ద్వారా నాణ్యమైన పంటకు మెరుగైన ధర అందేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయనన్నారు .పారదర్శకతతో వ్యాపారం చేయడం ద్వారా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి ట్రేడర్లు వచ్చి కొనుగోలు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతారన్నారు. ఈ దిశగా మార్కెటింగ్ శాఖ పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా రైతులను సంఘటితం చేసేందుకు వ్యవసాయ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, మార్కెటింగ్ శాఖ డిడి లావణ్య,ఏడి ఆజాద్ సంబంధితశాఖలఅధికారులు, రైతులు,కమిషన్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను పక్కా ఏర్పాట్లు చేయండి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




జమ్మలమడుగు, జూలై 25(భారత శక్తి) : ఆగస్టు 1న జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.శుక్రవారం మధ్యాహ్నం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఇంచార్జి భూపేష్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పేదలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 1వ తేదీన జమ్మలమడుగు నియోజకవర్గ కేంద్రానికి రానున్నారన్నారు. అందులో భాగంగా పెన్షన్ లబ్ధిదారుల కుటుంబాల ఇళ్ళవద్దకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తారన్నారు. పెన్షన్ దారుల కుటుంబ ఆర్థిక స్థితిగతులపై ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. కాగా ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని కార్యక్రమాలకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పాటించేలా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్దంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా విధులు కేటాయించిన అధికారులందరూ ప్రోటోకాల్ నిబంధనలను తూచా తప్పక పాటించాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భద్రతా, పార్కింగ్ అంశాలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధానంగా విద్యుత్, రహదారులు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, ఏర్పాట్లతో పాటు పోలీసు, ఫైర్, ఏమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ను కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు.ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్, గ్రీవిన్స్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు.

ఈ మేరకు విధులు కేటాయించిన అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కడప నగర కమీషనర్ మనోజ్ రెడ్డి, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, జిల్లాన్ఫిరే అధికారి ధర్మా రావు, మెప్మా, డీఆర్డీఏ, డ్వామా పీడీలు కిరణ్ కుమార్, రాజ్యలక్ష్మి, అదిశేషారెడ్డి, డిఎంహెచ్ఓ డా.నాగరాజు, పోలీసు, ఫైర్ ఆఫీసర్ ధర్మా రావ్, విద్యుత్, ఆర్ అండ్ బి, పీఆర్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్




కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) జులై 25: రామారెడ్డి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు తుప్పాటి లావణ్య ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిల్లర్స్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయినందున మిగతా నిర్మాణం కూడా వేగవంతం చేయాలని లబ్ధిదారుకు సూచించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి ఎక్కడ కూడా ఇసుక, మొరం సమస్య లేకుండా ప్రభుత్వం సూచించిన విధంగా నాణ్యతగా ఇండ్లను నిర్మించుకొని త్వరగా గృహప్రవేశాలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించడానికి డబ్బులు ఇబ్బందిగా ఉన్న నిరుపేద లబ్ధిదారులకు ఐకెపి ద్వారా ముందస్తు రుణం అందించాలని లబ్ధిదారులు ఐకెపి గ్రూపులో లేకపోతే గ్రూపులో చేర్చి మరీ రుణాలను అందించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా జరిగేలా ఎంపీడీవోను పంచాయతీ సెక్రెటరీ నీ ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీరితోపాటు హౌసింగ్ పీడీ విజయపాల్ రెడ్డి ,డి ఇఇ సుభాష్, ఏఈ సుచిత్ర లను ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించి తొందరగా పూర్తి చేయగలరని కలెక్టర్ ఆదేశించారు.

## వినియోగదారులకు వ్యాపారులు నాణ్యమైన వస్తువులు విక్రయించాలి




సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 25:హుజూర్ నగర్ డివిజన్ పరిధిలోని వ్యాపారులు వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు విక్రయించాలని హుజూర్ నగర్ డివిజన్ వినియోగదారుల సంఘం కార్యదర్శి పందిరి యల్లారెడ్డి వ్యాపారులకు సూచించారు.శుక్రవారం హుజూర్ నగర్ టీజేఏ ప్రెస్ క్లబ్ నందు ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వ్యాపార సంస్థల వారు అన్ని అనుమతులతో లైసెన్సులు తీసుకోవాలని కోరారు.ప్రతి షాపు యజమాని జీఎస్టీ లైసెన్స్ పొంది ఉండాలన్నారు.ప్రతి వినియోగదారునికి జీఎస్టీ బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.కల్తీ లేని వస్తువులను, ఆహార పదార్థాలను,నాణ్యమైన వస్తువులను మాత్రమే వినియోగదారులకు విక్రయించాలని యల్లారెడ్డి కోరారు.అధిక లాభాల కోసం ఆశపడి నకిలీ వస్తువులను విక్రయించినా నిల్వచేసిన వారిపై సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసి చట్టప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేయించి సీజ్ చేయిస్తామని యల్లారెడ్డి హెచ్చరించారు. అంతే కాకుండా జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ నందు కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు.

## నిమ్జ్ భూసేకరణ వేగవంతం చేయాలి

### నిమ్జ్ ను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య

### నిమ్జ్ లో మౌలిక వసతుల పరిశీలన





సంగారెడ్డి (భారత శక్తి ప్రతినిధి)జూలై 25:జహీరాబాద్‌లో ఏర్పాటవుతున్న నిమ్జ్ కి సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఝరాసంగం మండలం చిలపల్లి తండాలోని నిమ్జ్ భూములను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ మాధురి,నిమ్జ్ అధికారులతో కలిసి పరిశీలించారు.నిమ్జ్ భూముల మ్యాప్ను పరిశీలిస్తు ఇప్పటివరకు సేకరించిన భూముల వివరాలను పరిశీలిస్తూ ఇంకా సేకరించవలసిన భూములను వేగవంతంగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నిమ్జ్ లో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నిమ్జ్ ప్రత్యేక అధికారి, ఆర్డీవో రామిరెడ్డి, రేవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు .ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ... నిమ్జ్ ప్రాజెక్టు అవసరమైన భూమి సేకరించాల్సి ఉందని దాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఫేస్ వన్ లో మొత్తం 3,240 ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటివరకు 2,888 ఎకరాల భూమి మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన భూసేకరణ ఇంకా పూర్తికాలేదని, సంబంధిత గ్రామాల రైతులు, భూమి యజమానులతో చర్చించి వీలైనంత త్వరగా భూ సేకరణ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు భూముల కోల్పోతున్న రైతుల సమస్యలను పరిష్కరించి భూసేకరణను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.నిమ్జ్ ద్వారా పరిశ్రమలు, ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు . భూముల సేకరణ విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిమ్జ్ ఏర్పాటు అయ్యే ప్రాంతాన్ని కలియ తిరుగుతూ అధికారులకు పలు సూచనలు చేశారు.నిమ్జ్ లో మౌలిక వసతుల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఏ ప్రాంతాల్లో ఇంకా భూసేకరణ జరపాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని సూచించారు.నిమ్జ్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతానికి కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అనంతరం భూసేకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ నియమిత ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటి మెంబెర్ స్వదేశ్ పరికిప%శీ%డ్ల మృతుని కుటుంబన్నీ కుటుంబ సభ్యులకు మనో ధైర్యం .



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరోజూలై 25:నిర్మల్ జిల్లా ఉపాధికి వెళ్ళిన చోటే ఆగిన గుండె దస్తూరాబాద్ మండలంలోని మున్యాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపెదూర్ గ్రామానికి చెందిన సంఘ సురేష్ (35) కుటుంబ పోషణ,ఉపాధి నిమిత్తం ఉజ్బెకిస్థాన్ దేశం వెళ్లి అక్కడ ఒక టూరిస్ట్ హాస్టల్ వద్ద పని చేస్తున్న సమయంలో ఈ నెల 21 నసోమవారం అకస్మాత్తుగా వచ్చిన గుండె పోటు వల్ల ఆసుపత్రి తరలిస్తున్న సమయంలో మృతి చెందిన ఘటన తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ నియమిత ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటి మెంబెర్ స్వదేశ్ పరికిప%శీ%డ్ల నేడు మృతుని కుటుంబన్నీ కలిసి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం చెప్పి కుటుంబానికి ప్రభుత్వం తరపున భరోసా కల్పించారు.పడాల నరేశ్, రాకేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం దిశగా ఓపెన్ జిమ్ ప్రారంభం..

### పార్క్ అభివృద్ధి పనుల పర్యవేక్షణ

### జి హెచ్ ఎం సి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి..





జి హెచ్ఎం సి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ లోని శ్రీ రామా హిల్స్ కాలనీలో 10.00 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను స్థానిక కాలనీ వాసులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించినారు.అనంతరం త్వరలో 8.00 లక్షల రూపాయలతో చేపట్టబోయే మరొక్క పార్క్ అభివృద్ధి పనుల్లో భాగంగా పవర్ బోర్ ను %డ% అట్టి ప్రాంతాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ:

ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యమని కాలనీల అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కాలనీ వాసులు, యువతతో పాటు వృద్ధులు కూడా దీనిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు.త్వరలో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించి పార్కులో పవర్ బోర్, పచ్చదనం, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటదారులు వంటి అంశాల్లో నాణ్యతపై ప్రత్యేక దృష్టితో స్థానికులకు విశ్రాంతి కేంద్రంగా మార్చేలా పార్కును అభివృద్ధి చేస్తానని తెలిపారు.ఈ యొక్క శ్రీరామ హిల్స్ కాలనీకి మంజూరైన 4.00 లక్షల రూపాయలతో మిగిలిపోయి ఉన్న సి. సి రోడ్డు అభివృద్ధి పనులను త్వరలోనే మొదలయ్యేట్టుగా చర్యలు తీసుకుంటానని, భూగర్భ జలాలు పెరగడానికి డివిజన్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకు పెద్దపీట వేస్తామని అన్నారు.ఇలాంటి అభివృద్ధి పనుల చర్యల వల్ల సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవితశైలి ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, స్వామి గౌడ్, రాజశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అనవేమారెడ్డి, భూపాల్ రెడ్డి రాజయ్య, శివలింగం, పాండు మరియు బిజెపి నాయకులు మునగాల హరీష్ రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, దామోదర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, వెంకటరమణ గౌడ్, రంగారెడ్డి, చంద్రశేఖర్, విష్ణు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యం తయారీ 3 కేసు లలో 16 మంది పై కేసు నమోదు, 11 మందిని అరెస్ట్ చేసి జైల్ రిమాండ్ కి తరలింపు.

### 870 లీటర్ల స్పిరిట్,100 కాటన్ల ఎంసీ విస్కీ పేరున నకిలీ మద్యం,హీల్స్, లేబుల్స్ క్యాప్స్,ట్రాక్టర్,ట్రాలీ వెర్నాకార్,స్కూటీ స్వాధీనం

### మేళ్లచెరువు శివ పార్వతి వైన్స్ 2సీజ్






సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై25:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం నందు ఎస్ హెచ్ ఓ నాగార్జున రెడ్డి శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేళ్లచెర్వు మండలం రామ పురం గ్రామానికి చెందిన నకిలీ మద్యం కేసు లో విచారణ లో భాగంగా రామాపురం లో పలు ప్రదేశాల లో దాడులు నిర్వహించడం జరిగిందని ఇందులో రామాపురం,దొండపాడు కు చెందిన పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా రంగిశెట్టి సైదేశ్వర్ రావు అను వ్యక్తి ఇంటి నుండి 6 కాటన్ల నకిలీ మద్యం ను స్వాధీనం చేసుకోవడమైనదన్నారు.అతని స్నేహితుడైన ప్రవీణ్ మరియు నరేష్ ల వద్ద నుండి 30 లీటర్ల స్పిరిట్ ను స్వాధీనం చేసుకోవడమైనది అనంతరం వారిని విచారించి డీలర్ కొట్టే నరసింహారావు అను వ్యక్తి తన బంధువుల పొలంలో పాతి పెట్టారన్న సమాచారం మేరకు అక్కడ తవ్వి తీయుగా 50 కాటన్ల మద్యం ను స్వాధీనం చేసుకోవడమైనదన్నారు అతనికి సహకరించిన నాగ సైదేశ్వర్ రావు, వీరభద్రం,గురువయ్య లను అరెస్టు చేయడమైనదని ఈ కేసు లో 9 మంది పై కేసు నమోదు చేసి 7 గురి ని రిమాండ్ కు తరలించడమైనదని హుజూర్ నగర్ ఎస్ హెచ్ ఓ నాగార్జున రెడ్డి తెలిపారు ఇప్పటి వరకు ఈ నకిలీ మద్యం కేసు లో 3 కేసు లలో 16 మంది పై కేసు నమోదు చేయడం జరిగిందని వీరిలో 11 మంది ని అరెస్ట్ చేసి జైల్ రిమాండ్ కి తరలించమన్నారు. 3 కేసుల్లో కలిపి 870 లీటర్ల స్పిరిట్ ను,100 కాటన్ల ఎంసీ విస్కీ పేరున నకిలీ మద్యం ను,హీల్స్,లేబుల్స్,కాప్స్ తో పాటు ట్రాక్టర్ మరియు ట్రాలీవెర్నా కార,స్కూటీ ని స్వాధీనం స్వాధీనం చేసుకున్నామన్నారు.ప్రధాన నిందితుడు తోట శివ శంకర్ కోర్ట్ లో లొంగి పోవడం జరిగింది.

అతని ని రిమాండ్ కు తరలించడమైనది.ఇతను మెల్ల చెర్వు లోని శివ పార్వతి వైన్స్ 2 నందు నౌకర్ నామా గా పని చేస్తున్నందున అట్టి షాప్ ను కూడా సస్పెండ్ చేయడం తో పాటు మూసి వేసి సీల్ చేశామన్నారు.ఇట్టి దాడుల లోఎస్సైలుజగన్ మోహన్ రెడ్డి,వెన్నెల లతో పాటు డీటీఎఫ్ సీఐ స్టీవెన్సన్ రామకృష్ణ ఎస్సై మరియు సిబ్బంది రుక్మ రెడ్డి ధనుంజయ్,నరేష్,నాగరాజు,రవి,మధు,నాగయ్య,గోపి రెడ్డి,బాలు,ప్రవీణ్ పాల్గొన్నారు

## మధిరలో సిపిఐ 23వ ఖమ్మం జిల్లా మహాసభలు జయప్రదం కావడానికి , హార్దికంగా సహకరించిన ప్రతి ఒక్కరికి విప్లవ ధన్యవాదములు

ఖమ్మం (భారత శక్తి ప్రతినిధి), జూలై 25::మధిరలో ఈనెల 19,20 వ తారీకులలో జరిగిన సిపిఐ 23 వ ఖమ్మం జిల్లా మసభలలో జిల్లాలోని అన్ని మండలాలనుండి 621 మంది ప్రతినిధులు పాల్గొన్నారని అందులో మహిళలు 78 మంది, యువకులు 314 మంది పాల్గొనడం ద్వారా మహాసభలకు కొత్త



ఉత్సాహన్ని ఇచ్చిందని, ఈ మహాసభలలో కార్మికులు, రైతులు, వ్యసాయకార్మికులు, మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు,నిరుద్యోగులు, ఇళ్ళులేనివారు, రేషన్ కార్డులు రానివారు, పెన్షన్లు రానివారు,విద్యార్థుల సమస్యలపై 38 తీర్మానలను మహాసభ ఆమోదించిందని, రాబోయే రోజులలో ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున పోరాటాలకు మధిరలోజరిగిన సిపిఐ ఖమ్మం జిల్లామహాసభలు ఉపయోగపడతాయని బెజవాడ రవి అన్నారు. ఈ మహాసభలు జయప్రదం కావడానికి సహకరించిన పాత్రికేయ మిత్రులకు,మధిర పట్టణంలోని వ్యాపారవర్గాలకు , రెడ్డీ గార్డెన్ అధినేత శ్రీనివాసరెడ్డి కి, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యాలకు, వివిధ పాఠశాల, కళాశాలల యాజమాన్యాలకు, మాకు తొడ్పాటు అందించిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు,వేము అడగగానే, సిపిఐ నాయకులకు వసతి కల్పించిన గృహ యజమానులకు, వివిధ లాడ్జిల నిర్వాహకులకు, మధిర మున్సిపలిటీ, పోలీస్ అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి,. మధిర మండల, పట్టణ కార్యవర్గ సభ్యులకు, సిపిఐ 23వ ఖమ్మం జిల్లా మహాసభల ఆహ్వానసంఘం పక్షాన ధన్యవాదములు తెలియజేస్తూ, సిపిఐ ఖమ్మం జిల్లా మహాసభలు విజయవంతంగా ముగిసినందుకు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాను...


## గ్రామ పరిపాలన అధికారి,సర్వేయర్

### పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలి.




ములుగు జిల్లా (భారతశక్తి ప్రతినిధి) జులై 25 : ఈ నెల 27ననిర్వహించనున్న గ్రామ పరిపాలన అధికారి, లైసెన్సుడ్ పొందిన సర్వేయర్ స్క్రీనింగ్ రాత పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) సి హెచ్ మహేందర్ జి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఈ నెల 27వ తేదిన జరుగనున్న గ్రామ పరిపాలన అధికారి, లైసెన్సుడ్ పరీక్షలు నిర్వహణపై రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతి రాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మహేందర్ జి మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి పరీక్షను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని, 26 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాస్తున్నారని తెలిపారు.అలాగే లైసెన్సుడ్ సర్వేయర్ పరీక్ష జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో వ్రాత, ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 80 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాస్తున్నారని తెలిపారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.పరీక్ష నిర్వహణలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.ప్రశ్న, జవాబు పత్రాలను పోలీస్ భద్రత నడుమ తరలించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.మంచినీరు సరఫరా చేయాలని, మున్సిపల్, అధికారులు పరీక్షా కేంద్రాల్లో వ్యర్థాలు లేకుండా పరిశుభ్రం చేయాలని ఆదేశించారు.సిబ్బంది, పరీక్ష వ్రాసే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లు, వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యులేటర్స్ తీసుకెళ్లడానికి అనుమతి లేదని, నిశిత పరిశీలన తదుపరి విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించాలని తెలిపారు. తనిఖీ చేసే అధికారులు పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్స్ తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా పకడ్బంధిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం, కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, సూపరింటెండెంట్ శివకుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల ధరఖాస్తులకు ఆహ్వానం



ములుగు జిల్లా ప్రతినిధి, జులై 25 (భారత శక్తి): జిల్లా కేంద్రంలోని ములుగు మెడికల్ కళాశాల లో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జీ స్వర్ణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రొఫెసర్-6, అసోసియేట్ ప్రొఫెసర్-17 , అసిస్టెంట్ ప్రొఫెసర్-28 , సీనియర్ రెసిడెంట్-39, ట్యూటర్-04 గల పోస్టులకు కాంట్రాక్ట్/గౌరవ వేతన ప్రాతిపదికన 2026 సంవత్సరం మార్చి 31 వరకు లేదా అవసరం ఉన్నంత వరకు, ఏది ముందు అయితే అది వరకు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులుకోరనైనదని పేర్కొన్నారు.ములుగు లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ,దాని అనుబంధ ఆసుపత్రిలో పనిచేయడానికి జీవో నెంబర్: 1085, ఫైనాన్స్ హెచ్ ఆర్ ఎం(%ఎ××%) తేది: 29 జూన్ 2025 ప్రకారం. నేడు శనివారం ఉదయం 11 గంటల నుండి ఈనెల 31 మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయని,వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఆగస్టు ఒకటి, రెండు తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.మరింత సమాచారం కొరకు అధికారిక వెబ్‌సైట్ %https://gmcmulugu.org% ను సందర్శించాలని కోరారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ విద్యను బోధించాలి: జిల్లా కలెక్టర్





మల్లంపల్లి/ములుగు జిల్లా ప్రతినిధి, జులై 25 భారత శక్తి) : జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో నూతన సిలబస్ ప్రకారం ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శుక్రవారం ములుగు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ లోని మల్లంపల్లి అంగన్ వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అంగన్వాడి తల్లులతో మాట్లాడారు. పిల్లలు ఇక్కడే భోజనం చేస్తున్నారా , లేదా ఆరా తీశారు. సామ్ పిల్లలు, మ్యామ్ పిల్లల గ్రోత్ ఎలా ఉందని, ఏ ఫుడ్ ఇస్తున్నారు, బాలమృతం ఇస్తున్నారా లేదా అని అడిగితెలుసుకున్నారు. పిల్లలను ప్రతి ఒక్కరూ అంగన్వాడి కేంద్రానికి పంపాలని సూచించారు. కిచెన్ షేడ్ ను, స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యను బోధించాలని, వారితో మమేకమై గేయాలు పాడించలన్నారు. అన్ని అంగన్వాడి కేంద్రాలలో నెలవారి సిలబస్ ను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలకు మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం వేడివేడిగా ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా పిల్లల బరువు, ఎత్తు తూచాలని, బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి సాధారణ బరువు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలకు ఇవ్వాల్సిన పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అతిగా బరువు తక్కువ ఉన్న పిల్లలను ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి రిఫర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రవి, సిడిపిఓ కూచనశిరీష, సూపర్వైజర్ ఖమురునిసా బేగం, అంగన్వాడి టీచర్లు మల్లికాంబ, ప్రియాంక, అంగన్వాడి పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డులతో అర్హులైన పేదలకు మేలు..

### నూతన రేషన్ కార్డుల పంపిణీతో అర్హులైన పేద ప్రజలందరికీ మేలు చేకూరిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.





భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో జూలై 25:నిర్మల్ జిల్లా శుక్రవారం ముధోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డుల జారీతో పేద ప్రజలకు ఉచిత రేషన్ బియ్యం అందుతాయని అన్నారు. ముధోల్ నియోజక వర్గానికి సంబంధించి 11 వేల 352 నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 17609 మంది కుటుంబ సభ్యుల పేర్ల మార్పు, చేర్పులు జరిగాయని అన్నారు. ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో రేషన్ కార్డులు లేని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇక నుంచి ఆ సమస్యలు తీరిపోతాయని చెప్పారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వం ఉచితంగా పోషక విలువలు కలిగి పోర్టిఫైడ్ సన్న బియ్యాన్ని అందిస్తుందన్నారు. గ్రామాల వారిగా అధికారులు ప్రజలందరికీ రేషన్ కార్డులు అందిస్తారని పేర్కొన్నారు.

రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజలు ఎప్పుడైనా నూతన రేషన్ కార్డులకు దరఖాస్తులు, కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. రేషన్ డీలర్లు ప్రజలకు ప్రతీ నెలా క్రమం తప్పకుండా సమయానికి బియ్యాన్ని అందించాలని సూచించారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డుల పంపిణీ చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రేషన్ బియ్యాన్ని అందిస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఈ ఉచిత బియ్యాన్ని బయట అమ్ముకోకుండా, వినియోగించుకోవాలని కోరారు. చాలా ఏండ్ల తర్వాత నూతన రేషన్ కార్డులు ఇవ్వడం మంచి విషయం అని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి రాజేందర్, తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీఓ శివకుమార్, లబ్ధిదారులు, రేషన్ డీలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బక్క దానయ్య ఎన్నిక




ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై25:

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బక్క దానయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22 న హైదరాబాదు లోని బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను ఎన్నుకున్నందుకు ఎస్సి ఎస్టీ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ఐక్యతను కూడగట్టి మేనేజ్మెంట్, ప్రభుత్వ సహకారంతో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వున్న మిగతా అసోసియేషన్ల కంటే భిన్నంగా తమ అసోసియేషన్ ను మరింత అభివృద్ధి పరుస్తానని దానయ్య అన్నారు. భారత రాజ్యాంగం రచించిన అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు అందాల్సిన హక్కులను కాలరాస్తూ నేటివరకు వరకు కూడా పదోన్నతులు పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజ్యాంగ హక్కులను పెండింగ్ సమస్యలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలుపరిచే విధంగా మేనేజ్మెంట్స్ పైన, ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొచ్చి సాధించుకునే దిశగా తమ సంఘం తరపున పోరాడుతామని తెలిపారు.

## జీపీవో, లైసెన్స్డ్ సర్వేయర్ల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో జూలై 25:నిర్మల్ జిల్లా ఈ నెల 27వ తేదీన (ఆదివారం) జరగబోయే గ్రామ పాలనా అధికారులు (జీపీవో), లైసెన్స్ సర్వేయర్ల నియామక పరీక్షలను ఎలాంటి లోటుపాట్లూ లేకుండా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జీపీవో పరీక్ష నిర్వహణకు పట్టణంలోని చాణక్య పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మొత్తం 55 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు అభ్యర్థులను 10 గంటలలోపు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఈ పరీక్షకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని వెల్లడించారు. లైసెన్స్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 85 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ పరీక్షకు ఏడి సర్వే %డ% ల్యాండ్ రికార్డ్స్ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్ష సమయంలో మూసివేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అభ్యర్థులు సెల్ ఫోన్‌లను పరీక్ష కేంద్రాలకు అనుమతిలేదని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఏడి సర్వే %డ% ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఆర్. సుదర్శన్, కలెక్టరేట్ ఏవో సూర్యారావు, పర్యవేక్షకులు మోతిరాం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హయాంలో నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడింది మాజీ మంత్రి..



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో జూలై 25:నిర్మల్ జిల్లా బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హయాంలో నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత ఇంద్రకరణ్ రెడ్డి ఆరోపించారు నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి రెండేళ్లు గడుస్తున్న నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. ఎమ్మెల్యేను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజలకు సేవ చేసే ఆలోచన మహేశ్వర్ రెడ్డికి లేదని, వ్యక్తిగత పనుల కోసం ఆరాటపడుతున్నారని మండిపడ్డారు. గతంలో మంజూరైన పనులను నిలిపివేసి అభివృద్ధి నిరోధకుడిగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కమిషన్ల కోసమే ఆరాటపడుతున్నారని, అభివృద్ధి అనే ఆలోచన లేని వ్యక్తి అని విమర్శించారు. మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, ఫామ్ ఆయిల్ పరిశ్రమ నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని ఆ పరిశ్రమ నిజామాబాద్ జిల్లాకు తరలిపోయే అవకాశం ఉందని అన్నారు. ఓట్లు వేసి గెలిపించిన నిర్మల్ నియోజకవర్గ ప్రజలపై ఆయనకు ఎలాంటి ప్రేమ లేదని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య బీమా ప్రీమియం భారం కాకుండా

ఆర్థిక ప్రణాళికలో ఆరోగ్య బీమా పాలసీ ఎంతో కీలకంగా మారింది. ఊహించని వైద్య ఖర్చులను తట్టుకునేందుకు పూర్తి స్థాయి ఆరోగ్య బీమా పాలసీ అనివార్యం అవుతోంది. మరోవైపు ఈ పాలసీల ప్రీమియం ఏటా 10-15 శాతం వరకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రీమియం భారం కాస్త తగ్గించుకునేందుకు ఉన్న మార్గాలేమిటో తెలుసుకుందాం. ఆరోగ్య బీమా పాలసీని చిన్న వయసులోనే తీసుకోవడం ఎప్పుడూ ముఖ్యం. అప్పుడు బీమా ప్రీమియం తక్కువగా ఉంటుంది. పైగా యువతకు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉండటం చాలా అరుదు. సాధారణంగా వైద్య పరీక్షల అవసరమూ లేకుండానే పాలసీ ఇస్తారు. ఆరోగ్య బీమా పాలసీ పునరుద్ధరణ సమయంలోనూ ప్రీమియం పెంపు స్వల్పంగా ఉంటుంది. ముందుగానే పాలసీ తీసుకుంటే.. చాలా ఏళ్ల వరకూ తక్కువ ప్రీమియానికే పాలసీ తీసుకునే అవకాశం ఉంటుంది. చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఆసుపత్రికి వెళ్లడం అవసరంగా మారుతోంది. ఒక్కసారి ఆసుపత్రికి వెళ్లినా.. రూ.5,000 వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఇలాంటప్పుడూ బీమా పరిహారం ఇచ్చేలా ఓపీడీలాంటి అనుబంధ పాలసీలను ఎంచుకోవాలి. స్వల్పంగా ప్రీమియం పెరిగినా, తర్వాత వచ్చే ప్రయోజనాలు అధికంగానే ఉంటాయి.

ఆరోగ్య బీమా పాలసీకి చెల్లించిన ప్రీమియానికి సెక్షన్ 80డీ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది. సొంతంగా, కుటుంబానికి అంతటికీ తీసుకున్న పాలసీకి చెల్లించిన ప్రీమియానికి గరిష్ఠంగా రూ.25,000 వరకూ పన్ను మినహాయింపు క్లెయిం చేసుకోవచ్చు. తల్లిదండ్రుల కోసం (సీనియర్ సిటిజన్లు) పాలసీ తీసుకున్నప్పుడు రూ.50 వేల వరకూ క్లెయిం చేసుకోవచ్చు. ఇలా పన్ను ఆదా వల్ల మిగిలిన మొత్తాన్ని ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియాన్ని చెల్లించేందుకు వాడుకోవాలి మీ అవసరం, బడ్జెట్‌కు తగిన పాలసీని ఎంచుకోవాలి. రూ.5లక్షల పాలసీని ఎంచుకునేందుకు మార్కెట్లో అందుబాటులో ఉన్న వాటన్నింటినీ పరిశీలించాలి. మీ బడ్జెట్ అనుమతించిన మేరకు ప్రీమియం చెల్లించాలి. అధిక ప్రీమియం పాలసీలను తీసుకోవాల్సిన అవసరమేమీ లేదు. అదే సమయంలో చెల్లింపుల చరిత్ర చూసుకోవడమూ మర్చిపోవద్దు. అవసరం లేని అదనపు సౌకర్యాలను ఎంచుకోవద్దు. దీనివల్ల ప్రీమియం పెరుగుతుంది. ఆరోగ్యకరమైన జీవన శైలి ఉన్నవారికి బీమా సంస్థలు ప్రీమియంలో రాయితీనిస్తున్నాయి.

## ఉన్నత చదువులకు భరోసానిద్దాం...



పిల్లల చదువుల ఖర్చులు ఏటా 7-10 శాతం పెరుగుతున్నాయి. మరోవైపు క్షీణిస్తున్న రూపాయి విలువ దీనికి అదనం. ఒకప్పటితో పోలిస్తే పిల్లల ఉన్నత చదువుల ప్రణాళిక ఇప్పుడు క్లిష్టంగా మారింది. ఈ ఆర్థిక సవాలును అధిగమించేందుకు ఏం చేయాలన్నది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. దీనికి సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. భారతీయుల ఆర్థిక ప్రణాళికల్లో పిల్లల చదువులకే అధిక ప్రాధాన్యం. బడిలో చేరింది మొదలు.. ఉన్నత విద్య వరకూ ఎంత మొత్తం కావాలో ముందే ఆలోచించాల్సిన అవసరం ఉంది. పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే దీర్ఘకాలిక దృష్టితో అధిక రాబడిని అందించే పథకాల్లో మదుపు చేయడం ప్రారంభించాలి. అప్పుడే ఎలాంటి చిక్కులూ లేకుండా పిల్లల ఆశలు తీర్చడంలో తల్లిదండ్రులు విజయం సాధిస్తారని చెప్పొచ్చు.

కాస్త పేరున్న పాఠశాలలో పిల్లలను చేర్చాలంటే ఏడాదికి రూ.1.5 లక్షల వరకూ ఖర్చవుతోంది. దీనికి ఇతర ఖర్చులు అదనం. బడిలో చేరినప్పటి నుంచీ ఉన్నత విద్యాభ్యాసం పూర్తయ్యే వరకూ ఎంత ఖర్చు అవుతుందన్నది ఒక అంచనా వేసుకోవాలి. దీనివల్ల ఎంత మొత్తం పెట్టుబడి పెట్టాలనే విషయంపై ఒక స్పష్టత వస్తుంది. మొత్తం ఒకేసారి అవసరం ఉండదు. దశల వారీగా, ఎప్పుడు ఎంత మొత్తం కావాలి అన్నది తెలుసుకుంటే.. అందుకు అనువైన పథకాల్లో మదుపు చేసేందుకు వీలవుతుంది. పిల్లల అవసరాలకు పెట్టుబడులు పెట్టేటప్పుడు దీర్ఘకాలంలో అధిక రాబడినిచ్చే వాటిని ఎంచుకోవాలి. పలు పథకాల్లో...పిల్లల చదువులకు అవసరమైన మొత్తం కూడబెట్టేందుకు ఏదో ఒక పథకంపైనే ఆధారపడితే సరిపోదు. సురక్షితంగా ఉండే రికరింగ్ డిపాజిట్లు మొదలు.. అధిక నష్టభయం ఉండే షేర్ల వరకూ పెట్టుబడులు ఉండాలి. ఈక్విటీ ఫండ్లతోపాటు, డెట్ పథకాలనూ ఎంచుకోవాలి. అధిక నష్టభయం ఉండే ఈక్విటీ పథకాలకు ఎంత కేటాయించాలి, సురక్షిత పథకాలకు ఎంత మళ్లించాలి అనేదీ కీలకమే. 10-12 ఏళ్ల వ్యవధి ఉన్నప్పుడు ఈక్విటీ ఆధారిత పెట్టుబడులను ఎంచుకోవాలి. 4-5 ఏళ్లలోనే డబ్బు వెనక్కి రావాలనుకుంటే డెట్ పథకాలను పరిశీలించాలి. ఫండ్లలోనూ మదుపుపిల్లల ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థలు ప్రత్యేక పథకాలనూ తీసుకొస్తున్నాయి. చైల్డ్ కెరీర్ ప్లాన్, చైల్డ్ గిఫ్ట్ ప్లాన్ వంటి పేర్లతో ఇవి ఉంటాయి.

సెబీ నిబంధనల ప్రకారం ఈ పథకాలకు అయిదేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది. లేదా పిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకూ.. ఈ రెండింటిలో ఏది ముందయితే అప్పుడు పెట్టుబడిని వెనక్కి తీసుకునే వీలుంటుంది. ఇవి ఓపెన్ ఎండెడ్ హైబ్రిడ్ పథకాలు. ప్రధానంగా ఈక్విటీ, డెట్‌లలో మదుపు చేస్తాయి. అధిక వడ్డీ కోసం కొంత మొత్తాన్ని ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు రుణం ఇచ్చేలా బాండ్లలోనూ కొంత పెట్టుబడి ఉంటుంది. మొత్తంగా వీలైనంత అధిక రాబడిని ఆర్జించేలా, అదే సమయంలో కొంత సురక్షితంగా ఉండేలా పోర్ట్‌ఫోలియోను రూపొందిస్తారు. ఈక్విటీల్లో 65 శాతం వరకూ, డెట్ ఫండ్లలో 35 శాతం వరకూ మదుపు చేస్తాయి. కొన్నిసార్లు ఈక్విటీలకు 75 శాతం వరకూ కేటాయించే అవకాశాలూ ఉంటాయి. కొంత నష్టభయం ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో ఇది పెద్దగా ప్రభావం చూపదు. పిల్లల ఫండ్ల లక్ష్యం ఒకటే.. వారి భవిష్యత్తుకు తగిన ఆర్థిక భరోసా కల్పించడం. వారి ఉన్నత చదువులు, విదేశీ విద్యాభ్యాసం, వారి ఇతర కలలకు తగ్గట్టుగా పెట్టుబడులు పెట్టాలి. వీలైనంత వరకూ లక్ష్యం సాధించే వరకూ ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకోకూడదు. పిల్లల పాలసీలతో...

చాలామంది తల్లిదండ్రుల మొదటి ప్రాధాన్యం తమ పిల్లల కోసం పొదుపు చేయడమే. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకునే వివిధ పెట్టుబడి పథకాల్లో మదుపు చేస్తుంటారు. పిల్లలకు నిజంగా డబ్బు అవసరమైనప్పుడు, వారి అవసరాలను తీర్చేందుకు ఈ ఒక్క వ్యూహం సరిపోదు. పిల్లల అవసరాలకు అవసరమైన మొత్తం డబ్బు అందుబాటులో ఉంటుందని ఏ పథకమూ హామీ ఇవ్వదు. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మ్యూచువల్ ఫండ్లు, షేర్లు, బంగారం,

## వెండిలో పెట్టుబడి లాభమేనా?

బంగారం, వెండి.. ఈ రెండు లోహాలతో భారతీయులకు విడదీయలేని సంబంధం ఉంది. ఆభరణాలు, వస్తువుల రూపంలో వీటిని కొనుగోలు చేసేందుకు అందరూ ఆసక్తి చూపిస్తారు. పెట్టుబడులుగానూ ఇప్పుడు వీటిని నమ్ముతున్నారు. దీర్ఘకాలిక పెట్టుబడి, వైవిధ్యం కోసం చూస్తున్న వారు ఇప్పుడు వెండిని ఒక మదుపు సాధనంగా ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇందులో మదుపు చేస్తే లాభమేనా? పెట్టుబడులు ఎలా పెట్టాలి? తెలుసుకుందాం. కిలో వెండి ధర రూ.లక్షకు చేరుకుంటుంది.. ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తోన్న వార్త ఇది. దేశంలో 2024లో వెండి ధరలు స్థిరమైన వృద్ధితో కొనసాగుతున్నాయి. 2023లో వెండి 7.19 శాతం రాబడినిచ్చింది. ఈ ఏడాది ఇది రూ.86,300 వద్ద కొత్త గరిష్ఠాన్ని తాకింది. కొన్ని బ్రోకరేజీ సంస్థలు కిలో వెండి ధర మధ్యస్థ కాలంలో రూ.1లక్ష నుంచి రూ.1.2 లక్షలకు చేరుకుంటుందని అంచనా వేశాయి. 2017లో కిలో వెండి నగటు ధర రూ.37,825గా ఉంది. 2023లో ఇది రూ.78,600లకు చేరింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇతర ఆర్థిక కారణాల వల్ల ఇటీవలి కాలంలో పసిడి, వెండికి గిరాకీ పెరుగుతోంది. ఊహాజనిత కొనుగోళ్లు, పారిశ్రామిక అవసరాలు పెరుగుతుండటంతోనూ వెండిలో ర్యాలీ కనిపిస్తుండటం గమనించవచ్చు.

# సర్దార్ పై శ్రద్ధ లేదు ఎందుకు..?



బాలీవుడ్ లో పదుల సంఖ్యలో సినిమాలు రిలీజ్ అవుతుంటే ఒకటి అర మాత్రమే ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాలకు అక్కడ గడ్డుకాలం నడుస్తుంది. బాలీవుడ్ లో ఒకప్పుడు సంచలన విజయాలు అందుకున్న వారైనా సరే తమ సినిమాలతో దారుణమైన ఫలితాలు అందుకుంటున్నారు. దీని వెనుక రీజన్స్ ఏంటంటూ బాలీవుడ్ సినీ విశ్లేషకులు సమీక్ష చేస్తున్నా వాళ్లకి కూడా అంతుచిక్కని ప్రశ్నగా ఇది ఉంది. ఐతే ఈ క్రమంలో స్టార్ సినిమాల రిలీజ్ డేట్ పై కూడా అటు ఇటుగా ఉన్నారు. లేటెస్ట్ గా అజయ్ దేవగన్ నటించిన సన్ ఆఫ్ సర్దార్ 2 ని అసలైతే జూలై 25న అంటే నేడు రిలీజ్ చేయాలని అనుకున్నారు. సినిమా ప్రమోషన్స్ లో కూడా జూలై 25న రిలీజ్ అనే ప్రమోట్ చేశారు. కానీ రీసెంట్ గా రిలీజై సూపర్ హిట్ కలెక్షన్స్ తో దూసుకెళ్తున్న సైయారా ముందు అజయ్ దేవగన్ సినిమా నిలబడలేదని సినిమా రిలీజ్ వాయిదా వేశారు. సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమా జూలై 25న రిలీజ్ అవ్వాల్సి ఉన్నా.. దాన్ని ఆగష్టు 1కి వాయిదా వేశారు. ఈ వాయిదా వెనుక రీజన్ సైయారా మూవీ కలెక్షన్స్ తో దూసుకెళ్లడమే అని అంటున్నారు. సైయారా కాస్త దూకుడు తగ్గాక రిలీజైతే సినిమాకు ప్లస్ అని భావిస్తున్నారు. అజయ్ దేవగన్ ఒక యువ నటీనటులు చేసిన సినిమాతో పోటీ పడకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. అది కూడా ఆల్రెడీ ఆ సినిమా రిలీజై వారం తర్వాత కూడా అజయ్ సన్ ఆఫ్ సర్దార్ 2 వస్తుంది. తెలుగులో రాజమౌళి డైరెక్టర్ చేసిన మర్యాద రామన్న సినిమానే హిందీలో సన్ ఆఫ్ సర్దార్ సినిమా రీమేక్ చేశారు. ఐతే మాతృక సినిమా సీక్వెల్ చేయలేదు కానీ అజయ్ దేవగన్ ఆ ప్రయత్నం చేశారు. సినిమా ట్రైలర్ ఈమధ్యనే రిలీజై ఓకే అనేలా ఉంది. మరి సూపర్ హిట్ తెలుగు సినిమాకు సీక్వెల్ హిందీలో రావడం విశేషంగానే ఉన్నా ఆ సినిమాపై ఆశించిన స్థాయి బజ్ లేకపోవడం కష్టమే అని చెప్పొచ్చు. సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమాతో అజయ్ దేవగన్ ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారో చూడాలి. సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమా రిలీజ్ అవుతున్న రోజే దడక్ 2 కూడా వస్తుంది. ఆ సినిమా కూడా సర్దార్ కి ఒక త్రెట్ గా మారుతుందని అంటున్నారు. మరి సర్దార్ ఏం చేస్తాడన్నది మరో వారంలో తెలుస్తుంది.




## ధర్మాన్ని కాపాడే యోధుడిగా దుమ్మురేపిన పవర్ స్టార్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు'గా వెండితెరపై అద్భుతమైన చిత్రాన్ని ఆవిష్కరించారు. హైందవ ధర్మం కోసం పిడికిలి బిగించి, ఔరంగజేబ్ అహంకారానికి సవాల్ విసిరి శత్రువులను నేలరాల్చిన వీరుడు హరిహర వీరమల్లుగా పవన్ బాక్సాఫీస్ ని షేక్ చేస్తున్నారు. వీరమల్లు పాత్రలో పవన్ కళ్యాణ్ పెర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవెల్ లో ఉండటం ప్రేక్షకులని, అభిమానులని ఆకట్టుకుంది. ఇక పవన్ స్వయంగా కంపోజ్ చేసిన యాక్షన్ సీన్‌లు సినిమాకి మేజర్ హైలెట్ గా నిలిచాయి. సనాతన ధర్మ రక్షణ నేపథ్యాన్ని సినిమాలో చాలా గొప్పగా చిత్రీకరించారు. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ లోని ఈ ఎపిసోడ్లు ప్రేక్షకుల్ని అద్భుతంగా ఆకట్టుకున్నాయి. వీరమల్లుగా పవన్ కళ్యాణ్ ధర్మపోరాటం అభిమానులకి కనుల పండువగా నిలిచింది.

# పవన్ 'ఉస్తాద్'.. అప్పుడే కంప్లీట్ అయిపోయిందా?




టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్ లో ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్ గబ్బర్ సింగ్ మూవీ తర్వాత వీరిద్దరి కాంబోలో మరో సినిమా రానుండడంతో ఆడియన్స్ తోపాటు పవన్ అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఓవైపు రాజకీయాల్లో తన కర్తవ్యాన్ని పూర్తి చేస్తూనే.. మరోవైపు ఇప్పటికే అంగీకరించిన సినిమాలు ఒక్కొక్కటిగా కంప్లీట్ చేస్తున్నారు పవన్. ఇప్పటికే హరిహర వీరమల్లు, ఓజీ సినిమా షూటింగ్ లను పవన్ పూర్తి చేశారు. అందులో వీరమల్లు రీసెంట్ గా రిలీజ్ అవ్వగా.. ఓజీ మరికొద్ది నెలల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను కంప్లీట్ చేస్తున్నారు పవన్ కళ్యాణ్. కొద్ది రోజుల క్రితం సెట్స్ లోకి ఆయన అడుగుపెట్టినట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. పవన్ తోపాటు ఇతర కీలక పాత్రధారులు షూటింగ్ కు హాజరైనట్లు తెలిపారు. ఇప్పుడు పవన్ పెండింగ్ పెట్టిన ప్రాజెక్టుల్లో ఉస్తాద్ భగత్ సింగ్ మాత్రం మిగిలి ఉన్న విషయం తెలిసిందే. తాజాగా ఆ సినిమా గురించి పవన్ ఇచ్చిన అప్డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఉస్తాద్ షూట్ తో పాటు రిలీజ్ డేట్ పై మాట్లాడారు. ఉస్తాద్ షూటింగ్ శరవేగంగా జరుగుతుందని.. తన పార్ట్‌కు సంబంధించిన చిత్రీకరణ ఐదారు రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. దీంతో ఒక్కసారిగా అంతా షాక్ అయిపోతున్నారు. అప్పుడే పవన్ కళ్యాణ్ షూటింగ్ పార్ట్ కంప్లీట్ అయిపోయిందా అని ఆశ్చర్యానికి లోనవుతున్నారు. అయితే వరుస కాల్ షీట్స్ ఇవ్వడంతో హరీష్ శంకర్.. జెట్ స్పీడ్ లో షూటింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో సినిమా.. డిసెంబర్ లేదా జనవరిలో రిలీజ్ అవుతుందని కూడా ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అనౌన్స్ చేశారు. ఇప్పుడు ఆ విషయం కూడా వైరల్ గా మారింది. ఎందుకంటే ఇప్పుడు జులైలో వీరమల్లు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అక్కడికి కరెక్ట్ గా రెండు నెలల తర్వాత దసరా కానుకగా ఓజీ సినిమా సందడి చేయనుంది. పవన్ ప్రకటన ప్రకారం.. ఓజీ రిలీజ్ అయిన మూడు నెలలకే ఉస్తాద్ భగత్ సింగ్ రానుంది. మరి ఆ సినిమా.. ఎప్పుడు థియేటర్స్ లో విడుదల అవుతుందో వేచి చూడాలి.



# రామ్ చరణ్ తో జాన్వీ కపూర్ రొమాంటిక్ మెలోడీ!

జాన్వీ కపూర్ టాలీవుడ్ డెబ్యూ 'దేవర'లో గ్లామరస్ పాత్రలోనే కనిపించింది. కానీ తంగ పాత్రలో నటనకు అంతగా స్కోప్ కనిపించలేదు. హీరోతో కాంబినేషన్ సన్నివేశాలు కూడా చాలా పరిమితంగానే ఉన్నాయి. అలా తారక్ తో జాన్వీకి రొమాంటిక్ సన్నివేశాలు చేసే ఛాన్స్ కు దూరమైంది. కానీ 'పెద్ది'లో మాత్రం రామ్ చరణ్ తో రొమాన్స్ కి ఏమాత్రం కొదవలేదన్నది తాజా అప్డేట్. బుచ్చిబాబు కూడా రొమాంటిక్ డైరెక్టరే. హీరోయిన్లను అందంగా ఆవిష్కరించంలో దిట్టే అని తొలి సినిమా 'ఉప్పెన'తోనే ప్రూవ్ చేసాడు. కృతి శెట్టిని వెండి తెరపై అందంగా ఆవిష్కరించిన తీరుకు యువత ఫిదా అయింది. సినిమాలో హీరో-హీరోయిన్ మధ్య మాంచి రొమాంటిక్ సాంగ్ కూడా ఉంటుంది. ఇప్పుడా ఛాన్స్ పెద్దిలో కూడా తీసుకున్నట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం 'పెద్ది' షూటింగ్ హైదరాబాద్ లోనే జరుగుతోంది. తాజా షెడ్యూల్ లో కొంత టాకీ తో పాటు ఓ పాట షూటింగ్ కూడా నిర్వహిస్తున్నారట. ఇది రామ్ చరణ్-జాన్వీకపూర్ మధ్య వచ్చే ఓరొమాంటిక్ మెలోడీ సాంగ్ అట. రెహమాన్ ఈ పాటను ఎంతో హృద్యంగాను డిజైన్ చేసాడట. ప్రేమికుల మధ్య విరహ వేదనను పాటలో హైలైట్ చేయబోతున్నారట. మొత్తానికి ఈ మాస్ కంటెంట్ ఉన్న సినిమాలో రొమాంటిక్ గీతాలకు కూడా బుచ్చిబాబు పెద్ద పీట వేసినట్లు కనిపిస్తుంది. ఈ పాట విషయంలో బుచ్చిబాబు చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడట. యువత హృదయాల్ని దోచేలా ఈ పాట ఉంటుందని భావిస్తున్నాడట. ఈ ప్రాజెక్ట్ లో రెహమాన్ భామగయ్యారు? అంటే అందుకు కారణం కేవలం బుచ్చిబాబు పట్టుదలతోనే. టాలీవుడ్ లో ఎంతో మంది మ్యూజిక్ డైరెక్టర్లు ఉన్నా? వాళ్లందర్నీ కాదని మరీ చరణ్ ని ఒప్పించి రెహమాన్ కావాలని పట్టుబట్టి తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ కోసం రెహమాన్ కూడా అంతే కసిగా పని చేస్తున్నారు. రెహమాన్ కూడా తెలుగు సినిమాకు సంగీతం అందించి చాలా కాలమవుతోంది. మధ్యలో వచ్చిన కొన్ని అవకాశాలు వదులుకున్నా పాన్ ఇడియా స్టార్ రామ్ చరణ్ చాన్స్ ను మాత్రం మిస్ చేసుకోలేదు. మ్యూజికల్ గా ఈ సినిమా సంచలనమవుతుందని అంచనాలైతే పీక్స్ లోనే ఉన్నాయి.

# తారక్ 'వార్ 2'.. ఆ రూట్లో ఫస్ట్ ఇండియన్ మూవీ



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ ప్రముఖ కథానాయకుడు హృతిక్ రోషన్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ వార్-2. స్పై జోనర్ లో యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమాతోనే తారక్.. బీ టౌన్ లోకి ఎంట్రీ ఇస్తున్నారు. దీంతో సినీ ప్రియులు, అభిమానులు.. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ లో భాగంగా రూపొందుతున్న వార్-2ను భారీ బడ్జెట్ తో ఆదిత్య చోప్రా నిర్మిస్తుండగా.. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పుడు ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా చిత్రాన్ని విడుదల చేయనున్నారు. తెలుగు, హిందీతోపాటు తమిళ భాషల్లో సినిమాను రిలీజ్ చేయనున్నారు వార్-2 మేకర్స్. అయితే రిలీజ్ కు ముందే వార్-2 మూవీ అరుదైన ఘనత సాధించింది. క్రేజీ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. దేశవ్యాప్తంగా సినిమా డాల్బీ అట్మోస్ లో రిలీజ్ కానుంది. దీంతో భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న తొలి ఇండియన్ డాల్బీ సినిమాగా వార్-2 నిలవనుంది. అందుకు గాను ఇప్పటికే మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆడియన్స్ కు స్పెషల్ సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ ఇచ్చేందుకు ఆ నిర్ణయం తీసుకున్నట్లు మేకర్స్ తెలిపారు. దీంతో సినీ ప్రియులు, అభిమానులు.. డాల్బీ అట్మోస్ సౌండ్ ను ఫుల్ ఎంజాయ్ చేయనున్నారని తెలిపారు. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో వార్-2 కొత్త శకానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు మేకర్స్. విదేశాల్లో కూడా అత్యధిక సంఖ్యలో డాల్బీ అట్మోస్ షోలను ప్రదర్శించనున్న చిత్రంగా వార్ 2 నిలవనుందని తెలిపారు ఎ



# సెన్సేషనల్ సైయారా.. లెక్క మార్చేసింది..!

బాలీవుడ్ బాక్సాఫీస్ పై సరికొత్త సంచలనాలు సృష్టిస్తున్నారు యువ జంట అహాన్ పాండే.. అనీత్ పడ్డ. మోహిత్ సూరి డైరెక్షన్ లో తెరకెక్కిన సైయారా సినిమాలో వీరిద్దరు జంటగా నటించారు. సినిమా రిలీజ్ ముందు ఒక మోస్తారు బజ్ క్రియేట్ చేయగా లాస్ట్ వీక్ రిలీజైన ఈ సినిమా సూపర్ హిట్ టాక్ తో దూసుకెళ్తుంది. డే బై డే సినిమా లెక్కకు మించి వసూళ్లు రాబడుతుంది. ఇప్పటికే 100 కోట్లు, 150 కోట్ల ఫిగర్స్ దాటేసిన ఈ సినిమా 200 కోట్లకు దగ్గర్లో ఉంది. సైయారా సినిమా ఈ రేంజ్ సెన్సేషన్స్ క్రియేట్ చేయగలదని మేకర్స్ నమ్మినా కూడా సినిమాకు వస్తున్న రెవిన్యూ చూస్తుంటే వాళ్లు కూడా షాక్ అవుతున్నారు. ఒక యువ జంట ఈ రేజ్ బాక్సాఫీస్ విధ్వంసం సృష్టించడం చూసి అవాక్కవుతున్నారు. ప్రస్తుతం బాలీవుడ్ లో సూపర్ ట్రెండింగ్ లో సైయారా ఉంది. సినిమా మౌత్ టాక్ మరింత బలపడింది. రెండో వారం కూడా ఈ సినిమా అదిరిపోయే కలెక్షన్స్ తో దూసుకెళ్తుంది. సినిమాకు బలమైన మౌత్ టాక్ ఎంతగా ప్రభావితం చూపిస్తుందో సైయారా వసూళ్లు చూస్తే అర్ధమవుతుంది. ఐతే ఈ సినిమా ఓటీటీ హక్కులను నెట్ ఫ్లిక్స్ కొనేశారు. మామూలుగా అయితే ఇదివరకు ఒక సినిమా రిలీజైన 8 వారాల తర్వాత ఓటీటీ రిలీజ్ రావాలి. కానీ ఈ కండీషన్ ని ఎప్పుడో బ్రేక్ చేసి ఈమధ్య చాలా సినిమాలు ముఖ్యంగా మంచి సక్సెస్ అయిన సినిమాలు, పెద్దగా మెప్పించని సినిమాలు ఇలా అన్ని కూడా 3, 4 వారాల లోపే ఓటీటీలో ప్రత్యక్షమవుతున్నాయి. సైయారా సినిమా థియేట్రికల్ రన్ సూపర్ సాలిడ్ గా దూసుకెళ్తుంది. అందుకే యష్ రాజ్ ఫిలింస్ ఈ సినిమాను ఈ ఇయర్ దీపావళికి ఓటీటీ రిలీజ్ ప్లాన్ చేశారు. నెట్ ఫ్లిక్స్ లో అందరికీ అందుబాటులో ఉండేలా ఈ సినిమా ప్లాన్ చేస్తున్నారు. అంతేకాదు నెట్ ఫ్లిక్స్ రిలీజ్ తర్వాత కూడా ఎలాంటి ఎక్స్ ట్రా ఛార్జ్ లాంటివి లేకుండా సినిమా చూసేలా ఏర్పాటు చేస్తున్నారట. మొత్తానికి థియేట్రికల్ హిట్ మాత్రమే కాదు ఓటీటీ విషయంలో కూడా చాలా మంచి ఆలోచనతోనే ఇలా చేస్తున్నారని చెప్పొచ్చు. సో సైయారా ఓటీటీ ఎంత లేట్ అయితే అంత లాంగ్ రన్ ఉండే ఛాన్స్ ఉంటుంది. అంతేకాదు దానికి తోడు అదే రేంజ్ వసూళ్లు కూడా వచ్చే అవకాశం ఉంది.

## పవన్ కళ్యాణ్ వీరమల్లు ఆల్ టైం రికార్డ్



పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' సరికొత్త చరిత్ర సృష్టించింది. వీరమల్లు కలెక్షన్స్ అద్భుతంగా ఉన్నాయి. పవన్ కళ్యాణ్ ఇంత గ్యాప్ తర్వాత సినిమా చేసినా తన బాక్సాఫీస్ స్టామినా చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. హరిహర వీరమల్లు కలెక్షన్స్ లో ఆల్ టైం రికార్డ్ క్రియేట్ చేసింది. సనాతన ధర్మం నేపథ్యంలో సాగిన కథలోని భావోద్వేగాలు ప్రేక్షకులను అద్భుతంగా అలరిస్తున్నాయి. థియేటర్స్ పవర్ స్టార్ నినాదాలతో మారుమ్రోగుతున్నాయి. పవన్ కళ్యాణ్ యాక్షన్, పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ తెప్పించింది. స్వధర్మం నేపథ్యంలోని సన్నివేశాలు సినిమాని మరోస్థాయికి తీసుకెళ్ళాయి. కమర్షియల్ సినిమాలో సనాతన ధర్మ నేపథ్యాన్ని యాడ్ చేయడం సరికొత్త అనుభూతిని ఇచ్చింది. ఇప్పుడు వీరమల్లు కలెక్షన్స్ లో కూడా సరికొత్త రికార్డులని క్రియేట్ చేస్తూ దూసుకుపోతుంది.

# జొమాటోలో ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు.. 'ఇంటర్ సిటీ' సేవలకు గుడ్‌బై




ప్రముఖ ఫుడ్‌డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమటో ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచింది. ఇక నుంచి ప్రతి ఆర్డర్‌పై రూ.5 చొప్పున దీనిని వసూలు చేయనుంది. ఏప్రిల్ 20 నుంచే పెరిగిన ఫీజు అమల్లోకి వచ్చింది. దేశ రాజధాని ప్రాంతం, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్, లఖ్‌నవూ వంటి ప్రధాన మార్కెట్లలో ఇప్పటికే యూజర్ల నుంచి దీనిని వసూలు చేస్తోంది. మరో ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ఇప్పటికే ఒక్కో డెలివరీకి రూ.5 చొప్పున వసూలు చేస్తోంది.జొమాటో తొలిసారి 2023 ఆగస్టులో ప్లాట్‌ఫాం ఫీజును ప్రవేశపెట్టింది. తొలుత ఆర్డర్‌కు రూ.2 చొప్పున వసూలు చేసేది. అక్టోబర్‌లో దాన్ని రూ.3, జనవరిలో రూ.4కు పెంచింది. తాజాగా రూ.5కు చేర్చింది. సాధారణంగా ఫుడ్ డెలివరీ సంస్థలు ఆహారంతో పాటు డెలివరీ ఛార్జీని వసూలు చేస్తాయి. కంపెనీ ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్లాట్‌ఫామ్ ఫీజును కొత్తగా ప్రవేశపెట్టాయి. జొమాటోకే చెందిన బ్లింకిట్ ఈ ఫీజును రూ.2 చొప్పున వసూలు చేస్తోంది. ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు నేపథ్యంలో జొమాటో షేరు 2.22 శాతం లాభంతో రూ.193.40 వద్ద ముగిసింది.క్వైట్ ఫైరింగ్.. పొమ్మనలేక పొగబెట్టడం..!ఇంటర్ సిటీ సేవలకు స్వస్తిఇంటర్‌సిటీ లెజెండ్స్ పేరిట ఒక నగరంలో బాగా ప్రాచుర్యం పొందిన ఆహార పదార్థాలను ఇతర నగరాల్లోనూ సరఫరా చేసే సేవలను జొమాటో తాజాగా నిలిపివేసింది. ఊహించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సేవల విషయంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తడమూ మరో కారణమని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2022 తొలుత వీటిని ప్రారంభించిన జొమాటో.. తక్కువ సమయంలోనే డెలివరీ చేసేందుకు వీలుగా తమ గోదాముల్లో వీటిని ముందుగానే అందుబాటులో ఉంచుతోంది. దీనిపై దిల్లీకి చెందిన ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం ఇంకా కోర్టు పరిధిలోనే ఉంది. దీనికి తోడు ఇంటర్‌సిటీ డెలివరీ సేవలకు సంబంధించిన హెడ్ సిద్ధార్థ్ జవార్ కొద్ది నెలలకే బాధ్యతల నుంచి వైదొలగడమూ మరో కారణం.

# ఏఐకి డేటా కంటే విలువైనది ఇదే.. మార్క్ జుకర్‌బర్గ్ అంచనా



ఏఐకి డేటా కంటే విలువైనది మరొకటి ఉందని మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు. అదేంటి? ఎలా ఉపయోగపడుతుందో చూద్దాం..!ప్రముఖ టెక్ సంస్థ మెటా ఇటీవల లామా-3 ఏఐ మోడల్స్‌ను విడుదల చేసింది. వాటిని వాట్సప్, మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్‌కు అనుసంధానం చేసింది. ఈసందర్భంగా భవిష్యత్తులో కృత్రిమ మేధ (%ాతీఱటఱఙఱశ్రీ ×ఞవశ్రీశ్రీఱస్త్రవఅషవ-ూ×%) పనితీరును నిర్దేశించబోయే అంశమేంటో సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ వెల్లడించారు. అది డేటా మాత్రం కాదని స్పష్టంచేశారు."ఏఐ మోడల్‌లో డేటా కంటే ఫీడ్‌బ్యాక్ లూప్‌లు చాలా విలువైనవిగా మారతాయని నా నమ్మకం" అని జుకర్‌బర్గ్ వెల్లడించారు. ఏఐ మోడల్స్‌ను ట్రైన్ చేయడం, మెరుగుపర్చడం కోసం ఫీడ్‌బ్యాక్ లూప్‌లను ఉపయోగిస్తారు. ఇవి గత ఔట్‌పుట్‌ల ఆధారంగా పని చేస్తాయి. తప్పులు జరుగుతున్న సమయంలో ఏఐ మోడల్స్‌కు వాటిని గుర్తు చేసి, అవగాహన కల్పించే అల్గారిథమ్‌లనే లూప్స్‌గా వ్యవహరిస్తారు. పనితీరును మెరుగుపర్చుకోవడానికి కావాల్సిన డేటాను కూడా అవి అందిస్తాయి. ఏఐ మోడల్స్‌ను ఉపయోగించడం, వాటిలోని లోపాలను గుర్తించడం, ఫీడ్‌బ్యాక్ రూపంలో వాటిని అందించి మెరుగుపర్చడమనే ప్రక్రియ భవిష్యత్తులో చాలా విలువైనదిగా మారుతుందని జుకర్‌బర్గ్ వివరించారు.సింథటిక్ డేటా సైతం కీలకపాత్ర పోషిస్తుందని జుకర్‌బర్గ్ అన్నారు. వాస్తవ ప్రపంచంలో ఎదురయ్యే సమస్యల్ని గుర్తించి.. వాటిని పరిష్కరించేందుకు ఉన్న వివిధ పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. వాటిలో ఏది సత్ఫలితాలిస్తుందో కనిపెడతారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్నే సింథటిక్ డేటాగా వ్యవహరిస్తున్నారు. వాస్తవ రూపంలో ఆ సమస్య తలెత్తడం, దాన్ని పరిష్కరించడం జరగకపోయినప్పటికీ.. వాటిని ఊహించుకుని ముందే ఆయా పరిష్కారాలతో ఏఐ మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడానికి ఈ సింథటిక్ డేటా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చాలా కంపెనీలు ఇప్పుడు దీన్ని అభివృద్ధి చేసే పనిలో ఉన్నాయి.

# క్వైట్ ఫైరింగ్.. పొమ్మనలేక పొగబెట్టడం..!

కొంత కాలంగా అనేక కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. 2024లోనూ అది కొనసాగుతోంది. ముఖ్యంగా టెక్ రంగంలో మరింత ఎక్కువగా ఉంది. ఆర్థిక అనిశ్చితులతో పాటు సాంకేతికంగా వచ్చిన అనేక కొత్త మార్పులే దీనికి కారణం. ఈ క్రమంలో కంపెనీలు ఉద్యోగులను తీసివేసే విషయంలో వివిధ పద్ధతులను అనుసరిస్తున్నాయి. కొన్ని నేరుగా తొలగిస్తే.. మరికొన్ని పరోక్షంగా ఉద్యోగులు వారికి వారే వైదొలిగేలా చేస్తున్నాయి. ఈ క్రమంలో వచ్చిందే క్వైట్ ఫైరింగ్ (%ఙబఱవ్ ఫీఱతీఱఅస్ర).

ఏంటీ క్వైట్ ఫైరింగ్?

పొమ్మనలేక పొగబెట్టడం అనే సామెత వినే ఉంటారు! క్వైట్ ఫైరింగ్ అంటే సరిగ్గా అదే. ఉద్యోగులను తీసేయాలనుకున్నప్పుడు.. కంపెనీలోని పరిస్థితులను యాజమాన్యాలు అసౌకర్యంగా మారుస్తాయి. నేరుగా పొమ్మని చెప్పలేక ఈ తరహా పద్ధతులను అనుసరిస్తుంటాయి. వసతులను తగ్గించడం, పనిలో ప్రాధాన్యం లేకుండా చేయడం, అధిక పనిభారం, పనిగంటలను పెంచడం, ఏమాత్రం అవగాహనలేని పనిని అప్పగించడం.. వంటివి చేస్తుంటాయి. ఫలితంగా ఉద్యోగికి విసుగు, చిరాకు పుట్టి తనకు తానే వైదొలిగే పరిస్థితులను సృష్టిస్తాయి.ఒక్కోసారి ఉద్యోగులు చేసే ప్రతి పనిని వారి బాస్‌లు విమర్శిస్తుంటారు. ఏం పని చేసినా దానిపై నిఘా వేస్తారు. ఏమాత్రం పొరపాటు దొర్లినా స్పందించే తీరు చాలా కఠినంగా ఉంటుంటుంది. ఉద్యోగుల సంఖ్యను ఎలాగైనా తగ్గించాలని కంపెనీ నుంచి వచ్చే ఒత్తిడి మేరకే ఇలాంటి చర్యలు చేపడుతుంటారు. సంస్థ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి.. ఇక చేసేది లేనప్పుడు ఇలాంటి పోకడలను అనుసరిస్తారు. తద్వారా సిబ్బందిని తగ్గించుకునే ప్రయత్నం చేస్తారు.ఎందుకు ఇలా..కంపెనీ తమ సిబ్బందిని తగ్గించుకోవాలనుకున్నప్పుడు ఈ పద్ధతులను అనుసరిస్తుంటాయి. అయితే, నేరుగా లేఆఫ్ చేసే అవకాశం ఉంటుంది. కానీ, అలా చేస్తే నిబంధనల ప్రకారం.. కొన్ని రకాల పరిహారాలు చెల్లించాలి. అప్పటి వరకు ఉన్న బకాయిలను ఇచ్చేయాలి. లీవ్‌లు, ప్రోత్సాహకాలేమైనా మిగిలిపోయి ఉంటే వాటిని క్లెయిం చేసుకునే హక్కు ఉద్యోగికి ఉంటుంది. లీగల్‌గానూ సవాళు ఎదురయ్యే అవకాశం ఉంది. వీటన్నింటి నుంచి తప్పించుకునేందుకు కంపెనీలు క్వైట్ ఫైరింగ్ (%ఙబఱవ్ ఫీఱతీ-ఱఅస్ర%) వంటి పద్ధతులను అనుసరిస్తాయి.డ్రై ప్రమోషన్.. జాబ్ మార్కెట్‌లో ఇదో కొత్త ట్రెండ్‌దువ్వూరిఎలా గుర్తించడం..

కొన్ని సంకేతాలను బట్టి ఒక ఉద్యోగి తనపై క్వైట్ ఫైరింగ్‌జరుగుతోందని గుర్తించొచ్చు. ప్రమోషన్లు-ఇంక్రిమెంట్లు ఆపడం, పనిభారం పెంచడం, పనివేళల్లో మార్పులు, వసతులను



తగ్గించడం, ప్రోత్సాహకాలను కుదించడం, బోనస్‌లు ఆపేయడం, ఫీడ్‌బ్యాక్ తీసుకోకపోవడం, కీలక నిర్ణయాల్లో భాగస్వాములను చేయకపోవడం, సెలవులు నిరాకరించడం వంటి సంకేతాలను బట్టి క్వైట్ ఫైరింగ్ జరుగుతోందని గుర్తించొచ్చు.తొందరపడొద్దు..వీటిలో కొన్నింటిని గుర్తించినంత మాత్రాన.. కంపెనీ మిమ్మల్ని వదిలించుకోవాలి అనుకుంటుందనే నిశ్చితాభిప్రాయానికి రావాల్సిన అవసరం లేదు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు. ఒకసారి మిమ్మల్ని మీరు ఆత్మపరిశీలన చేసుకోవాలి. మీలో ఏమైనా పరిమితులు ఉంటే వాటిని అధిగమించేందుకు ప్రయత్నించాలి. మీ బాస్‌తో మాట్లాడి పరిస్థితిని అంచనా వేయాలి. మొత్తంగా సంస్థకు మీరొక 'అసెట్'గా మారేందుకు కృషి చేయాలి. మీవైపు ఏ పొరపాటు లేదని గుర్తిస్తే మాత్రం.. వెంటనే అప్రమత్తమై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం మేలు!నిజానికి క్వైట్ ఫైరింగ్ అనేది కొత్త కాన్సెప్ట్ ఏమీ కాదు. ఇలాంటి పద్ధతులు ఎప్పటి నుంచో రహస్యంగా అమలవుతూనే ఉన్నాయి. కానీ, ఇటీవల తొలగింపులు పెరగడం.. దానికి కార్పొరేట్ సంస్కృతిలోని కొత్త ధోరణులు తోడవ్వటంతో ఈ ట్రెండ్ ప్రాచుర్యంలోకి వచ్చింది. అంతర్జాతీయ స్థాయి బడా సంస్థలు సైతం ఈ తరహా విధానాలను అవలంబిస్తున్నాయని కొన్ని ప్రముఖ సర్వేలు వెల్లడిస్తున్నాయి.క్వైట్ హైరింగ్ కూడా ఉంది..

క్వైట్ ఫైరింగ్ తరహాలోనే క్వైట్ హైరింగ్ (%ఙబఱవ్ ఎఱతీ-ఱఅస్ర%) అనే ట్రెండ్ కూడా ఆ మధ్య వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కొత్త వారిని నియమించుకోకుండానే కంపెనీలోనే కావాల్సిన నైపుణ్యాలున్న వ్యక్తిని కనిపెట్టడాన్నే క్వైట్ హైరింగ్ (%ఙబఱవ్ ఎఱతీఱఅస్ర%)గా వ్యవహరిస్తున్నారు. సంస్థలో అంతర్గతంగా ఇతర విభాగాల్లో ఉండే ఉద్యోగులను ఖాళీగా ఉన్న స్థానాల్లో భర్తీ చేయడమే ఈ కొత్త ట్రెండ్. ఉద్యోగుల కొరత ఉండి, టార్గెట్‌లు అందుకోవడానికి గడువు సమీపిస్తున్న సమయంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# అంచనాలు మించిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశీయ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 17.7% పెరిగి రూ.19.58 లక్షల కోట్లకు చేరాయని పన్ను విభాగం ఆదివారం వెల్లడించింది. బడ్జెట్‌లో సవరించిన అంచనాలను మించి పన్ను వసూళ్లు నమోదయ్యాయని పేర్కొంది. ఆదాయపు పన్ను, కార్పొరేట్ పన్నుల నికర వసూళ్లు బడ్జెట్ తొలి అంచనాల కంటే రూ.1.35 లక్షల కోట్లు (7.4%), సవరించిన అంచనాల కంటే రూ.13,000 కోట్లు (0.67%) అధికంగా నమోదైనట్లు తెలిపింది. ఫిబ్రవరి 1న సమర్పించిన తాత్కాలిక బడ్జెట్‌లో 2023-24 ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని ప్రభుత్వం రూ.19.45 లక్షల కోట్లకు సవరించింది. 2023-24లో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు (తాత్కాలిక) 18.48% పెరిగి రూ.23.37 లక్షల కోట్లకు చేరాయి. నికర వసూళ్లు (రిఫండ్లు మినహాయించాక) 17.7% వృద్ధితో రూ.19.58 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఆర్థిక వ్యవస్థలో ఉత్సాహాన్ని, వ్యక్తులు, కార్పొరేట్ల ఆదాయ స్థాయి పెరుగుదలను ఇది సూచిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.3.79 లక్షల కోట్ల రిఫండ్ అందించినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) తెలిపింది.2022-23లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.16.64 లక్షల కోట్లుగా నమోదు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.18.23 లక్షల కోట్ల లక్ష్యాన్ని ప్రభుత్వం తొలుత నిర్దేశించుకుంది. తర్వాత రూ.19.45 లక్షల కోట్లకు సవరించింది. అంతకుమించి రూ.13,000 కోట్ల మేర అదనపు వసూళ్లు రావడం విశేషం.

స్థూల కార్పొరేట్ పన్ను వసూళ్లు (తాత్కాలిక) 13.06% పెరిగి రూ.11.32 లక్షల కోట్లకు చేరాయి. 2022-23లో ఇవి రూ.10 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో నికర




కార్పొరేట్ పన్ను వసూళ్లు (తాత్కాలిక) రూ.8.26 లక్షల కోట్ల నుంచి 10.26% పెరిగి రూ.9.11 లక్షల కోట్లకు చేరాయి.స్థూల వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు (సెక్యూరిటీల లావాదేవీ పన్నుతో కలిపి) రూ.9.67 లక్షల కోట్ల నుంచి 24.26% పెరిగి రూ.12.01 లక్షల కోట్లకు చేరాయి. నికర వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళు రూ.8.33 లక్షల కోట్ల నుంచి 25.23% పెరిగి రూ.10.44 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్‌లు రూ.3.09 లక్షల కోట్ల నుంచి 22.74% పెరిగి రూ.3.79 లక్షల కోట్లకు పెరిగాయి.పరోక్ష పన్ను వసూళ్లు కూడా సవరించిన అంచనా రూ.14.84 లక్షల కోట్ల కంటే అధికంగానే నమోదయ్యాయని, రికార్డు స్థాయిలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఇందుకు దోహదపడ్డాయని ప్రభుత్వాధికారి ఒకరు వెల్లడించారు. పరోక్ష పన్ను వసూళ్లు (కస్టమ్స్, కేంద్ర ఎక్సైజ్ సుంకాలతో కలిపి) గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల కంటే బాగా నమోదైనందుకు ఆనందంగా ఉందని సీబీఐసీ ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ క్షేత్ర స్థాయి అధికారులకు ఇటీవలే లేఖ రాశారు.

# ఆరోగ్య బీమాకు వయోపరిమితి రద్దు

దిల్లీ: ఆరోగ్య బీమా రంగంలో విప్లవాత్మక మార్పులకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ శ్రీకారం చుట్టింది. ఆరోగ్య బీమా పాలసీ కొత్తగా కొనుగోలు చేసేందుకు, ఇప్పటివరకు ఉన్న 65 ఏళ్ల వయోపరిమితిని రద్దు చేసింది. దీంతో ఇకపై ఏ వయసువారైనా ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవచ్చు. ఏప్రిల్ 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చిందని ఐఆర్‌డీఏఐ గెజిట్ నోటిఫికేషన్‌లో తెలిపింది. ఈ నిర్ణయంతో ఆరోగ్యసంరక్షణ వ్యయాల నుంచి పాలసీదార్లకు రక్షణ లభిస్తుందని, బీమా మార్కెట్ విస్తరిస్తుందని ఐఆర్‌డీఏఐ భావిస్తోంది. 'అన్ని వయసుల వారికి ఆరోగ్య బీమా పాలసీలను కంపెనీలు తీసుకురావాలి. వయోవృద్ధులు, విద్యార్థులు, పిల్లలు, గర్భిణీలు, ఇతర వర్గాల వారి కోసం ప్రత్యేకంగా బీమా పాలసీలను రూపొందించాలి' అని ఐఆర్‌డీఏఐ ఇటీవలి గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న వారికీ, ఆరోగ్య బీమా పాలసీలను అందించాలని సంస్థలను ఆదేశించింది. క్యాన్సర్, గుండె జబ్బు, ఎయిడ్స్ వంటి క్లిష్టతరమైన వ్యాధులతో బాధపడుతున్నారంటూ, ఆరోగ్య బీమా పాలసీలను నిరాకరించడం ఇక కంపెనీలకు కుదరదు.పాలసీదార్ల సౌకర్యార్థం బీమా ప్రీమియం



మొత్తాన్ని వాయిదాల్లో చెల్లించేందుకు కంపెనీలు అనుమతి ఇవ్వొచ్చు. ప్రయాణ పాలసీలను సాధారణ, ఆరోగ్య బీమా సంస్థలు మాత్రమే అందించాలి.ఆయుష్ చికిత్స కవరేజీకి పరిమితి లేదు. ఆయుర్వేద, యోగా, నేచురోపతి, యునాని, సిద్ధా, హోమియోపతి వంటి చికిత్సలకు కూడా బీమా మొత్తం లభిస్తుంది. ప్రయోజన ఆధారిత పాలసీలు కలిగిన పాలసీదార్లు పలు సంస్థల వద్ద క్లెయిమ్‌లు దాఖలు చేసుకోవచ్చు. వయోవృద్ధుల క్లెయిమ్‌లు, ఫిర్యాదులను ప్రత్యేక వ్యవస్థ ద్వారా పరిష్కరించాలి.

# సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారు కొనుగోలు ప్రయోజనమేనా?

సొంతంగా కారును కొనుగోలు చేసి దానిలో తమ దైనందిన కార్యక్రమాలకు వెళ్లడానికి చాలా మంది ఆసక్తి చూపుతారు. మరికొందరు ఏదో ఒక కారు అని కాకుండా విలాసవంతమైన కారును సొంతం చేసుకోవడానికి ఇష్టపడతారు. విలాసవంతమైన కారు కొనడం అనేది చాలామందికి ఒక కల. దీంతో చాలామంది సెకండ్ హాండ్ లగ్జరీ కారును కొనుగోలు చేసి తమ కలను నెరవేర్చుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్ల మార్కెట్ భారత్‌లో ఏటా 15-20% వృద్ధి చెందుతోంది. నగటున సంవత్సరానికి 60 వేలకు పైగా విక్రయాలు జరుగుతున్నాయి. వివిధ కార్ల కంపెనీలు కూడా సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్ల అమ్మకాల నిమిత్తం అనేక షోరూంలను తెరిచి బ్యాంకు లోన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాయి. సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్లను కొనడం ప్రయోజనమేనా?చాలామంది కారు కొనుగోలు చేయడానికి సిద్ధమైనా దాని ధర చూసి ఆగిపోతారు. లగ్జరీ కారు అయితే ధర ఎక్కువే ఉంటుంది. అయితే, కొత్త కారు షోరూం నుంచి బయటకు వచ్చిన వెంటనే, దాని విలువ మార్కెట్లో తగ్గుతుంది. 6 నెలల నుంచి 1 సంవత్సరం వ్యవధిలో కారు 15-25 శాతం విలువను కోల్పోతుంది. వాహనం ఐదేళ్ల తర్వాత దాదాపు సగం విలువను కోల్పోతుంది. అదే విధంగా తరుగుదల రేటు ప్రతి సంవత్సరం గడిచేకొద్దీ పెరుగుతూనే ఉంటుంది. ఇది కొత్త కార్లను కొనుగోలు చేసిన యజమానులకు నష్టం అయినప్పటికీ, వారి నుంచి ఈ వాహనాలను కొనుగోలు చేసే వినియోగదారులకు లాభదాయకం. అంతేకాకుండా, కొత్త కారుతో పోల్చితే సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారు ధరలు చాలా నెమ్మదిగా తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితిలో సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారును కొనుగోలు చేయడం మంచి ఎంపిక.తక్కువ ధరలో లగ్జరీ కారునాన్ లగ్జరీ కారు కొనుగోలు బడ్జెట్ కాస్త పెంచితే సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారును కొనుగోలు చేయొచ్చు. ఆడి, బీఎండబ్ల్యూ, మెర్సిడెజ్ బెంజ్, ల్యాండ్ రోవర్ వంటి బ్రాండ్ల సెకండ్ హ్యాండ్ లగ్జరీ కారు సగటు ధర రూ.25-40 లక్షలు వరకు ఉంటుంది. ఇవే కొత్తవి అయితే రూ.50-65 లక్షల నుంచి ప్రారంభమవుతాయి. ఉదాహరణకు కొత్త %దీవీఔ% 3 సిరీస్ 320%ఱ% లగ్జరీ ఎడిషన్ ధర 60.50 లక్షలయితే.. అదే 2015 మోడల్‌ను రూ.21-22 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. ఇది కొత్త టొయోటా ఇన్నోవా క్రిస్టా, లేదా హ్యుందాయ్ వెర్నా ఎస్ఎక్స్ ధరతో సమానంగా ఉంటుంది. కాబట్టి, ప్రీ ఓన్డ్ లగ్జరీ కారు లాభదాయకమైన ఆఫర్ అని చాలా మంది కొనుగోలుదారులు భావిస్తున్నారు.అధునాతన ఫీచర్లువివరైనా సౌకర్యాలు ఆశించి కారును కొనుగోలు చేస్తారు. సాధారణ కార్లతో పోలిస్తే లగ్జరీ కార్లు చాలా సురక్షితమైనవి. లగ్జరీ కార్లలో సౌకర్యాలు చాలా ఎక్కువే ఉంటాయి. 6/7 ఎయిర్ బ్యాగ్‌లు, రివర్స్ పార్కింగ్ సెన్సార్స్, హిల్-హోల్డ్ అసిస్ట్, క్రూయిజ్ కంట్రోల్, జీపీఎస్ ట్రాకింగ్, 360 డిగ్రీ కెమెరా సదుపాయం వంటి యాంటీ-థెఫ్ట్ ఫీచర్స్‌తో పాటు బ్లైండ్ స్పాట్ మానటరింగ్ ఎనేబుల్ చేయడానికి కార్లు ఆటోమేటిక్, అధునాతన సెన్సార్‌లు ఉంటాయి. నాన్ లగ్జరీ కార్లలో లేని ఫీచర్లు.. సెకండ్ హ్యాండ్ లగ్జరీ కార్లలో కనిపిస్తాయి. వినియోగదారులు నిరంతరం అధునాతన సాంకేతికతలు, ఫీచర్లు, డిజైన్లు, హై-ఎండ్ టెక్నికల్ ఫీచర్లను, భద్రతను కోరుకుంటారు. ఇటువంటి అన్ని అంశాలు గల లగ్జరీ కారును సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లో కొనుగోలు చేయడం వినియోగదారులకు మేలే అని చెప్పవచ్చు.సెకండ్ హ్యాండ్ కార్లకు బీమా ఖర్చులపై గణనీయమైన తగ్గింపు ఉంటుంది. కారు వయసును పరిగణనలోకి తీసుకుంటే, బీమా ప్రీమియం మొత్తం స్థిరంగా తగ్గుతుంది. బీమా కోసం చెల్లించాల్సిన మొత్తం సాధారణంగా కారు ప్రస్తుత విలువపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ప్రమాదం జరిగినప్పుడు మరమ్మతులకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉండడంతో బీమా కంపెనీలు కొత్త వాహనాలకు అధిక ప్రీమియం వసూలు చేస్తాయి. ప్రీ-ఓన్డ్ లగ్జరీ కార్ల ధరలు తక్కువే ఉంటాయి. కాబట్టి, బీమా ప్రీమియం తక్కువే ఉంటుంది. కారు పై క్లెయిమ్స్ లేకపోతే %చీజదీ% ప్రయోజనం కూడా పొందొచ్చు.మెయింటెనెన్స్‌సాధారణంగా లగ్జరీ కార్లను వాటి యజమానులు తమ సొంత పనులపై బయటకు వెళ్లడానికి మాత్రమే ఉపయోగిస్తారు

Printed and Published by Kesaram Penta Reddy on behalf of Bharatha Sakthi Publications Pvt Ltd, Printed at Bharatha Sakthi Publications Pvt Ltd, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar, RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar, Ranga Reddy(Dist), Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy